సత్యమేవ జయతే

సాక్షి


'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 317

బుధవారం 7-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వాసమల్లి

జెఎల్‌ఎఫ్ 2024



నీలగిరి కొండల తొలి వెలుతురు

'నీలగిరుల్లోని ప్రతి కొండ మాకు దేవునితో సమానం' అంటుంది వాసమల్లి. నీలగిరిలో అంతరించిపోతున్న 'తోడా' తెగకు చెందిన వాసమల్లి ఆ తెగలో మొదటి గ్రాడ్యుయేట్. లిపిలేని తోడా భాషకు డిక్షనరీ తయారు చేసే పనిలో ఉంది. తోడా తెగ పాటలను సేకరిస్తే సాహిత్య అకాడెమీ ప్రచురించింది. 'చంద్రునిలో ఉండే కుందేలు మా తెగదేనని మా విశ్వాసం' అందామె. 'ఊటీ' అని అందరూ పిలుచుకునే 'టూరిస్ట్ కేంద్రం'లో తోడా తెగ విశిష్ట జీవనాన్ని నమోదు చేస్తున్న వాసమల్లి జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో మాట్లాడింది.

'నీలగిరి కొండల్లో విహారానికి వచ్చేవాళ్లు మేం మాట్లాడుకునే భాష విని భలే ఉందే, ఇదేం భాష అనుకుంటారు. మా తర్వాతి తరాలు అలా అనుకోకూడదని తోడా భాషను కాపాడే ప్రయత్నం చేస్తున్నాను. మా భాషకు లిపి లేదు. కాని యాభైకి మించిన ధ్వన్యక్షరాలు ఉన్నాయి. వాటిని నమోదు చేస్తున్నాను. తోడా డిక్షనరీ తయారు చేస్తున్నాను. తోడాలు పాడుకునే పాటలు, చెప్పుకునే కథలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని సేకరించి పుస్తకం వేశాను' అంటుంది వాసమల్లి.

అరవై ఏళ్లు దాటిన వాసమల్లి కేవలం 1500 మంది మాత్రమే మిగిలిన తోడా తెగకు ప్రతినిధి.'నీలగిరుల్లో మొత్తం ఆరు తెగలు ఉన్నాయి. అన్నీ అంతరించిపోయే ప్రమాదపు అంచున ఉన్నాయి' అంటుందామె.

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో జానపదుల కథల గురించి మాట్లాడడానికి వచ్చిన వాసమల్లి 'ఆదిమ తెగలు మానవ నాగరికతకు పాదముద్రలు. భాష మరణిస్తే సమూహం కూడా మరణిస్తుంది. మా తోడా భాష ఎంతో సుందరమైనది. మా తర్వాతి తరాలు దానిని కాపాడుకోవాలనేదే నా తపన' అంది.

బర్రెలే ఆస్తి

'తోడాలకు బర్రెలే ఆస్తి. నీలగిరుల్లోని కొండ బర్రెలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని 'ఇర్ర్' అంటారు. వాటి పాల నుంచి తీసిన నెయ్యితో మాత్రమే మేము దేవుని దీపాలను వెలిగించాలి. వాటిని మేము దైవాంశాలుగా చూస్తాం. తోడాలు శాకాహారులు. ఇర్ర్‌లను కోయడం, తినడం చేయం. మా తోడాల్లో ఎవరైనా చనిపోతే ఒక బర్రెను ఎంపిక చేసి పడమరవైపు తోలేస్తాం. అది కూడా ఏదో ఒక రోజున మరణించి ఆ చనిపోయిన వ్యక్తి దగ్గరకు తోడు కోసం వెళుతుందని మా నమ్మకం' అని చెప్పిందామె.

> **ఆయుష్మంతులు**
>
> తోడాలు కొండగొర్రెల్లా తిరుగుతూనే ఉంటారు. అడవి పళ్లు, ఆకుకూరలు తింటారు. ప్రశాంతంగా జీవిస్తారు. రోగాలు రావు. నూరేళ్లు సులువుగా బతుకుతారు. డబ్బు దాదాపుగా ఎవరి దగ్గరా ఉండదు. దానికి పెద్దగా విలువ లేదు. తోడాలు చేతి ఎంబ్రాయిడరీలో నిష్ణాతులు. తెలుపు, ఎరుపు, నలుపు రంగులు మాత్రమే వాడుతూ అందమైన ఎంబ్రాయిడరీ కంబళ్లు అల్లుతారు. తెలుపు బాల్యానికి, ఎరుపు యవ్వనానికి, నలుపు పరిణితికి గుర్తుగా భావిస్తారు.
>
> \- వాసమల్లి

చంద్రుని పై కుందేలు

'తోడాలు ఏది దొరికినా పంచుకుని తినాలి. ఒక సారి ఒక తోడా తేనె దొరికితే వెదురుబొంగులో తన కోసం దాచుకుని ఇంటికి బయలుదేరాడట. అతని లోని దురాశ వెంటనే పాములా మారి వెంటబడింది. అతను పరిగెడుతూ చేతిలోని వెదురుబొంగును కింద పడేస్తే అది పగిలి తేనె కుందేలు మీద చిందింది. పాము ఆ కుందేలు వెంట పడింది. కుందేలు భయంతో సూర్యుడి వైపు పరిగెడితే నేను చాలా వేడి... చంద్రుడి దగ్గరకు వెళ్లి దాక్కో అన్నాడు. కుందేలు చటుక్కున చంద్రుడిలో వెళ్లి దాక్కుంది. అందుకని చంద్రుడిలోని కుందేలు మా పూర్వీకురాలనుకుంటాం. చంద్రగ్రహణం రోజున చంద్రుణ్ణి రాహువు వదిలే వరకూ కుందేలు క్షేమం కోసం భోరున విలపిస్తాం' అని తెలిపిందామె.

మొదటి గ్రాడ్యుయేట్

నీలగిరి కొండల్లో గిరిజనవాడలను 'మండ్' అంటారు. అలాంటి మండ్‌లో పుట్టిన వాసమల్లి చిన్నప్పటి నుంచి చదువు మీద ఆసక్తితో హైస్కూల్ వరకూ చదువుకుంది. చిన్న వయసు పెళ్లి తప్పించుకోవడానికి ఇంటర్, డిగ్రీ చదివింది. తర్వాత ఊటీలోని 'హిందూస్థాన్ ఫొటో ఫిల్మ్ ఫ్యాక్టరీ'లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యింది. ఆ సంస్థ ఉద్యోగినే పెళ్లి చేసుకుంది. ఆమెకు ఇద్దరు కొడుకులు. ఒక కొడుకు ఉద్యోగం చేస్తుంటే, మరో కొడుకు ఊటీలో గైడ్‌గా పని చేస్తున్నాడు. 'నా పరిశోధనకు పెద్దగా సపోర్ట్ ఏమీ దొరకడం లేదు. మా నీలగిరుల్లో యాభై కొండలకు యాభై కథలు ఉన్నాయి. సేకరిస్తున్నాను. ఎలా ప్రచురించాలో ఏమిటో' అంటున్న ఆమె ఒక తొలి వెలుగుగా అనిపించింది. ఆ దీపం నుంచి మరో దీపం వెలుగుతూ వెళ్లాలని కోరుకుందాం.

ఇంటర్వ్యూ: జైపూర్ నుంచి 'సాక్షి' ప్రతినిధి

కిచెన్ టిప్స్





- తేనె కొంతకాలం వాడకుండా ఉంచేస్తే సీసా అడుగున గడ్డకట్టుకుపోతుంటుంది. అలాంటప్పుడు తేనెను కరిగించడానికి ఓ అరగంట పాటు తేనె సీసాను ఎండలో ఉంచాలి. తేనెను ఎప్పుడూ నేరుగా వేడి చేయకూడదు. ఎండ లేకుండా వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఒక పాత్రలో నీటిని వేడి చేసి అందులో తేనె సీసాను ఉంచాలి. నీటి వేడితో ఐదు – పది నిమిషాల్లో తేనె కరుగుతుంది.
- పాల ప్యాకెట్‌లు ఫ్రిజ్‌లో పెట్టుకునేటప్పుడు ఆ ప్యాకెట్‌లను నేరుగా పెట్టకూడదు. ప్యాకెట్ మన వాకిటి ముందుకు వచ్చే లోపు రకరకాల ప్రదేశాలను తాకి ఉంటుంది. కాబట్టి ప్యాకెట్‌ని నీటితో కడిగి ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.
- వెల్లుల్లి రేకలు పొట్టు సులువుగా వదలాలంటే... వెల్లుల్లి రేకను కటింగ్ బోర్డు మీద పెట్టి చాకు వెనుక వైపు (మందంగా ఉండే వైపు, ఈ స్థితిలో చాకు పదును ఉన్న వైపు పైకి ఉంటుంది) తిప్పి వెల్లుల్లి రేక చివర గట్టిగా నొక్కితే వెల్లుల్లి రేక తేలిగ్గా విడివడుతుంది.
- పైనాపిల్‌ను కట్ చేయడానికి పెద్ద చాకులను (షెఫ్స్ నైఫ్) వాడాలి. ముందుగా కాయ పై భాగాన్ని, కింది భాగాన్ని తొలగించాలి. ఇప్పుడు కాయను నిలువుగా పెట్టి చెక్కును పైనుంచి కిందకు తొలగించాలి. ఆ తర్వాత మీడియం సైజ్ చాకుతో కాయను చక్రాలుగా తరగాలి.
- బటర్‌ను వంట మొదలు పెట్టడానికి ఓ అరగంట లేదా గంట ముందు ఫ్రిజ్‌లో నుంచి తీసి బయట పెట్టుకోవాలి. ఒకవేళ మర్చిపోతే వేడి పాలగిన్నె మూత మీద లేదా ఉడుకుతున్న వంట పాత్ర మూత మీద పెడితే పది నిమిషాల్లో మెత్తబడుతుంది. అలా కుదరకపోతే స్టవ్ మీద బర్నర్ల మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలో ఉంచాలి.
- ఐస్‌క్రీమ్ సర్వింగ్ స్పూన్‌లు ఇంట్లో ఉండవు. పెద్ద ప్యాకెట్ తెచ్చుకున్నప్పుడు దానిని పలుచగా కట్ చేయాలంటే చాకును మరుగుతున్న వేడి నీటిలో ముంచి తీయాలి. ఒక స్లయిస్ కట్ చేయగానే చాకు చల్లబడిపోతుంది. కాబట్టి ప్రతి స్లయిస్‌కూ ఓ సారి వేడి నీటిలో ముంచాలి.







* ఫరీదా రాజ్

ఏడీహెచ్‌డీ, సెరిబ్రల్ పాల్సీ, ఇతర మనోవైకల్యాలు ఉన్న పిల్లల మానసిక అభివృద్ధికి బాటలు వేస్తున్నారు హైదరాబాద్ వాసి ఫరీదా రాజ్. స్పెషల్ చిల్డ్రన్‌కు శిక్షణ ఎలా ఇవ్వాలనే అంశాల మీద టీచర్లకు శిక్షణ ఇచ్చారు. సెంటర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్, టీచర్ ట్రైనర్, రెమెడియల్ ఎడ్యుకేటర్, రైటర్ అయిన ఫరీదా రాజ్ తన రచనల ద్వారా, అవగాహన సదస్సుల ద్వారా ప్రజలలో అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నారు.

అవగాహనే ప్రధానం

పిల్లల్లో వచ్చే డిస్లెక్సియాపై పుస్తకాలు రాసిన ఫరీదా రాజ్ ఇటీవల 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్ – నావిగేటింగ్ లైఫ్ విత్ ఎమ్మెస్' పేరుతో మల్టిపుల్ స్కెర్లోసిస్‌పై పుస్తకాన్ని తీసుకువచ్చారు. ఇది భారతదేశంలో వైద్య లేదా వైద్యేతర వ్యక్తి రాసిన మొట్టమొదటి పుస్తకంగా పేరొందింది. సరైన రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స, సంరక్షణ, కుటుంబ మద్దతుతో వ్యక్తులు సుదీర్ఘమైన, చురుకైన, ఆరోగ్యకరమైన జీవితాలను గడపవచ్చని ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా చెబుతారు ఆమె.

''ఇటీవల చాలా కుటుంబాల్లో తెలియని అలజడిని సృష్టిస్తున్న సమస్య మల్టిపుల్ స్కెర్లోసిస్. దీనిని ఒక జబ్బుగా కాకుండా అవగాహనతో సరిదిద్దాల్సిన అంశంగా గుర్తించాలి. సమస్యతో ఇబ్బంది పడుతున్నవారిని నేరుగా కలిసి, వారి వేదనను, చికిత్సా విధానాలను ఇందులో పొందుపరిచాను.

స్పెషల్ కిడ్స్ సామర్థ్యాలకు..

నేను స్కూల్ టీచర్‌గా ఉన్న మొదటి రోజులవి. ట్రైనింగ్ పీరియడ్. క్లాస్‌రూమ్‌లో ఉన్నప్పుడు మొదటి రోజే అక్కడ ఓ సంఘటన నన్ను అమితంగా కదిలించింది. ముగ్గురు, నలుగురు పిల్లలు టీచర్ చెబుతున్న విషయంపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదు. వారిలో అసహనం స్థాయిలు దాటడాన్ని, టీచర్ సహనం కోల్పోవడాన్నీ గమనించాను. ఎదిగే వయసు పిల్లల్లో సహజంగానే చాలా మానసిక ఒత్తిడి ఉంటుంది. ఈ సమస్య యువతలో మరింత ఎక్కువగా ఉండటాన్ని చూస్తుంటాం. వారిలో ఆందోళన కూడా ఒకింత ఎక్కువే. ఇలాంటప్పుడు వారికి మెంటల్ వెల్‌బీయింగ్ అవసరం. ఇక మానసిక వైకల్యాలు ఉన్న పిల్లల్లోనైతే అందరికీ వీరి పట్ల నిర్లక్ష్యం కూడా ఉంటుంది. ఇలాంటి పిల్లలను చూసుకునేవారికి సరైన గైడెన్స్ ఉండటం లేదని ఆ రోజే అనిపించింది. మనోవైకల్యాలు ఉన్న పిల్లల్లో సామర్థ్యాలను వెలికితీయడానికి, వారిలో విశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రతిరోజూ కృషి చేయాల్సి ఉంటుంది. అభ్యాసంలో వారిని నిమగ్నం చేయడానికి కొత్త కొత్త మార్గాలను కనుక్కోవాలి. దానిపైనే కృషి చేయాలనుకున్నాను. ఆ తర్వాత అందుకు తగిన పరిష్కారాలనూ కనుక్కున్నాను.

వందల మంది టీచర్లకు శిక్షణ

స్పెషల్ చిల్డ్రన్‌కు ఎలాంటి శిక్షణ అవసరమో, అందుకు టీచర్ల నైపుణ్యత ఎలా ఉండాలనే దానిపై రెగ్యులర్ సెషన్స్ నిర్వహించాను. ఇది రాష్ట్రస్థాయిలో మంచి మార్పులు తీసుకువచ్చింది. ఉపాధ్యాయులు, నేర్చుకునే ఇబ్బందులు ఉన్న పిల్లల తల్లిదండ్రుల కోసం ఒక హ్యాండ్–బుక్ తీసుకువచ్చాను.

జన్యులోపాలపై అవగాహన

ముంబైలో పుట్టి పెరిగిన నేను, పెళ్లి తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కి వెళుతున్న తొలినాళ్లలో ఒక రోజు, మానసిక వికలాంగురాలైన పాపతో ఉన్న ఒక మహిళను అక్కడ చూశాను. ఆమెతో మాటలు కలిపితే ఆ పాప ఆమెకు ఏడవ సంతానం అని తెలిసింది. ఆమె ఇతర పిల్లలందరికీ కూడా అదే సమస్య ఉంది. జన్యుపరమైన లోపాల వల్ల పిల్లలకు అలాంటి సమస్య వచ్చిందని ఆ మహిళకు తెలియదు. ఆ విషయం తెలియక జెనెటిక్ కౌన్సెలింగ్ కోసం ఆమె ఎప్పుడూ వెళ్లలేదని తెలుసుకున్నాను. దీంతో ఆ రోజే నిర్ణయించుకున్నాను ఇలాంటి మహిళలకు అవగాహన కల్పించాలని. అప్పటి నుంచి మహిళలకు జన్యుపరమైన కౌన్సెలింగ్స్ చేస్తూ ఉండేదాన్ని. ఈ అంశంపై ఉర్దూ పత్రికతో పాటు జాతీయ స్థాయి పత్రికలలోనూ వీటికి సంబంధించిన కథనాలపై వ్యాసాలు ఇచ్చాను.


ఒక్కో అడుగు..

స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పని చేయడం నుంచి తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకునే వరకు చేసిన ఈ ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు ఎన్నో. క్యాన్సర్ పట్ల ప్రజలలో అవగాహన కలిగించేందుకు ఆంకాలజిస్టులచే కార్యక్రమాల నిర్వహణ నన్ను ఎంతోమందికి చేరువ చేసింది. మల్టిపుల్ స్కెర్లోసిస్‌తో బాధపడుతున్న వ్యక్తులను చూసినప్పుడు ప్రజలకు ఈ విషయం పట్ల అవగాహన లేదని అర్థమైంది. దీంతో సమస్యను ఎదుర్కొంటున్నవారిని కలిసి, కదిలించే కథనాలను పాఠకుల ముందుకు తీసుకువచ్చాను'' అని వివరించే ఫరీదా రాజ్ మల్టిపుల్ స్కెర్లోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్‌కి కార్యనిర్వాహక సభ్యురాలిగా పనిచేస్తున్నారు. లాభాపేక్ష లేని ఈ సంస్థ ద్వారా మల్టిపుల్ స్కెర్లోసిస్ బారిన పడిన వ్యక్తుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు.

\- నిర్మలారెడ్డి

యూత్ పల్స్

యూత్ అంటే సరదా సరదా సంగతులేనా? బ్లాక్‌బస్టర్ సినిమాల కలర్‌ఫుల్ కబుర్లేనా? ఎప్పుడూ నెట్‌లోక విహారమేనా? అనే ప్రశ్నలకు 'కాదు' అనేది సమాధానం. ఆశ్చర్యం గొలిపే ప్రపంచ విషయాలపై ఆసక్తి చూపే యువతరం తమ మానసిక ప్రపంచంలోకి కూడా తొంగిచూస్తూ 'నేనేమిటి?' అని ప్రశ్నించుకుంటున్నారు. ఆ ప్రశ్నల వెలుగులోనే పురాతన జపనీస్ కాన్సెప్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు. తమను తాము పునర్నిర్వచించుకుంటున్నారు. పునర్నిర్మించుకుంటున్నారు...



జాదూ హై జపానీ

ది ఆర్ట్ ఆఫ్ సెల్ఫ్–రిపేర్

ఒక వస్తువు దెబ్బతింటే 'ఇక దీనితో పనిలేదు' అని బయటకు విసిరేయడం ఒక పద్ధతి. 'అలా కాదు దీని రీకన్‌స్ట్రక్ట్ చేద్దాం' అనుకోవడం మరోపద్ధతి. మొదటితో దానితో పోల్చితే రెండో దాంట్లో కాస్తో కూస్తో కష్టం ఉండవచ్చు. అయితే అద్భుతమైన ఫలితం ఉంటుంది. ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చే ఆశాజనిత ఫలితం అది. దెబ్బతిన్న వస్తువులను వదిలేయడం కంటే పునర్నిర్మించడంలో అందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని చూస్తుంది 'కిన్ సూగి' కాన్సెప్ట్. 'పర్‌ఫెక్షన్' అనే భావనను ప్రశ్నిస్తుంది. ఎదురుదెబ్బల తరువాత మనల్ని మనం పునర్నిర్మించుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.

ఇప్పుడు మనం బిహార్‌లోని భాగల్పూర్ జిల్లాకు చెందిన అభిజిత్ దగ్గరకు వెళదాం. ప్రేమవిఫలమై ఇరవై సంవత్సరాల వయసులో డిప్రెషన్‌లోకి వెళ్లాడు అభిజిత్. ఆ తరువాత మద్యానికి అలవాటు పడ్డాడు. రోజూ లేవగానే అద్దంలో ముఖం చూసుకోవడం అభిజిత్ అలవాటు. కొత్త అలవాట్ల ప్రభావం ముఖంపై కనిపించేది. అద్దంలో తనను తాను చూసుకున్నట్లుగా లేదు. రోగ బాధితుడైన అపరిచితుడిని చూస్తున్నట్లుగా ఉండేది.

'ఇక నా జీవితం ముగిసినట్లే' అని అభిజిత్ అనుకుంటున్న చీకటి రోజుల్లో ఒకరోజు ఫేస్‌బుక్‌లో 'కిన్ సూగి' గురించి చదివాడు. ఆ చిన్న ఆర్టికల్ తనకు ఎంత కిక్ ఇచ్చిందంటే 'కిన్ సూగి' గురించి ఇంటర్నెట్‌లో ఎక్కడ ఏ సమాచారం దొరికినా ఆబగా చదివేటంతగా. తనను తాను దెబ్బతిన్న వస్తువుతో పోల్చుకున్నాడు అభిజిత్. 'కిన్ సూగి' కాన్సెప్ట్ ప్రకారం తనను తాను పునర్నిర్మించుకోవాలి. అందులోని సౌందర్యాన్ని ఆస్వాదించాలి. అలాగే జరిగింది... ఒక్కొక్కటిగా అభిజిత్ తన దురలవాట్లు అన్నీ మానుకున్నాడు. తొలి విజయం దక్కింది. 'నేనేమిటీ?' అని అద్దంలోకి కాదు మనసులోకి తొంగిచూసుకున్నాడు.

'నీలో అద్భుతమైన వాక్చాతుర్యం ఉంది. నువ్వు ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా అర్థమయ్యేలా చెబుతావు' ఈ మాట తనతో ఎందరో ఎన్నోసార్లు అన్నారు.

'నా బలం ఆచూకీ తెలిసింది' అనుకున్నాడు అభిజిత్. మ్యాథ్స్‌లో పట్టు ఉన్న అభిజిత్ హైస్కూల్ విద్యార్థుల కోసం మ్యాథ్స్ ట్యుటోరియల్ మొదలుపెట్టాడు. ఈ ట్యుటోరియల్‌కు మొదట్లో పదవతరగతి తప్పిన విద్యార్థులే ఎక్కువగా వచ్చేవారు. 'సార్, మ్యాథ్స్ బాగా చెబుతున్నారు' అనే టాక్ నుంచి ట్యుటోరియల్ కాస్త స్కూల్‌గా మారడానికి ఎంతో కాలం పట్టలేదు. ఇప్పుడు ఆ ఏరియాలో బాగా పేరున్న స్కూల్‌గా మారింది.

'కిన్ సూగి కేవలం కాన్సెప్ట్, ఆర్ట్ ఫామ్ కాదు. ఫిలాసఫీ ఆఫ్ లైఫ్' అంటాడు తన జీవితాన్ని తానే రిపేర్ చేసుకున్న అభిజిత్.

> **అక్షరాలా...**
>
> వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఇంగ్లిష్‌లో వచ్చిన జపాన్ సాహిత్యంపై యువతరం ఆసక్తి చూపుతోంది. హెక్టర్ గార్సియ 'ఇకీగై', మైక్ వైకింగ్ 'ది లిటిల్ బుక్ ఆఫ్ హుగా', మారి కొండో 'ది లైఫ్ చేంజింగ్ మ్యాజిక్ ఆఫ్ టైడింగ్ అప్', చిన్–నింగ్ చూ 'థిక్ ఫేస్, బ్లాక్ హార్ట్', నెయిమి మోరియామా 'జపనీస్ ఉమెన్ డోన్ట్ గెట్ వోల్డ్ ఆర్ ఫ్యాట్' కెన్‌డిస్ కుమై 'కిన్ సూగి వెల్‌నెస్: ది జపనీస్ ఆర్ట్ ఆఫ్ నరిషింగ్ మైండ్, బాడీ అండ్ స్పిరిట్'... మొదలైన పుస్తకాలు ఆదరణ పొందాయి.

మల్టీ నేషనల్ కన్జ్యూమర్ గూడ్స్ కంపెనీ 'మారికో' సీయీవో హర్ష్ మారివాలా తనపై అత్యంత ప్రభావం చూపిన గమన్, కైజెన్, వాబీ–సాబీ... మొదలైన ఏడు జపనీస్ కాన్సెప్ట్‌లపై ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పోస్ట్‌ను కొంత కాలం క్రితం చదివింది ముంబైకి చెందిన యుక్త. వాటి గురించి ఆసక్తిగా అధ్యయనం చేసింది. ఆ కాన్సెప్ట్‌లలో కొన్ని...


'సానుకూల మార్పును తీసుకురాగల అంశాలపై దృష్టి పెట్టాలి' అంటుంది షికత గనై.

'ప్రతి వ్యక్తికి తమవైన శక్తిసామర్థ్యాలు ఉంటాయి. వాటి ఆధారంగానే సొంతంగా ఎదుగుతారు. ఇతరుల విజయాల ఆధారంగా వారిని పోల్చడం హానికరం. వేరే వారి మార్గాన్ని బట్టి మిమ్మల్ని మీరు అంచనా వేసుకోకూడదు' అంటుంది ఒబైతొరి.

కైజెన్ కాన్సెప్ట్ 'నిరంతరం మెరుగుపడడం' గురించి చెబుతుంది. మార్పు అనేది అనూహ్యంగా ఒక్కసారే రాదు. క్రమక్రమంగా వస్తుంది. ఈరోజు వేసే చిట్టి పొట్టి అడుగులు కూడా దూసుకుపోయే రేపటి వేగానికి ఇంధనం అవుతాయి.

మనం ఏదైనా నేర్చుకోవాలనుకున్నప్పుడు మూడు దశలలో ప్రయాణించాలి అంటుంది షు–హ–రి. ఈ జపనీస్ మార్షల్ ఆర్ట్ కాన్సెప్ట్‌లోని మూడు దశలు...షు–హ–రి. 'షు' దశలో నేర్చుకోవడానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. ఇక వేరే ఆలోచన అంటూ ఉండదు. 'హ' దశలో 'నేర్చుకోవాలి' 'నేర్చుకున్నాను'కు మాత్రమే పరిమితం కారు. నేర్చుకున్న వాటి ఆధారంగా కొత్త విషయాల గురించి ఆలోచిస్తారు. 'రి' దశలో క్రియేటివ్ టెక్నిక్‌కు సంబంధించి కొత్త ద్వారం తెరుచుకుంటుంది. కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. 'ఏదీ పరిపూర్ణం కాదు. ఎవరూ పరిపూర్ణులు కారు' అంటుంది వాబీ–సాబీ. అసంపూర్ణమైన వస్తువులు, ప్రకృతి దృశ్యాలలో అందం, ప్రశాంతతని కనుగొనే సౌందర్యభావన ఇది.

'కేవలం ఆసక్తితో మాత్రమే వాటి గురించి తెలుసుకున్నాను. అయితే వాటి ప్రభావంతో నాలో ఎంతో మార్పు వచ్చింది' అంటుంది యుక్త.


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 317

బుధవారం 7-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అండర్-19 ఫైనల్లో మన కుర్రాళ్లు

12 లో

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన యువ భారత జట్టు అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌లో జైత్రయాత్రను కొనసాగిస్తోంది. సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ 2 వికెట్ల తేడాతో గెలిచి.. టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. ఈ టోర్నీ చరిత్రలో తొమ్మిదోసారి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.



ఉత్తరాఖండ్‌లో పౌరస్మృతి బిల్లు

ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ కీలకమైన ఉమ్మడి పౌరస్మృతి బిల్లును అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టారు.

వివరాలు 6లో ▸



అది ప్రొస్టేట్ కేన్సర్ కాదు

బ్రిటన్ రాజు చార్లెస్-3కి కేన్సర్ లక్షణాలు బయటపడినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ తెలిపింది. అది ప్రొస్టేట్ కేన్సర్ కాదని పేర్కొంది.

వివరాలు 6లో ▸



అజిత్ వర్గమే అసలు ఎన్సీపీ

ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సోదరుడి కుమారుడు అజిత్ నేతృత్వంలోని చీలిక వర్గమే అసలైన ఎన్సీపీ అని ఈసీ తేల్చింది.

వివరాలు 6లో ▸



త్వరలో వందే భారత్ స్లీపర్ రైళ్లు

వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. తొలుత 10 రైళ్లను ప్రవేశపెట్టనున్నారు.

వివరాలు 6లో ▸

మళ్లీ మన ప్రభుత్వమే

చేయగలిగిందే చెప్పాం.. చెప్పింది చేశాం: శాసనసభలో సీఎం జగన్

ఆర్థిక సంక్షోభం, కోవిడ్‌ను దీటుగా ఎదుర్కొన్నాం

- సవాళ్లకు ఎదురొడ్డి ప్రజలకు అండగా నిలిచాం.. 99 శాతం హామీలను చిత్తశుద్ధితో అమలు చేశాం
- డీబీటీ, నాన్ డీబీటీతో రూ.4.31 లక్షల కోట్లు ప్రజలకు అందించాం
- మాపై వ్యతిరేకతే ఉంటే ప్రతిపక్షాలు ఎందుకు ఏకమవుతున్నాయి?
- రెండు జాతీయ పార్టీలతో చంద్రబాబుకు అవగాహన ఎందుకు?
- అప్పులపై ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం
- బాబు హయాంలోనే అధికంగా అప్పులు
- సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందంటూ చంద్రబాబు గగ్గోలు
- మళ్లీ దగా చేసేందుకే బాబు ఆరు వాగ్దానాలు.. చంద్రబాబు సంపద సృష్టి అంతా పచ్చ అబద్ధమే
- ఆయన పేరు చెబితే గుర్తొచ్చే పథకం ఒక్కటైనా ఉందా?
- ఆయన్ను నమ్మితే బంగారు కడియం ఇస్తానన్న పులిని నమ్మినట్టే

10 లో


శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

“ రాష్ట్ర విభజన నుంచి ఇప్పటికి కూడా మనల్ని రెవెన్యూ లోటు వెంటాడుతోంది. మనం కలసికట్టుగా 60 ఏళ్లపాటు ఉమ్మడిగా హైదరాబాద్‌ను నిర్మించుకున్నాం. అది ఎకనామిక్ పవర్ పాయింట్. ప్రతి రాష్ట్రానికి ఒక ఎకనామిక్ పవర్ హౌస్ ఉండాలి. లేకుంటే రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు ఎప్పటికీ పెరగవు. 'ట్యాక్స్ బాయోన్సీ' అన్నది చాలా చాలా ముఖ్యం. పెద్ద పెద్ద నగరాల్లోనే ట్యాక్స్ రెవెన్యూ ఎక్కువగా ఉంటుంది. అందుకే నేను విశాఖపట్నం గురించి గట్టిగా చెబుతా.

“ మేనిఫెస్టో హామీల్లో 99 శాతం వాగ్దానాలను ఈ ఐదేళ్లలో అమలు చేశాం. ప్రతి ఇంటికి మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రజల ఆశీస్సులు కోరుతున్నాం. వైఎస్సార్‌సీపీ చేయగలిగిందే చెబుతుంది. చెప్పింది ఏదైనా సరే కచ్చితంగా చేసి తీరుతుంది. దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో అఖండ మెజారిటీతో ప్రజల మన్ననలు పొంది మళ్లీ 3 నెలలకు ఇదే చట్టసభలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం.

- సీఎం వైఎస్ జగన్

వాళ్లు సర్క్యులేషన్ కోసం ఏవైనా రాస్తారు..

నేనలాంటి వ్యాఖ్యలు

చెయ్యలేదు

'ఈనాడు' రాతలపై జస్టిస్ మల్లికార్జునరావు అసంతృప్తి

యథాలాపంగా మాట్లాడా.. ఎలాంటి కామెంట్లూ చేయలేదు



- వాళ్ల రాతలు పరువు నష్టం కలిగించేలా ఉంటే చర్యలు తీసుకోండి.. నాకు వ్యతిరేకంగా కూడా కథనాలు రాశారు
- ఎవరేం రాసినా నేను గొంతెత్తలేను కదా..
- ఏమన్నా అంటే భావ ప్రకటన స్వేచ్ఛ అంటారు
- ఎల్లో మీడియా కథనాలపై న్యాయమూర్తి వ్యాఖ్యలు
- ప్రజలను ఎడ్యుకేట్ చేసేందుకే రాశామని ఆ పత్రికల వాళ్లు చెప్పారు: న్యాయవాది పోసాని
- ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడే కేసుల్లో అరెస్ట్ చేయకూడదనేం లేదు
- అరెస్ట్ చేయాలా లేక 41(ఏ) నోటీసు ఇవ్వాలా అన్నది దర్యాప్తు అధికారి విచక్షణ
- ఇందులో న్యాయస్థానాల జోక్యం తగదు.. పోలీసుల మనోస్థైర్యం దెబ్బతినకూడదనే ఆ కథనాలను మీ దృష్టికి తెస్తున్నాం.. హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

2 లో

మరీ ఇంత బరితెగింపా? రామోజీరావుకేమయింది? 'ఈనాడు' అసలు పత్రికేనా? కోర్టుల్లో న్యాయమూర్తులు చేయని వ్యాఖ్యల్ని సైతం వాళ్లకు అంటగట్టి రాసేస్తే ఎలా? 'మీరు పోలీసులేనా?.. అరెస్టు చేస్తారని ఎంపీ, ఎమ్మెల్యేలే భయపడితే.. సామాన్యుల పరిస్థితేంటి?'' అని ఓ న్యాయమూర్తి అన్నట్టుగా పతాక శీర్షికను వండేసిన రామోజీకి.. అసలు ఆ న్యాయమూర్తి అలాంటి వ్యాఖ్యలే చేయలేదన్న నిజం తెలియదా? ఈ రాతల వల్ల పోలీసుల ఆత్మ స్థయిర్యం ఎంతలా దెబ్బతింటుందో తెలుసా? రాష్ట్ర ప్రభుత్వం మీద బురద జల్లటమే లక్ష్యంగా దుష్ప్రచారంతో చెలరేగిపోతున్న రామోజీకి వయసు తప్ప బుద్ధి రాలేదా? ఎంతసేపూ చంద్రబాబు యావే తప్ప ఈ రాష్ట్రానికి మీరు చేస్తున్న ద్రోహమేంటో అర్థమవుతోందా రామోజీ!?.



విద్యారంగంలో దేశానికి ఏపీ రోల్ మోడల్

- ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి వంటివెన్నో మంచి నిర్ణయాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాకు స్ఫూర్తి.. జీవితంలో ఎత్తుపల్లాలు సహజం
- యువత కలల సాకారానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
- కృతజ్ఞతా భావం, సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి
- ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

2 లో

శరవేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

ఇప్పటివరకు 3 లక్షల రిజిస్ట్రేషన్లు పూర్తి

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేస్తున్న యంత్రాంగం

30 లక్షల రిజిస్ట్రేషన్లు చేసేందుకు పక్కా ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం రికార్డు స్థాయిలో జరుగుతోంది. 4 రోజుల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. 2వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు 5,000 రిజిస్ట్రేషన్లు జరగ్గా క్రమంగా వాటి సంఖ్య పెరిగింది. సోమవారం ఒక్కరోజే 90,000 రిజిస్ట్రేషన్లు చేశారు. మంగళవారం రాత్రికి లక్ష రిజిస్ట్రేషన్లు చేసే అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటల సమయానికే 60 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వివిధ పనుల నిమిత్తం

మిగతా 2వ పేజీలో ▶

రోజుకు లక్ష రిజిస్ట్రేషన్లు

మొత్తం 30.61 లక్షల రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 15.33 లక్షల ఇళ్ల పట్టాల డేటాను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎంటర్ చేశారు. త్వరలో మిగిలిన డేటాను కూడా ఎంటర్ చేయనున్నారు. రోజుకు లక్ష రిజిస్ట్రేషన్లు చేయడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనిప్రకారం సాధ్యమైనంత త్వరగా మొత్తం రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఆదివారాల్లోనూ రిజిస్ట్రేషన్లు ఆగకూడదని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

శరణు.. శరణు

బీజేపీ కోసం చంద్రబాబు పాట్లు.. ఎన్ని సీట్లు అడిగినా ఇచ్చేందుకు సిద్ధం



'కమలం' పెద్దలను కలిసేందుకు నేడు ఢిల్లీ పయనం

జనసేనతో జతకట్టినా జగన్‌ను ఎదుర్కోవడం కష్టమేనని తేటతెల్లం

పవన్‌తో భేటీల్లోనూ దీనిపైనే చర్చించిన వైనం

మోదీ-షా ప్రసన్నం కోసం ముమ్మర యత్నాలు

సాక్షి, అమరావతి: ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ఏమాత్రం ధైర్యం చాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు బీజేపీ పాదాలపై పడి శరణు కోరుతున్నారు. తనతో పొత్తు పెట్టుకుంటే ఎన్ని స్థానాలు ఇచ్చేందుకైనా సిద్ధమని ఇప్పటికే బీజేపీ పెద్దలకు స్పష్టమైన సంకేతాలు పంపారు. పొత్తుకు అంగీకరిస్తే వాళ్లు కోరిన సీట్లు పోగా మిగిలిన సీట్లలోనే పోటీకి బాబు సంసిద్ధమయ్యారు. అందులో భాగంగానే ఢిల్లీ వెళ్లి కమలం పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆయన ఢిల్లీ పర్యటనకు వెళుతున్నారు. రెండురోజులు అక్కడే ఉండి పొత్తు ఖరారు చేసుకుంటారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల కేటాయింపునకు రెడీ

అయితే బీజేపీ పెద్దలు చర్చలకు పిలిస్తే చంద్రబాబు ఢిల్లీ వెళ్తున్నారా, లేక ఆయనంతట ఆయనే వెళుతున్నారా అనే విషయం మాత్రం తెలియలేదు. ఆయన ఎవరిని కలుస్తారనే దానిపైనా స్పష్టత లేదు. మధ్యవర్తుల కోరిక మేరకు ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసేందుకు యత్నిస్తారనే ప్రచారం జరుగుతోంది. యత్నాలు ఫలిస్తే కలవడానికి అవకాశం ఉంటుందని, లేకపోతే బాబు తిరుగుముఖం పడతారని చెబుతున్నారు. ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు బీజేపీకి కేటాయించేందుకు

మిగతా 2వ పేజీలో ▶

కలియుగ శల్యుడు పవన్‌కళ్యాణ్

మాజీ మంత్రి పేర్ని నాని విమర్శ



నాడు కర్ణుడి ధైర్యాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన శల్యుడు మాదిరిగానే.. పవన్‌కళ్యాణ్ కూడా జనసేన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని చంపుతున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. పల్లకీ మోయాలి అని చెప్తున్న పవన్ కలియుగ శల్యుడేనని.. అందుకే సీఎం జగన్ అర్జునుడంటే పవన్‌కు బాధ కలిగిందని దుయ్యబట్టారు. కుటుంబ బంధాల గురించి పవన్ దగ్గర నేర్చుకోవడంకంటే హాస్యాస్పదం ఏముంటుందని ప్రశ్నించారు.

- వివరాలు 11లో

శాసనసభలో పోడియంపైకి వెళ్లి స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు చించి వేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు



అసెంబ్లీలో టీడీపీ రగడ

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చను అడ్డుకున్న టీడీపీ ఎమ్మెల్యేలు


10 లో

కాగితాలు చించి స్పీకర్ తమ్మినేనిపై వేసి, విజిల్స్ ఊదుతూ రచ్చ

సభ వాయిదా అనంతరమూ మారని తీరు

తప్పని పరిస్థితుల్లో టీడీపీ సభ్యుల సస్పెన్షన్

నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్



- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి బుగ్గన
- తొలి మూడు నెలలకు ఓటాన్ అకౌంట్ పద్దుకు సభ ఆమోదానికి ప్రతిపాదన
- ఉదయం 8 గంటలకు సీఎం జగన్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- బడ్జెట్‌కు ఆమోదం తెలపనున్న మంత్రివర్గం

2 లో

బాణసంచా యూనిట్‌లో పేలుడు..

11 మంది మృతి

మరో 100 మందికి పైగా గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన

మధ్యప్రదేశ్‌లోని హర్దాలో బాణసంచా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో 11 మంది చనిపోగా, మరో 100 మందిపైగా గాయాలపాలయ్యారు. మంగళవారం ఉదయం బైరాగఢ్‌లోని ఫ్యాక్టరీలో శక్తివంతమైన పేలుడు సంభవించిందని, అనంతరం మంటలు వ్యాపించాయని అధికారులు తెలిపారు. పేలుడు తీవ్రతకు మంటలు చెలరేగి ఫ్యాక్టరీ చుట్టుపక్కలున్న 50కి పైగా ఇళ్లు కాలిబూడిదయ్యాయి.

- వివరాలు 6లో


మంగళవారం మధ్యప్రదేశ్ హర్దాలో బాణసంచా కర్మాగారం నుంచి ఎగసిపడుతున్న మంటలు

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఉపాధికి ఆసరా తోడైంది

మాది చాలా పేద కుటుంబం. నా భర్త షేక్ అబ్దుల్లా కార్ డ్రైవర్. నేను గుంటూరు జిల్లా తెనాలిలో ఇంట్లోనే టైలరింగ్ చేస్తుంటా. ఇద్దరి కష్టంతో వచ్చే అరకొర ఆదాయంతోనే కుటుంబం గడిచేది. మాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి సానియా రుక్సానా అయిదో తరగతి, చిన్న కూతురు ముస్కాన్ నాలుగో తరగతి చదువుతున్నారు. మా అమ్మ కూడా మాతోనే కలిసి ఉంటోంది. అయిదుగురు సభ్యుల కుటుంబం. మా సంపాదనతో రోజూ జీవనం గడవటమే కష్టంగా ఉండేది. ఇద్దరు పిల్లల్ని బాగా చదివించగలమా? అన్న ఆందోళనతో ఉండేవాళ్లం. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా జీవితం మారిపోయింది. వైఎస్సార్ ఆసరా పథకం మా కుటుంబాన్ని ఆదుకుంది. ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగు విడతలుగా రూ.48 వేలు వచ్చాయి. ఇదే పథకం కింద మా అమ్మకు కూడా రూ.48 వేలు వచ్చింది. ఇద్దరికీ కలిపి ప్రభుత్వం రూ.96 వేలు మా ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున అందుతోంది. ఆ డబ్బుతో నాకున్న సాధారణ కుట్టుమెషీన్ అమ్మేసి, అధునాతన మెషీన్ కొనుక్కున్నా.



నూతన మోడల్స్‌తో విభిన్నంగా మహిళల వస్త్రాలు కుడుతుండడంతో పనులు కూడా ఎక్కువగా వస్తున్నాయి. దీనికితోడు టైలరింగ్ మెటీరియల్ కూడా విక్రయిస్తున్నా. ఇప్పుడు నా ఆదాయం పెరిగింది. త్వరలోనే మెయిన్‌బజార్‌లో టైలరింగ్ దుకాణం ప్రారంభించాలని సన్నాహాలు చేసుకుంటున్నా. పెద్దమ్మాయికి అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. దానివల్ల పిల్లల్ని ఇబ్బంది లేకుండా చదివించుకోగలుగుతున్నాం. గతంలో మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక మా పరిస్థితి మెరుగు పడింది. ఇందుకు కారకులైన జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– షేక్ ఫాతిమున్నీసా, తెనాలి

(బి.ఎల్.నారాయణ, విలేకరి, తెనాలి)

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ



నేను వెల్డింగ్ పని చేస్తూంటా. రోజూ పనికెళ్తేనే మాకు పూట గడిచేది. ఏలూరు జిల్లా మండవల్లి గ్రామంలో భార్య నాంచారమ్మ, ఇద్దరు పిల్లలనూ అరకొర ఆదాయంతోనే పోషించుకుంటున్నా. గత ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం అందలేదు. అతి కష్టంగా జీవనం సాగించాల్సి వచ్చింది. అంతలో ఓ రోజు నాకు అనారోగ్యం చేసింది. చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్తే నా గుండెకు స్టంట్లు వేయాలని డాక్టర్లు చెప్పారు. రోజంతా కష్టపడితే వచ్చిన మొత్తం కుటుంబ పోషణకే సరిపోతుంది. స్టంట్లు వేయించుకునే ఆర్థిక స్తోమత లేదు. ఇంతలో మా ఏఎన్ఎం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుందని చెప్పింది. వెంటనే విజయవాడలోని సెంటిని ఆస్పత్రిలో చేరగా 2022 ఆగస్టు 23న గుండెకు రెండు స్టంట్‌లు వేశారు. దీనికైన ఖర్చు రూ.3 లక్షలు మొత్తం ప్రభుత్వమే భరించింది. ప్రభుత్వం నాకు పునర్జన్మ ప్రసాదించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నా భార్యకు వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏడాదికి రూ.18 వేలు వంతున అందింది. నాకు వైఎస్సార్ పింఛను కానుక కింద నెలకు రూ.3 వేలు ఒకటో తేదీనే వలంటీరు ఇంటికొచ్చి ఇస్తోంది. నా మనుమరాలు 8వ తరగతి చదువుతోంది. తనకు అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.13 వేలు వస్తోంది. మా కోడలికి ఆసరా ద్వారా ఏటా రూ.14 వేలు వచ్చింది. మా కుటుంబానికి ఇంత మేలు చేస్తున్న జగన్ మేలు ఎన్నటికీ మరువలేము.

– బోయిన నారాయణరావు, మండవల్లి

(బోగాది వెంకట వీరాంజనేయులు, మండవల్లి)

సొంతింటి కల నెరవేరింది

కూలి పని చేసుకొని బతుకు బండి లాగుతున్నాం. తద్వారా వచ్చిన డబ్బుల్లో సగం అద్దెలు కట్టేందుకే సరిపోయేది. ఇక సొంతిల్లు కలగానే మిగిలిపోతుందనుకున్నాం. మాది గుంటూరు జిల్లా చిలకలూరిపేట. బతుకుతెరువు కోసం 20 ఏళ్ల క్రితం బాపట్ల జిల్లా జె.పంగులూరుకు వలస వచ్చాం. నా భర్త సుబానీ ఆటో అద్దెకు తీసుకుని నడుపుతుంటారు. నేను టైలరింగ్ చేస్తాను. మాకు ఇద్దరు పిల్లలు. సొంత ఇల్లు లేకపోవడంతో 15 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లోనే ఉన్నాం. ఇద్దరం సంపాదించిన డబ్బుతో కుటుంబం గడవడమే కష్టంగా ఉండేది. ఇంటి అద్దె కోసం నానా తిప్పలు పడాల్సి వచ్చేది. పస్తులుండి అద్దెలు కట్టిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వం మా కష్టాలను పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధులూ కన్నెత్తి చూడలేదు. కష్టాలతో సహవాసం చేస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. నవరత్నాల్లో భాగంగా ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోగానే వలంటీరు వచ్చి స్థలం వచ్చిందని చెప్పాడు.



మా సంతోషానికి ఎల్లలు లేవు. ఇల్లు కూడా మంజూరు కావడంతో ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందించింది. ఆ డబ్బుతో ఇల్లు కట్టుకున్నాం. కాలనీలో మొట్టమొదటి ఇల్లు మాదే. ఇప్పుడు అందులోనే పిల్లలతో కలిసి ఆనందంగా ఉంటున్నాం. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరింది. మా అమ్మాయి ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. మూడేళ్లు అమ్మ ఒడి కింద రూ.45 వేలు రావడంతో అమ్మాయి చదువు కోసం ఎటువంటి ఇబ్బంది పడలేదు. మాకు ఇప్పుడు ఏ చీకుచింతా లేదు.

– షేక్ నన్నేబీ, జె.పంగులూరు

(అదుసుమల్లి సోమ శ్రీనివాసరావు, విలేకరి, అద్దంకి)

వాళ్లు సర్క్యులేషన్ కోసం ఏవైనా రాస్తారు..
నేనలాంటి వ్యాఖ్యలు చెయ్యలేదు

'ఈనాడు' రాతలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు అసంతృప్తి

సాక్షి, అమరావతి : ఓ కేసు ప్రస్తావన సమయంలో తాను చేసిన వ్యాఖ్యలంటూ ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్క్యులేషన్ కోసం ఏవైనా రాస్తాయంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాంటి కథనాలపై తానెందుకు స్పందించాలని ప్రశ్నించారు. ఆ పత్రికలు ఏం రాశాయో కూడా తనకు తెలియదన్నారు. ఇటీవలి కాలంలో పత్రికలు చదవడమే మానేశానని తెలిపారు. 'వాళ్లేం రాశారో మీరు (పబ్లిక్ ప్రాసిక్యూటర్) ఇప్పుడు చెబితేనే నాకు తెలిసింది. నేనేదో యథాలాపంగా మాట్లాడానే తప్ప ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. వాళ్ల రాతలు పరువు నష్టం కలిగించే విధంగా ఉంటే అందుకు అనుగుణంగా మీరు (ప్రభుత్వం) తప్పనిసరిగా చర్యలు తీసుకోండి. మీడియాలో నాకు వ్యతిరేకంగా కూడా కథనాలు రాశారు. అయినా నేను గొంతెత్తలేను. అదేమన్నా అంటే భావ ప్రకటన స్వేచ్ఛ అంటారు. పత్రికల్లో వచ్చే కథనాలకు నేనేం చేయగలను?' అని జస్టిస్ మల్లికార్జునరావు అన్నారు. న్యాయమూర్తి నుంచి ఈ స్పందనను ఊహించని ఎమ్మెల్యే తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు ఎల్లో మీడియా కథనాలను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఆ పత్రికల వారితో తాను మాట్లాడానని, ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికే అలా ప్రచురించామని వారు చెప్పారని పోసాని తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పబ్లిక్



ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి స్పందిస్తూ.. మీరు వ్యాఖ్యలు చేశారంటూ ప్రచురించిన కథనాల వల్ల పోలీసుల మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందని, అందుకే వాటిని కోర్టు దృష్టికి తీసుకొస్తున్నామని న్యాయమూర్తికి వివరించారు. అలాగే 41(ఏ) విషయంలో కోర్టుకు స్పష్టతనిచ్చేందుకు, కోర్టు సందేహాలను నివృత్తి చేసేందుకు, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల్లో ఏముందో స్పష్టంగా తెలిపేందుకే సుదీర్ఘ వాదనలు వినిపించామన్నారు. అధికారులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై నమోదు చేసిన కేసులో సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ) నోటీసు ఇస్తామని దుష్యంత్ కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పోలీసు అధికారుల నుంచి స్పష్టమైన సూచనలు ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయమూర్తి, ఎమ్మెల్యే సాంబశివరావుకు 41(ఏ) నోటీసులు ఇచ్చి, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని పోలీసులను ఆదేశించారు. 41(ఏ) నోటీసులు ఇస్తామని చెప్పినందున కేసు పూర్వాపరాల్లోకి వెళ్లడం లేదని జస్టిస్ మల్లికార్జునరావు తెలిపారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే

గ్రానైట్ ఫ్యాక్టరీ తనిఖీకి వచ్చిన తమను విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడమే కాక తమపై దాడి కూడా చేశారంటూ గనుల శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సాంబశివరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మల్లికార్జునరావు మంగళవారం విచారణ జరిపారు.

ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారు

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎమ్మెల్యే బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి, విధులు నిర్వర్తించకుండా అధికారులను అడ్డుకున్నారని తెలిపారు. న్యాయమూర్తులపై గతంలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు వారిపై నమోదు చేసిన కేసులు కూడా ఏడేళ్ల లోపు శిక్షలు పడేవేనని, అయినా వారికి కోర్టు ముందస్తు బెయిల్ ఇవ్వలేదన్నారు. 70 రోజుల పాటు వారంతా జైల్లోనే ఉన్నారని తెలిపారు. ఆ కేసుల్లో అడ్వొకేట్లు కూడా అరెస్టయ్యారని వివరించారు. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న నిబంధన ఏదీ లేదన్నారు. నేరాన్ని మళ్లీ చేస్తారన్న నిర్ణయానికి పోలీసు అధికారి వస్తే చాలని, నిందితుడిని అరెస్ట్ చేయవచ్చని చెప్పారు. ప్రస్తుత కేసులో ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని, ఇప్పుడు కూడా పోలీసులు మౌనంగా ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపే సమయంలో నేరం చేశారనేందుకు మేజిస్ట్రేట్‌కు స్పష్టమైన ఆధారాలు చూపితే సరిపోతుందన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఎమ్మెల్యే భయభ్రాంతులకు గురి చేశారని, అందుకు వీడియో ఆధారాలున్నాయని చెప్పారు. 41(ఏ) నోటీసు ఇవ్వాలా లేక అరెస్ట్ చేయాలా అన్నది పూర్తిగా పోలీసుల విచక్షణాధికారమని తెలిపారు. కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. ఈ విషయంలో ఇదే హైకోర్టు ఓ తీర్పులో స్పష్టంగా చెప్పిందని నివేదించారు. ఈ కేసులో కూడా ఎమ్మెల్యేకు 41(ఏ) నోటీసులు ఇస్తామన్నారు.

అంతకు ముందు ఎమ్మెల్యే తరఫున పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో అరెస్ట్ చేయకూడదన్నారు. సెక్షన్ 41(ఏ) నోటీసులు ఇచ్చి తీరాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు పోలీసులు వక్రభాష్యం చెబుతున్నారని తెలిపారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు పెట్టారన్నారు. పిటిషనర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని లేని పక్షంలో 41(ఏ) నోటీసులు జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

శరణు.. శరణు

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు సుముఖంగా ఉన్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

కాషాయ పార్టీ కటాక్షించేనా!

ఇప్పటికే పవన్ కళ్యాణ్‌తో ఉమ్మడి ప్రయాణం చేస్తున్న చంద్రబాబు జనసేనతో మాత్రమే జతకడితే సరిపోదని భావించి కాషాయ పార్టీనీ కలుపుకోవాలని చూస్తున్నారు. బీజేపీకి దేశవ్యాప్తంగా ఉన్న అనుకూలత కలిసి వస్తుందని భావిస్తున్నారు. అందరినీ కలుపుకుంటే తప్ప అమిత ప్రజాభిమానం గల వైఎస్ జగన్‌కు కొద్దిగానైనా పోటీ ఇవ్వగలమనే విస్పష్ట అంచనాకు బాబు వచ్చారని తెలుస్తోంది. ఈ విషయాన్ని బాబు, పవన్ చాలా సందర్భాల్లో వెల్లడించారు కూడా. ఇప్పటికే బీజేపీలోని తన కోవర్టుల ద్వారా ప్రధాని మోదీని కలిసేందుకు బాబు చేయని యత్నం లేదు. పవన్ ద్వారా కూడా బీజేపీ పెద్దలకు సంకేతాలు పంపుతున్నారు. బీజేపీ కటాక్షిస్తే ఆ పార్టీ పెట్టే ఏ డిమాండ్‌కైనా ఒప్పుకోవాలని బాబు, పవన్ చాలాకాలం క్రితమే నిర్ణయించుకున్నారని సమాచారం. ఆదివారం రెండు విడతలుగా జరిగిన చర్చల్లోనూ దీనిపై వారిద్దరూ చర్చించుకున్నట్లు తెలిసింది. ఆదివారం ఎంపీ బాలశౌరి జనసేనలో చేరిన సందర్భంగానూ పవన్ ఇదే విషయాన్ని బయటపెట్టారు.

20 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాల్లో పోటీకి పవన్ ఓకే !

మరోవైపు జనసేనకు ఎన్ని సీట్లు ఇవ్వాలనే దానిపైనా చంద్రబాబు ఒక అభిప్రాయానికి వచ్చారు. పవన్ 50కిపైగా సీట్లు అడుగుతున్నా 20 వరకు అసెంబ్లీ, రెండు లోక్‌సభ సీట్లు ఇచ్చేందుకు బాబు సుముఖంగా ఉన్నారని, దీనికి పవన్ కూడా ఓకే చెప్పారని తెలుస్తోంది. ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనేది ప్రధానం కాదని, పోటీ చేసిన సీట్లలో గెలవాలని పవన్ చెప్పిన విషయం తెలిసిందే. అంటే బాబు ఎన్ని సీట్లు ఇస్తే అన్ని తీసుకునేందుకు అంగీకరించిన పవన్ తన క్యాడర్‌నూ అందుకు సంసిద్ధం చేసేందుకు యత్నిస్తున్నట్టు స్పష్టమవుతోంది. దీనిపై క్షేత్రస్థాయిలో జనసేన నేతలు, క్యాడర్ నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. ఆయన లెక్కచేయడంలేదు. మరోవైపు బీజేపీతో పొత్తుకు బాబు తహతహలాడడంపై టీడీపీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాన్ని బీజేపీ మోసం చేసిందని ఇప్పటివరకు చెబుతూ ఇప్పుడు ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవడం ఏమిటని పలువురు నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల ప్రజల్లో చులకనవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: 2024–25 ఆర్థిక సంవత్సరం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీకి సమర్పించనుంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బుధవారం ఉదయం 11.02 నిమిషాలకు 2024–25 ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. అయితే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్థిక ఏడాది తొలి 3 నెలల వ్యయానికి (ఏప్రిల్ నుంచి జూన్ వరకు) ఓటాన్ అకౌంట్ పద్దు ఆమోదానికి సభలో ప్రతిపాదించనున్నారు. అదే సమయానికి శాసన మండలిలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను చదువుతారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు సచివాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. మొత్తం బడ్జెట్ రూ. 2.85 లక్షల కోట్లకు పైగా ఉంటుందని సమాచారం.

ప్రకాశం జిల్లాలో ఐరన్ ఓర్ మైనింగ్ ప్రాజెక్ట్

- టెండర్ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ ప్రివ్యూకు సమర్పించిన ఏపీఎండీసీ

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లాలోని ఐరన్ ఓర్ మైనింగ్‌ను జాయింట్ వెంచర్ విధానంలో ఏపీఎండీసీ చేపట్టనుంది. ఇందు కోసం జాయింట్ వెంచర్ సంస్థ ఎంపిక నిమిత్తం నిర్వహించే టెండర్లకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆ సంస్థ మంగళవారం జ్యుడిషియల్ ప్రివ్యూకు సమర్పించింది. ఇంటిగ్రేటెడ్ ఐరన్ ఓర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్లానింగ్, ఇంజినీరింగ్, ఫైనాన్సింగ్, కన్‌స్ట్రక్షన్, డెవలప్‌మెంట్, ఆపరేషన్ కమ్ మెయింటెనెన్స్ కోసం జాయింట్ వెంచర్ సంస్థను టెండర్ల ద్వారా ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ప్రకాశం జిల్లా కొణిజేడు, మర్లపాడు ప్రాంతం పరిధిలో ఏపీఎండీసీ మొత్తం 1307.26 ఎకరాల్లో లో–గ్రేడ్ మ్యాగ్నెటైట్ ఐరన్ ఓర్ మైనింగ్ లీజులను పొందింది. ఇంటిగ్రేటెడ్ ఐరన్ ఓర్ ప్రాజెక్ట్ ద్వారా లో గ్రేడ్ ఖనిజాన్ని మైనింగ్ చేయడం, బెనిఫికేషన్ ద్వారా నాణ్యతను పెంచడానికి ఏడాదికి సుమారు రూ.450 కోట్ల మేర సంస్థకు రెవెన్యూ లభిస్తుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయల కన్నా ఎక్కువ వ్యయం అయ్యే ప్రాజెక్టులకు నిర్వహించే టెండర్ల ప్రక్రియను ముందుగా జ్యుడిషియల్ ప్రివ్యూకు సమర్పించాలని చట్టం చేసింది. దానిలో భాగంగా ఐరన్ ఓర్ టెండర్ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ ప్రివ్యూ కమిషన్‌కు సమర్పించినట్లు ఏపీఎండీసీ వీసీ అండ్ ఎండీ వీజీ వెంకటరెడ్డి తెలిపారు. కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఈ టెండర్ డాక్యుమెంట్లపై ప్రజల నుంచి సలహాలు, సూచనలను ఈ నెల 14 వరకు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

గ్రూప్‌-4 అభ్యర్థుల తుది జాబితా వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ ఇటీవల గ్రూప్–4 పోస్టులకు నిర్వహించిన పరీక్షల్లో వివిధ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం వెల్లడించింది. ఆయా పూర్తి వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.in.లో ఉంచినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

పలువురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ చేసిన స్థానంలో వెంటనే చేరడంతో పాటు ఆ సమాచారాన్ని తెలియజేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఏపీలో డిజిటల్ బోధన సూపర్

- మెక్సికో ఐబీ ప్రతినిధి ఆల్డో ప్రశంస
- కృష్ణా జిల్లాలో వివిధ పాఠశాలల సందర్శన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యా విధానం అద్భుతంగా ఉందని మెక్సికో దేశానికి చెందిన ఐబీ ప్రతినిధి ఆల్డో ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) అమలులో భాగంగా ఐబీ ప్రతినిధులు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, పరిస్థితులను అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆల్డో మంగళవారం కృష్ణా జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించారు. విజయవాడలోని ఎంకే బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లోని గదులను, ఉపాధ్యాయులు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల వినియోగం, బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. బోధనా అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు విన్నారు. అనంతరం 'జగనన్న గోరుముద్ద'ను రుచి చూసి మధ్యాహ్న భోజనం వంట కార్మికులను అభినందించారు. అనంతరం కంకిపాడు మండలం పునాదిపాడు, ఈడుపుగల్లు జెడ్పీ హైస్కూళ్లను సందర్శించారు. పునాదిపాడులో భౌతిక, జీవశాస్త్ర ప్రయోగశాలలు, ఇంగ్లిష్ ల్యాబ్, ఈడుపుగల్లులో డ్రాయింగ్ ప్రదర్శన, సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించి ఉపాధ్యాయులను ప్రశంసించారు. పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన 'ఇండియన్ యోగా' ప్రత్యేక ప్రదర్శనకు ఆల్డో ముగ్ధులయ్యారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి, అడ్మిషన్ విధానంపై ప్రిన్సిపల్‌ను ఆరా తీశారు. విద్యార్థినుల వివరాలు, వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి బోధనా అభ్యసన పద్ధతులను పరిశీలించారు. అక్కడ గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసాను విద్యార్థినులు ప్రదర్శించారు. స్కూళ్ల సందర్శన అనంతరం ఏపీ ప్రభుత్వం ప్రభుత్వ స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దిందని, వసతుల కల్పనలో ఉన్నతమైన ప్రమాణాలు పాటించిందని ఆల్డో అభినందించారు. ఈ పర్యటనలో ఐబీ ప్రతినిధి వెంట ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ వై.గిరిబాబు యాదవ్, డీసీఈబీ సెక్రటరీ ఉమర్ అలీ ఉన్నారు.



కృష్ణా జిల్లా ఈడుపుగల్లు హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఐబీ ప్రతినిధి ఆల్డో

శరవేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

▶ మొదటి పేజీ తరువాయి

బయటకు వెళ్లిన లబ్ధిదారులు.. సాయంత్రం ఇంటికి వచ్చాక రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం వేగంగా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు జరిగిన 3 లక్షల రిజిస్ట్రేషన్లలో అత్యధికంగా పల్నాడు జిల్లాలో 24 వేలకుపైగా రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఆ తర్వాత బాపట్ల, పశ్చిమ గోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, నంద్యాల జిల్లాల్లో 17 నుంచి 20 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వం తరఫున వీఆర్‌వోలు లబ్ధిదారుల పేరు మీద రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

కన్వేయన్స్ డీడ్ల ముద్రణకు ఏర్పాట్లు

రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత కన్వేయన్స్ డీడ్స్‌ను ముద్రించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈ బాధ్యత అప్పగించారు. ఈ డీడ్లను త్వరలో సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అన్ని జిల్లాల్లోనూ వాటిని పంపిణీ చేయనున్నారు. దేశ చరిత్రలో పేదలకిచ్చిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏకైక ప్రభుత్వంగా వైఎస్ జగన్ ప్రభుత్వం నిలిచింది. ఇప్పటివరకు పేదలకు ఇచ్చిన స్థలాలకు గత ప్రభుత్వాలు డీ పట్టాలు ఇచ్చేవి. వాటిపై పూర్తి హక్కులు లేకపోవడంతో లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడేవారు. అందుకే తొలిసారిగా వారికి హక్కుల ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు ఇస్తున్నారు. పదేళ్ల తర్వాత ఈ పట్టా (కన్వేయన్స్ డీడ్స్) ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌గా మారుతుంది. గడువు తీరిన తర్వాత తహశీల్దార్ నుంచి నిరభ్యంతర పత్రం అవసరం ఉండదు. కన్వేయన్స్ డీడ్స్ సేల్ డీడ్‌గా మారాక దాన్ని ప్రైవేటు పట్టా మాదిరిగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. కన్వేయన్స్ డీడ్స్ పొందినప్పటి నుంచి దానిపై బ్యాంకు రుణాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

విద్యారంగంలో ఏపీ దేశానికి రోల్ మోడల్

ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

సాక్షి, విశాఖపట్నం: విద్యారంగంలో దేశానికి ఏపీ రోల్ మోడల్‌గా నిలిచిందని ఆస్ట్రేలియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం, అమ్మ ఒడి వంటి ఎన్నో మంచి నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం గొప్ప విషయమని శ్లాఘించారు. తనతోపాటు యువతరానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి అన్నారు. మంగళవారం రాత్రి విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో విద్యార్థులు, యువతలో స్ఫూర్తి నింపేలా ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఎత్తుపల్లాలు, గెలుపోటములు సహజమని.. అపజయాలు తాత్కాలికమని అన్నారు. నిరాశ, నిస్పృహలకు గురికాకుండా వాటిని విజయాలకు మెట్లుగా మలచుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత బాగా చదవడంతో పాటు కుటుంబాన్ని ప్రేమించడం అలవర్చుకోవాలని సూచించారు.

ఏయూ నుంచి ఉన్నత స్థానాలు అధిరోహించారు

అంతకుముందు ఏయూ వైస్ చాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎందరో ప్రఖ్యాత ఇంజినీర్లు, డాక్టర్లు, విద్యావేత్తలతోపాటు మంత్రులు, ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి వంటి ఉన్నత స్థానాలు అధిరోహించారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగంలో ఎన్నో వినూత్న సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. వేలాది మంది విద్యార్థులు, యువత హాజరైన ఈ సభలో ఏయూ రిజిస్ట్రార్ స్టీఫెన్, ఎస్ఆర్‌ఐలు పాతూరు, సునీల్ ఉప్పల, డాక్టర్ నాగేంద్రబాబు చందోలు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్

పట్టుదల, కృషి, తపన ముఖ్యం

'యువత చిన్నతనం నుంచే కలలు కనాలి. లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటి సాధనకు పట్టుదల, కృషి, తపన ముఖ్యం. ఓటమిని విజయానికి బాటలుగా మలచుకోవాలి.. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల మానవత్వం, కృతజ్ఞతా భావం, విలువల పెంచుకోవడం, వాటిని గౌరవించడం, నమ్మకం, ఆధ్యాత్మిక చింతన, క్షమ, సేవా గుణాలను కలిగి ఉండాలి. జీవితంలో ధనార్జనే ధ్యేయం కాకూడదు. చిన్నతనం నుంచే సానుకూల దృక్పథాన్ని అలవరచుకోవాలి. లేకపోతే సంతోషాన్ని కోల్పోతారు' అని నిక్ వుజిసిక్ అన్నారు. మంచి వైపు, ఎదుగుదల వైపు ఎవరు ప్రోత్సహిస్తున్నారో గుర్తించి వారితో స్నేహం చేయాలని, సజ్జనుల స్నేహం ఎదుగుదలకు తోడ్పడుతుందని చెప్పారు. ప్రపంచాన్ని మార్చే శక్తి యువతలోనే ఉందని, ఆ మంచి మార్పు తన ఇంటి నుంచే మొదలు కావాలన్నారు. అందరిలో మంచి మార్పు వస్తుందని, సానుకూల దృక్పథం అలవర్చుకుంటారని, యువత విజయాల వైపు లక్ష్యాలను నిర్దేశించుకుంటారని ఆశిస్తున్నానని అన్నారు. కాగా, కాళ్లు, చేతులూ లేని నిక్‌ను వీల్‌చైర్‌లో వేదికపైకి తీసుకొచ్చారు. అనంతరం ఆయనను ఎత్తుకుని వేదికపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టేబుల్‌పై కూర్చోబెట్టారు. అక్కడ నుంచే ఆయన 'హల్లో.. ఎవ్రిబడీ..' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించి యువతను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. తొలుత మొబైల్ ఫోన్ల లైట్ల వెలుగులతో నిక్‌కు సభికులు స్వాగతం పలికారు.

అటవీ శాఖలో 689 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీకి ఏపీపీఎస్సీకి అనుమతి

సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. అటవీ శాఖలో ఖాళీగా ఉన్న 689 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి (హెచ్‌ఆర్) చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీకు అనుమతించారు. ఆయా పోస్టుల అర్హతలు, రోస్టర్ పాయింట్‌ల ఆధారంగా భర్తీ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పోస్టుల వివరాలు ఇలా..

పోస్టుల పేరు	పోస్టులు
ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్	37
ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	70
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	175
అసిస్టెంట్ బీట్ ఆఫీసర్	375
థానేదార్	10
టెక్నికల్ అసిస్టెంట్	12
జూనియర్ అసిస్టెంట్	10
మొత్తం	689

క్లుప్తంగా...

అంతర్గత జల రవాణాలో ముందడుగు

- ముక్త్యాల, మాదిపాడు వద్ద ఆర్‌వో
- ఆర్‌వో టర్మినల్స్ అభివృద్ధి

సాక్షి, అమరావతి: ఏపీలో అంతర్గత జల రవాణాలో కీలక ముందడుగు పడింది. కృష్ణా నదిలో ముక్త్యాల, మాదిపాడు రోల్ ఆన్-రోల్ ఆఫ్ సేవలకు టర్మినల్ సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు శ్రావణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండర్లు ఖరారు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.యువరాజ్ అనుమతులిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. బిడ్డింగ్‌లో 2 కంపెనీలు పోటీపడగా శ్రావణి ఇండస్ట్రీస్ గరిష్టంగా కోట్ చేసింది. పదేళ్ల పాటు ఈ ప్రాజెక్ట్ అందుబాటులో ఉండనుండగా ప్రభుత్వానికి 5% రెవెన్యూ షేర్ రానుంది. రోడ్డు రవాణాతో పోలిస్తే జల రవాణాలో సులభంగా తరలించే వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో అంతర్గత జల రవాణాను అభివృద్ధి చేస్తోంది.

జోగింపేట హాస్టల్ ఘటనపై నివేదిక కోరిన ఎస్టీ కమిషన్

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని జోగింపేట హాస్టల్‌లో కరెంట్ షాక్‌తో ఏడవ తరగతి విద్యార్థి డేవిడ్ రాజు మృతి చెందిన ఘటనపై ఏపీ ఎస్టీ కమిషన్ స్పందించింది. మంగళవారం పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘటనకు సంబంధించిన వివరాలు, తీసుకున్న చర్యలపై వారం రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. త్వరలో ఆ కుటుంబాన్ని కమిషన్ పరామర్శిస్తుందని తెలిపారు.

'ఇన్‌స్పైర్'కు 56 మంది బీసీ విద్యార్థుల ఎంపిక

సాక్షి, అమరావతి: 'ఇన్‌స్పైర్' మానక్ అవార్డులకు 56 మంది బీసీ విద్యార్థులు ఎంపికైనట్లు మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి 78 పాఠశాలల నుంచి 348 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్-2023 అవార్డు పోటీల్లో పాల్గొన్నారన్నారు. వారిలో ఎంపికైన 56 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ప్రభుత్వం నగదు మంజూరు చేసిందన్నారు. వీరంతా త్వరలో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో పాల్గొంటారని మంగళవారం తెలిపారు.

ప్రత్యేక రైలులో శ్రీవారి దర్శనానికి..

ఢిల్లీ నుంచి బయలుదేరిన 780 మంది భక్తులు

సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారిదర్శనానికి 780 మంది భక్తులు సోమవారం ఢిల్లీ నుంచి బయలుదేరారు. 60 ఏళ్లు పైబడిన ఢిల్లీ వాసులకు దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శనం చేయించాలనే ఉద్దేశంతో ఢిల్లీ ప్రభుత్వం 'ముఖ్యమంత్రి తీర్థయాత్ర' పథకాన్ని అమలు చేస్తోంది. ఉచిత ప్రయాణం, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తోంది. సోమవారం 89వ తీర్థయాత్ర రైలు ఢిల్లీ నుంచి 780 మందిని తీసుకుని తిరుపతికి బయలుదేరింది. వీరంతా తిరుమలలోని శ్రీవారి దర్శనం చేసుకుని తిరుచానూరులోని పద్మావతీ అమ్మవారి దేవాలయం, తిరుపతిలోని ఇస్కాన్ ఆలయాలను సందర్శిస్తారు.

నేడు 'ఇగ్నో' శాశ్వత భవనానికి శంకుస్థాపన

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఏపీకి సంబంధించి విజయవాడలో ప్రాంతీయకేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి సంకల్పించింది. దీనికోసం అమరావతి, రాయపూడి గ్రామంలో ప్రభుత్వం నుంచి భూమిని కొనుగోలు చేసింది. ఆ స్థలంలో ఈ నెల 7న కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. దీనితోపాటు దేశంలోని మరో 6 ప్రాంతీయ కేంద్రాల శాశ్వత భవనాల ప్రారంభోత్సవం కూడా ఆన్‌లైన్ విధానంలో ఇగ్నో కులపతి ఆచార్య నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నారు. విజయవాడ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ కే సుమలత ఆధ్వర్యంలో రాయపూడిలో జరిగే భూమిపూజలో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు, ఒడిశాలోని అన్గుల్ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు, డాక్టర్ మనోజ్ కుమార్ దాస్ పాల్గొంటున్నారు.

'16న జరిగే దేశవ్యాప్త నిరసనకు మద్దతిస్తున్నాం'

సాక్షి, అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న రైతు, కార్మిక సంఘాల దేశవ్యాప్త నిరసనకు సీపీఎం రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం ముగిశాయి. సమావేశం ఆమోదించిన తీర్మానాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాకు తెలియజేశారు. ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రధాని మోదీని ఈ సమావేశం డిమాండ్ చేసింది.

ధీమాగా 'బీమా'

నోటిఫైడ్ పంటల సాగుదారులకు వర్తింపు ● 2022 ఖరీఫ్‌లో 68 లక్షల ఎకరాలకుపైగా బీమా

24 లక్షల ఎకరాలకు కోత అంటూ రామోజీ రోత రాతలు ● టీడీపీ హయాంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపు పరిహారం

సాక్షి, అమరావతి: చంద్రబాబు ఎగ్గొట్టిన పాత బకాయిలను సైతం చెల్లించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తుంటే ఈనాడు రామోజీ మాత్రం పరిహారం చెల్లింపుల్లో కోతలు విధించారంటూ అబద్ధాలను అచ్చేశారు. నిజంగానే పరిహారం భారాన్ని తగ్గించుకోవాలనుకుంటే గత సర్కారు ఎగ్గొట్టిన పాత బకాయిలతో సహా ప్రభుత్వం ఎందుకు చెల్లిస్తుంది? రైతులపై పైసా భారం పడకుండా దేశానికే ఆదర్శంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలియదా?



ఆరోపణ: గతంలో స్వచ్ఛందంగా చేరేవారు..

వాస్తవం: 2016 నుంచి అమలవుతున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎం ఎఫ్‌బీవై)లో చేరాలంటే నోటిఫై చేసిన పంటలకు రుణం తీసుకున్నప్పుడు తప్పనిసరిగా ప్రీమియం వసూలు చేసే వారు. ఇష్టపూర్వకంగా చేరాలంటే ప్రీమియం చెల్లింపులు తలకు మించిన భారంగా పరిణమించాయి. నమోదు ప్రక్రియ సంక్లిష్టంగా ఉండటంతో మెజార్టీ రైతులకు పంటల బీమా అందని ద్రాక్షగా మారింది. మంజూరైన పరిహారం రుణ ఖాతాలకు సర్దుబాటు చేయడంతో సరిపుచ్చడంతో నష్టపోయిన రైతుకు భరోసా లభించేది కాదు. పైగా ఏనాడూ ఖరీఫ్ సీజన్ పరిహారాన్ని మరుసటి ఏడాది ఆగస్టు లోపు చెల్లించిన దాఖలాలు లేవు.

ఆరోపణ: రైతులకు భారంగా ఉచిత పంటల బీమా

వాస్తవం: పంటల బీమా అన్నదాతలకు గుదిబండ కాకూడదన్న సంకల్పంతో డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ 2019 సీజన్ కోసం కేవలం రూపాయి మాత్రమే ప్రీమియంతో పథకాన్ని అమలు చేయగా రైతుల వాటా రూ.468 కోట్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.503 కోట్లు కలిపి మొత్తం రూ.971 కోట్లను తానే భరిస్తూ బీమా కంపెనీలకు చెల్లించింది. అవగాహన లేనందున కొద్దిమంది రైతులు బీమా పరిధిలోకి రాలేదని గుర్తించిన ప్రభుత్వం 2020 ఖరీఫ్ నుంచి పైసా కూడా భారం పడకుండా పూర్తిగా ఉచితంగా పంటల బీమాను వర్తింప చేసింది. ఇందుకు పీఎంఎఫ్‌బీవై నిబంధనలు అడ్డంకిగా మారడంతో ఆ పథకం నుంచి బయటకొచ్చి 2020-21, 2021-22 సీజన్లలో సొంతంగానే బీమా పరిహారం చెల్లించింది. 2022-23 నుంచి పీఎం ఎఫ్‌బీవైతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

ఆరోపణ: 2022-23 ఖరీఫ్‌లో కోతలు ఎందుకు విధించారు?

వాస్తవం: దేశంలో ఏ కంపెనీ అయినా ఒక జిల్లాలో కనీసం 5 వేల ఎకరాల్లో సాగయ్యే నోటిఫైడ్ పంటలకు మాత్రమే బీమాను వర్తింప చేస్తున్నాయి. ఇలా ఖరీఫ్-2022-23లో 21, రబీ 2023-24లో 17 పంటలను నోటిఫై చేశారు. గతేడాది అక్టోబర్ 31 నాటికి ఈ - క్రాప్ ప్రాథమిక డేటా ఆధారంగా ఖరీఫ్ 2022లో తొలుత 34.70 లక్షల మంది రైతులు సాగు చేసిన 70.80 లక్షల ఎకరాల్లోని పంటల వివరాలను కేంద్రానికి పంపగా డూప్లికేషన్, సాంకేతిక కారణాలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ఈ - కేవైసీ ప్రామాణికంగా 33.02 లక్షల మంది రైతులు సాగు చేసిన 68.20 లక్షల ఎకరాల పంటల వివరాలను డిసెంబర్‌లో తిరిగి కేంద్రానికి పంపారు. ఇప్పటివరకు 64.60 లక్షల ఎకరాల్లో పంటలు, 29.3 లక్షల మంది రైతుల వివరాలను నేషనల్ క్రాప్ ఇన్స్యూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

ఆరోపణ: కప్ క్యాప్ మోడల్‌తో రైతులకు అన్యాయం..

వాస్తవం: పరిహారం తగ్గిన సందర్భాల్లో అధిక ప్రీమియం వసూలు ద్వారా బీమా కంపెనీలు భారీగా ప్రయోజనం పొందుతున్నాయనే విమర్శల నేపథ్యంలో ప్రీమియం రేట్లను హేతుబద్ధీకరించగా కేంద్రం సూచించిన ఫార్మాట్లలో విజయవంతమైన కప్ అండ్ క్యాప్ (80-110 మోడల్‌ను 2023-24 సీజన్ నుంచి దిగుబడి ఆధారిత పంటల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఖరీఫ్ సీజన్‌లో 9 క్లస్టర్ల పరిధిలో దిగుబడి ఆధారిత పంటలకు ఈ విధానం అమలు చేస్తోంది. 110 శాతం కన్నా ఎక్కువ నష్టం సంభవిస్తే ఆ మేరకు సొంతంగా భరిస్తూ అదనపు పరిహారాన్ని రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే జమ చేస్తుంది. పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి కోతలు ఉండవు. మరోవైపు వాతావరణ ఆధారిత పథకానికి పాత పద్ధతిలోనే టెండర్లను ఖరారు చేశారు. దేశవ్యాప్తంగా అత్యల్ప ప్రీమియం రేట్లకు టెండర్లను ఖరారు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరం.

ఆరోపణ: గతంలో ఘనంగా పంటల బీమా..

వాస్తవం: టీడీపీ హయాంలో 2016-18 మధ్య పీఎంఎఫ్‌బీవై పథకంలో చేరిన 74 లక్షల మంది రైతులు తమ వాటాగా రూ.871.26 కోట్ల ప్రీమియం చెల్లించగా 30.85 లక్షల మందికి రూ.3,411.20 కోట్ల పరిహారం లభించింది. అయితే గత నాలుగున్నరేళ్లలో రైతులపై పైసా భారం పడకుండా 54,48,344 మందికి రూ.7,802.05 కోట్ల పరిహారాన్ని జమ చేశారు. టీడీపీ హయాంతో పోలిస్తే 23.63 లక్షల మంది రైతులు, రూ.4,390.85 కోట్లు అదనంగా లబ్ధి పొందారు. అంతేకాకుండా చంద్రబాబు 6.19 లక్షల మంది రైతులకు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల పంటల బీమా పరిహారాన్ని సైతం చెల్లించి రైతుల పట్ల సీఎం జగన్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. టీడీపీ హయాంలో 2.32 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ కల్పిస్తే గత నాలుగున్నరేళ్లలో 3.98 కోట్ల ఎకరాలకు బీమా కవరేజ్ వర్తించింది. నాడు 74.40 లక్షల మందికి బీమా రక్షణ కల్పిస్తే నేడు 1.71 కోట్ల మందికి బీమా రక్షణ దక్కుతోంది. అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న ఉచిత పంటల బీమా పథకాన్ని పలు సందర్భాల్లో కేంద్రంతో పాటు అంతర్జాతీయ సంస్థలు సైతం ప్రశంసిస్తుంటే ఈనాడు రామోజీ భరించలేకపోతున్నారు!

టీడీపీ హయాంలో బీమా పరిహారం

సీజన్	రైతుల సంఖ్య లక్షల్లో	లబ్ధి రూ.కోట్లలో
2014-15	1.03	132.24
2015-16	4.35	339.7
2016-17	8.70	954.75
2017-18	6.77	720.6
2018-19	10	1263.91
(ఖరీఫ్-2018) మొత్తం	30.85	3,411.20

గత 4.5 ఏళ్లుగా బీమా పరిహారం చెల్లింపులు

సీజన్	రైతుల సంఖ్య	బీమా మొత్తం రూ.కోట్లలో
గత ప్రభుత్వ బకాయిలు	6,19,641	715.84
ఖరీఫ్ 2019	9,48,000	1,252.18
ఖరీఫ్ 2020	13,00,000	1,739
ఖరీఫ్-2021	15,60,703	2,977.82
ఖరీఫ్-2022	10,20,000	1,117.21
మొత్తం	54,48,344	7,802.05

15న పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: సాంకేతిక విద్యాశాఖలోని పాలిటెక్నికల్ కళాశాలల్లో ఇంగ్లిష్, నాన్-టెక్నికల్ లెక్చరర్ పోస్టులకు ఏపీపీఎస్సీ నిర్వహించిన రాత పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సర్వీస్ కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అదేరోజు సర్టిఫికెట్ల పరిశీలన కూడా ఉంటుందని వెల్లడించింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచామని, వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో హాజరు కావాలని ప్రకటించింది. ఈ పోస్టులకు గతేడాది ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

కులగణన గడువు పొడిగింపు

ఈ నెల 12 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమంలో పూర్తిస్థాయి సమాచారం సేకరించేలా గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళిక విభాగం ముఖ్య కార్యదర్శి ఎం.గిరిజాశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 6 గంటలకు రాష్ట్రంలో 90 శాతం గృహసముదాయాలలో 84 శాతం మంది వివరాల సేకరణ జరిగింది. 90 శాతానికి మించి మరింత సమాచారం సేకరించేలా గడువును పొడిగించాలని వివిధ జిల్లాల కలెక్టర్లు కోరారు. ఉపాధి కోసం తాత్కాలికంగా వలస వెళ్లినవారు, ఆస్పత్రులకు వెళ్లిన వారు, ఇళ్లలో అందుబాటులో లేని వారి సమాచారం సేకరించేలా గడువు అవసరమని భావించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరికొంత గడువు ఇచ్చింది. ఈ నెల 12వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల్లో నూరు శాతం కులగణన పూర్తి చేయాలి. 17వ తేదీలోపు కులగణనలో అందుబాటులో లేనివారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ నెల 24వ తేదీలోపు కులగణన వివరాలను పునఃపరిశీలన పూర్తిచేసి గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు అందించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యాశాఖలో 14 మంది అధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో 14 మంది అధికారులను బదిలీ చేస్తూ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ముగ్గురికి పదోన్నతి కల్పించారు. డిప్యూటీ డైరెక్టర్లు, డీఈవోలు, డీవైఈవోలు కలిపి 11 మందిని అదేహోదాతోను, విజయనగరం, వైఎస్సార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల విద్యాశాఖ అధికారులకు రీజనల్ జాయింట్ డైరెక్టర్లు (ఆర్జేడీ)గా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు.

కాలు బెణికింది అంతే

- గాయపడిన రోజే అధికారులు ఆస్పత్రికి వెళ్దామన్నారు
- మేమే పుత్తూరుకు వెళ్లి కట్టు కట్టించుకుంటామని చెప్పాం
- ఆడుదాం.. ఆంధ్రా కబడ్డీ క్రీడాకారిణి మునెమ్మ



మునెమ్మ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య

చిత్తూరు కలెక్టరేట్: గత టీడీపీ ప్రభుత్వం క్రీడలపై తీవ్ర నిర్లక్ష్యం చూపింది. క్రీడాకారులు ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో నిస్తేజంగా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా ఆడుదాం ఆంధ్రా పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భారీ ఎత్తున క్రీడలను నిర్వహిస్తోంది. వీటి ద్వారా ఆయా క్రీడల్లో గ్రామీణ ఆణిముత్యాలను వెలికితీస్తోంది. అయితే వీటిపైనా రామోజీరావు తన వక్రబుద్ధిని చాటుకున్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ఒక కబడ్డీ క్రీడాకారిణి గాయపడితే ప్రభుత్వం పట్టించుకోలేదంటూ 'ఈనాడు'లో అసత్య కథనాన్ని అచ్చేశారు. 'సాయం కావాలా.. వెళ్లి సీఎంను అడగండి' అనే శీర్షికతో విషం జిమ్మారు. ఈ నేపథ్యంలో అసలు వాస్తవాలు ఇవి..

చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం డీఆర్ పురం గ్రామానికి చెందిన మునెమ్మకు కబడ్డీ అంటే ఎంతో ఇష్టం. టీడీపీ పాలనలో క్రీడలకు ప్రోత్సాహం లేకపోవడంతో ఆమె కబడ్డీ పట్ల ఉన్న ఆసక్తిని చంపేసుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించడంతో ఎంతో సంతోషపడింది. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకుంది. గత నెల 25న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ఆమె ఎడమ కాలు బెణికింది. ఆ సమయంలో అక్కడున్న వైద్యాధికారులు, అధికారులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పారు. అయితే కాలు బెణికిందంతే అని చెప్పి తన భర్తతో కలిసి పుత్తూరుకు వెళ్లి మునెమ్మ కట్టు కట్టించుకున్నారు. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎడమకాలు బెణికిన మునెమ్మ వైద్య చికిత్సల నిమిత్తం మంగళవారం అధికారులు రూ.35 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్డీవో చిన్నయ్య, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, కార్వేటినగరం తహసీల్దార్ పుష్పవతి, ఎంపీడీవో శ్రీధర్‌లు మునెమ్మ ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తనకు ఎలాంటి సమస్యలేదని, ఆటల్లో గాయాలు సహజమేనని మునెమ్మ అధికారులకు తెలిపారు. ఆడే సమయంలో ఎడమ కాలు బెణికిందని చెప్పారు. ఆ సమయంలో నొప్పి ఏమీ లేకపోవడంతో తామే పుత్తూరుకు వెళ్లి కట్టు కట్టించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి సమస్య వచ్చినా జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని మునెమ్మకు అధికారులు హామీ ఇచ్చారు.

జనసేన కార్యకర్తపై టీడీపీ దాడి

- చంద్రబాబు సమక్షంలోనే విరుచుకుపడ్డ టీడీపీ శ్రేణులు
- పవన్ కళ్యాణ్ సీఎం అని నినాదాలు చేశాడని చితకబాదిన వైనం
- మద్యం తాగి పాదచారులను వాహనంతో ఢీకొట్టిన టీడీపీ కార్యకర్తలు
- ఒక మహిళకు విరిగిన కాలు..
- జీడీ నెల్లూరు 'రా.. కదలిరా' సభలో ఘటన



చంద్రబాబు ప్రసంగిస్తుండగానే జనసేన కార్యకర్తపై దాడికి పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు



ఖాళీ కుర్చీలతో దర్శనం ఇస్తున్న సభా స్థలం

సాక్షి, చిత్తూరు: చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని రామానాయుడుపల్లిలో మంగళవారం టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొన్న 'రా.. కదిలి రా' సభలో జనసేన కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. పవన్ కళ్యాణ్ సీఎం అని జనసేన కార్యకర్త నినాదాలు చేయడంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు అతడిని చితకబాదారు. చంద్రబాబు ఎదుటే దాడి జరుగుతున్నా ఆయన తన పార్టీ నేతలను వారించలేదు. టీడీపీ దాడిలో పుత్తూరుకు చెందిన జనసేన కార్యకర్త గాయపడ్డాడు. కాగా సభా ప్రాంగణంలో మొత్తం టీడీపీ జెండాలే కనిపించాయి. జనసేన జెండాలు లేకపోవడంతో జీడీ నెల్లూరు మండల అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, ఇతర కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. మరోవైపు మద్యం మత్తులో సభకు వచ్చిన టీడీపీ శ్రేణులు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో చంద్రబాబు సభాస్థలానికి చేరుకోక ముందే మహిళలు బయటకు వచ్చేశారు. సభ ఆద్యంతం గొడవలు, వివాదాలు, నినాదాలతో సాగింది.

అధికారం ఇస్తే నాణ్యమైన మద్యం: బాబు

టీడీపీకి అధికారమిస్తే నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. సీఎం జగన్ మద్యం ధరలను అమాంతం పెంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వస్తే మద్యం ధర తగ్గించి ఆదాయం పెంచుతానని తెలిపారు. ఈ ప్రభుత్వంలో సరఫరా చేసే మద్యం బ్రాండ్‌లు నాసిరకమన్నారు. ఇలాంటివి తాగి రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది ఆరోగ్యం చెడిపోయిందన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని.. లేనిపక్షంలో ఓటు అడగనన్న జగన్‌కు రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. జగన్‌కు ఓటు వేయవద్దని మహిళలను కోరారు. అయితే, తాను అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యం అందిస్తానని చెప్పడంతో మహిళలు అవాక్కయ్యారు.

ఓటమి భయంతో జగన్‌కు నిద్రపట్టడం లేదు

సీఎం జగన్‌కు ఓటమి భయంతో రాత్రిళ్లు నిద్ర పటడం లేదని చంద్రబాబు ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో ఇసుక కిలోల లెక్కన కొనే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి లేక రాతియుగంలా మారుతోందని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే స్వర్ణయుగంలా మారుస్తానన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాపాల పెద్దిరెడ్డిగా మారారని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం, గ్రానైట్‌ను దోపిడీ చేస్తున్నాడని మండిపడ్డారు. తాను అధికారంలోకి వస్తే అవినీతి సొమ్మును కక్కిస్తానన్నారు. అంగళ్లు ఘటనలో తమ కార్యకర్తలు 600 మందిపై కేసులు పెట్టించాడని, తాను 6 వేల మందిపై కేసు పెట్టడానికి వెనుకాడబోనని హెచ్చరించారు. కాగా చంద్రబాబు ప్రసంగం మొత్తం చప్పగా సాగింది. సభలో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. జన సమీకరణలో జిల్లాకు చెందిన నేతలు ముఖం చాటేయడంతో తమిళనాడులోని పల్లిపట్టు, షోలింగర్, బలిజకండ్రిగ, అత్తిమంజేరిపేట, కాట్పాడి తదితర ప్రాంతాల నుంచి జనాలను తీసుకొచ్చారు. ఒక్కో మహిళకు రూ.100, బిర్యానీ, పురుషులకు రూ.200, మద్యం బాటిల్ ఇచ్చి సభకు జనాన్ని తరలించారు. సభకు మద్యం మత్తులో వచ్చిన టీడీపీ కార్యకర్తలు పాదచారులను వాహనంతో ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఓ మహిళ కాలు విరిగి నుజ్జునుజ్జయింది. అయినా టీడీపీ నాయకులు ఏమాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోయారు. స్థానికులు, బందోబస్తుకు వచ్చిన పోలీసులు ఆమెను 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తరలించారు.

బాబు సభలో యువకుడి అనుమానాస్పద మృతి

- సభకు సమీపంలోనే మృతదేహం పడి ఉన్నా పట్టించుకోని టీడీపీ నాయకులు
- మృతుడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి...
- అనకాపల్లి జిల్లా గొండుపాలెంలో ఘటన



బాదపు శ్రీను మృతదేహం

సాక్షి, అనకాపల్లి: మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొండుపాలెం గ్రామంలో సోమవారం టీడీపీ నిర్వహించిన 'రా.. కదిలి రా' సభలో ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సభా ప్రాంగణం పక్కనే చెట్టు కింద కూర్చున్న యువకుడు అక్కడే మరణించాడు. రాత్రి 8 గంటల వరకు అక్కడే అతని మృతదేహం పడి ఉంది. అతడ్ని సభకు తీసుకువెళ్లిన టీడీపీ నాయకులు సైతం పట్టించుకోలేదు. అంతేకాకుండా ఈ విషయాన్ని అర్ధరాత్రి వరకు గోప్యంగా ఉంచారు. మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... గొండుపాలెంలో చంద్రబాబు పాల్గొన్న 'రా.. కదిలి రా' సభకు అనకాపల్లి మండలం సుందరయ్యపేట గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బాదపు శ్రీను అనే యువకుడితోపాటు పలువురిని టీడీపీ నేతలు తీసుకువెళ్లారు. మధ్యాహ్నం సభ ముగిసిన తర్వాత అందరూ తమ ఇళ్లకు చేరారు. కానీ శ్రీను తమ ఇంటికి రాకపోవడంతో రాత్రి 8గంటల సమయంలో అతని తమ్ముడు ఫోన్ చేశాడు. శ్రీను సెల్ ఫోన్‌ను సభ వద్ద టెంట్లు తీసుకువెళుతున్న వ్యక్తులు ఫోన్ లిఫ్ట్ చేసి అతను స్పృహలో లేడని చెప్పారు. అదే సమయంలో స్థానికులు 108కు ఫోన్ చేయగా, అంబులెన్స్‌లో వచ్చిన సిబ్బంది పరిశీలించి శ్రీను మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడు శ్రీనుకు భార్య లక్ష్మి, కుమారుడు జగన్ ఉన్నారు. శ్రీను తమ్ముడు భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కె.కోటపాడు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. చంద్రబాబు సభకు వెళ్లిన శ్రీను మద్యం తాగి ఉంటాడని, ఆ తర్వాత దాహం వేసి చనిపోయి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ చెప్పారు. కాగా, టీడీపీ సభను మధ్యాహ్నం సమయంలో నిర్వహించడమే కాకుండా అక్కడ కనీసం టెంట్, మంచినీటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండ తీవ్రతకు మృతిచెంది ఉండచ్చని, లేదా గుండెపోటుకు గురై ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.

చింతమనేనిపై చర్యలు తీసుకోండి

- ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ, ఇఫ్టూ డిమాండ్
- చింతమనేనికి వ్యతిరేకంగా జర్నలిస్టుల ర్యాలీ



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా చింతలపూడిలో టీడీపీ 'రా కదలిరా' సభలో మీడియా ప్రతినిధులపై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులు దౌర్జన్యం చేయడాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఖండించారు. దీనిపై మంగళవారం జంగారెడ్డిగూడెంలో నిరసన తెలిపి డీఎస్పీ ధనుంజయుడు, ఆర్డీవో అద్దయ్యకు చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రమిచ్చారు. సీనియర్ జర్నలిస్టులు కేవీ రమణారావు, కేఎస్ శంకరరావులపై చింతమనేని, అనుచరులు అనుచితంగా ప్రవర్తించి వారి సెల్ ఫోన్లు లాక్కుని రోజంతా ఇబ్బందులకు గురిచేయడాన్ని మీడియా ప్రతినిధులు తప్పుబట్టారు. జర్నలిస్టుల విధులకు విఘాతం కలిగించి, మానసిక క్షోభ కలిగించడం హేయమన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి..బోసు బొమ్మ సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కాగా, సీనియర్ జర్నలిస్టులపై చింతమనేని, అనుచరులు దౌర్జన్యం చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే ఖండించింది. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ మాట్లాడుతూ పాత్రికేయులు వృత్తి ధర్మాన్ని నెరవేర్చుతోన్న సమయంలో వారి పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చింతమనేనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్ట్‌లపై దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మీడియా కో-ఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న, మునిసిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు డిమాండ్ చేశారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల కోసం ప్రత్యేక యాప్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్‌మీనా

సాక్షి, అమరావతి: ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల మధ్య సమన్వయం కోసం త్వరలో ప్రత్యేక యాప్ తీసుకురానున్నట్టు చెప్పారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మంగళవారం కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేవరకూ దాడుల్లో సరైన పత్రాలు లేకుండా రూ.10 లక్షల పైబిలుకు నగదు ఉన్నప్పుడే జప్తు చేసి ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఐజీ వెంకట్రామిరెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ స్పెషల్ కమిషనర్ ఆనంద్, ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ దేవకుమార్, రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ ప్రసాదరావు, సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, డిప్యూటీ సీఈవో విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ సీఈవో తాతబ్బాయి పాల్గొన్నారు.



ఇతరులకు ఇవ్వడం వల్ల మనసులో ఒక రకమైన వైశాల్య భావన కలుగుతుంది. మనం జీవించే ప్రపంచాన్ని మన చర్యలే సృష్టిస్తాయి కాబట్టి, ఇవ్వడం అనే చర్య ద్వారా విశాలమైన ప్రపంచ సృష్టి జరుగుతుంది.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 7 ఫిబ్రవరి 2024

ఆచరణ సాధ్యమేనా?!

ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లును మంగళవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టి దేశంలోనే ఆ దిశగా తొలి అడుగేసిన రాష్ట్రమైంది. ఉమ్మడి పౌరస్మృతిపై బీజేపీ ఆరాటం ఎవరికీ తెలియంది కాదు. ఆవిర్భావం నుంచీ బీజేపీ ఆ మాట చెబుతూ వస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూసీసీ ఆ పార్టీ వాగ్దానాల్లో కీలకాంశం. రాష్ట్రాల్లో అంతకుముందూ, ఆ తర్వాతా బీజేపీ అధికారం అందుకున్నా ఎక్కడా ఉమ్మడి పౌరస్మృతి ఇలా బిల్లు రూపంలో చట్టసభ ముందుకొచ్చిన వైనం లేదు. మధ్యప్రదేశ్, అస్సాం, గుజరాత్‌లలో బీజేపీ ప్రభుత్వాలే వున్నా ఈ విషయంలో పెద్దగా పురోగతి లేదు. ఆ రకంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ఇతరులకన్నా చాలా ముందున్నట్టు లెక్క. దేశంలో ప్రస్తుతం ఒక్క గోవాలో మాత్రమే యూసీసీ అమల్లో వుంది. అయితే అది 1867లో అప్పటి పోర్చుగీస్ పాలకులు తెచ్చిన చట్టం. రాజ్యాంగ నిర్మాయక సభలో సైతం యూసీసీ గురించి చర్చ జరిగింది. దాన్ని ప్రాథమిక హక్కుల్లో చేర్చాలని కొందరు సభ్యులు అభిప్రాయపడగా మైనారిటీ వర్గాల సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించటంతో అంతకుమించి ముందుకు కదల్లేదు. చివరకది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో 44వ అధికరణ అయింది. దేశంలోని పౌరులందరికీ వర్తించేలా ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావటానికి రాజ్యం కృషి చేయాలని ఆ అధికరణ నిర్దేశించింది. ఆదేశిక సూత్రాలు రాజ్యం అమలు చేసి తీరాల్సినవి కాదు గనుక న్యాయస్థానాల తీర్పుల్లో ఉటంకించటానికి మాత్రమే ఆ అధికరణ పనికొచ్చింది. 1985లో షాబానో కేసులోనూ, 1995లో సరళా ముద్గల్ కేసులోనూ వెలువరించిన తీర్పుల్లో ఉమ్మడి పౌరస్మృతి దేశ సమైక్యతకూ, సమగ్రతకూ తోడ్పడుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనాలు అభిప్రాయపడ్డాయి. 21వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై భిన్నవర్గాల అభిప్రాయాలు సేకరించి, న్యాయనిపుణులతో కొన్ని నెలలపాటు చర్చించి 'ఈ దశలో అది అవసరమూ కాదు, వాంఛనీయమూ కాద'ని తేల్చింది. చిత్రమేమంటే ఆ తర్వాత ఏర్పడ్డ 22వ లా కమిషన్ యూసీసీపై ప్రజాభిప్రాయాన్ని తెలపాలంటూ ప్రకటనలు విడుదల చేసింది. అది జరిగి మూడేళ్లు గడిచింది కాబట్టి ప్రజల తాజా అభిప్రాయమేమిటో తెలుసుకోదల్చుకున్నామని లా కమిషన్ సమర్థించుకుంది.

ఉమ్మడి పౌరస్మృతి చుట్టూ మొదటినుంచీ వివాదాలు అల్లుకుంటూనే వున్నాయి. దాన్ని తీసుకురావటం, సజావుగా అమలు చేయటం భిన్న మతాల, సంస్కృతులకు నిలయమైన భారత్‌లో సాధ్యంకాదన్నది కొందరి అభిప్రాయం. ముఖ్యంగా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత తదితర వ్యవహారాలతో ముడిపడివుండే అంశాల్లో వేర్వేరు మతాలకు వేర్వేరు సంప్రదాయాలున్నాయి. దాదాపు అన్ని పర్సనల్ చట్టాలూ మహిళలపై వివక్ష ప్రదర్శిస్తున్నాయి. ఈ దశలో అందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనుకోవటం అంత సులభం కాదు. 50వ దశకంలో హిందువులకు వర్తించేలా అయిదు చట్టాలు– హిందూ వివాహ చట్టం, హిందూ వారసత్వ చట్టం, హిందూ మైనర్ల సంరక్షకత్వ చట్టం, హిందూ దత్తత, మనోవర్తి చట్టం, హిందూ ఆస్తి స్వాధీనతా చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టాలే సిక్కు, బౌద్ధ, జైన మతస్తులకు కూడా వర్తిస్తున్నాయి. ముస్లిం, క్రైస్తవ, పార్సీ మతస్తులకు వేర్వేరు పర్సనల్ చట్టాలున్నాయి. ఆ మతాల్లో కూడా కొన్ని అంశాల్లో ఏకరూపత లేదు. సంప్రదాయాల పరంగా చూస్తే వివాహాలకు సంబంధించి హిందూమతంలోనే భిన్నమైన ఆచరణలున్నాయి. అవిభాజ్య హిందూ కుటుంబాలకు వర్తించే పన్ను రాయితీల వంటివి వేరే మతస్తులకు వర్తించవు. ఇక ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయ, మిజోరంలలో స్థానిక సంప్రదాయాలను పరిరక్షించాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. రాజ్యాంగంలోని 25వ అధికరణ పౌరులందరికీ ఏ మతాన్నయినా ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కును ఇస్తున్నది. ఇన్ని అవరోధాలను దాటుకుని అందరికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావటం అంత సులభమేమీ కాదు. 2019లో కేంద్రం తీసుకొచ్చిన మోటారు వాహనాల చట్టానికి ఏమైందో మన కళ్లముందే వుంది. అందులోని కఠిన నిబంధనల కారణంగా చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాన్ని అమలు చేయలేమని చేతులెత్తేశాయి. తమ అవసరాలకు తగినట్టు చట్టానికి సవరణలు తీసుకొచ్చాయి. వలస పాలకుల హయాంలో రూపొంది ఇంతవరకూ అమల్లోవున్న సాక్ష్యాధారాల చట్టం, కాంట్రాక్టు చట్టం, ఆస్తి బదలాయింపు చట్టం వగైరాలకు దాదాపు అన్ని రాష్ట్రాలూ వందల సవరణలు చేసుకున్నాయి. కనుక 'ఒకే దేశం–ఒకే చట్టం' ఆదర్శనీయమైనంతగా ఆచరణసాధ్యం కాదు.

ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై చర్చ, ఆమోదం మంగళవారమే ఉంటాయని ప్రభుత్వం చెప్పినా మరింత సమయం అవసరమన్న విపక్షాల వినతితో అసెంబ్లీ స్పీకర్ దాన్ని సవరించారు. ఆ సంగతలా వుంచితే ఒక్క ఆదివాసీలు మినహా అన్ని మతాలవారికీ వివాహం, విడాకులు, ఆస్తి హక్కు వగైరా అంశాల్లో ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయని బిల్లు చెబుతోంది. ఆఖరికి సహజీవనం చేసే జంటలు సైతం తమ బంధాన్ని రిజిస్టర్ చేయించుకోవాల్సిందేనని బిల్లు నిర్దేశిస్తోంది. సహజీవనంలోకి వెళ్లిన నెలలోగా రిజిస్టర్ చేసుకోవాలనీ, అలా చేయకపోతే మూడునెలల కారాగారం తప్పదనీ హెచ్చరిస్తోంది. రిజిస్టర్ చేయించుకున్న సహజీవనం ద్వారా జన్మించే సంతానాన్ని మాత్రమే సక్రమ సంతానంగా గుర్తించటం సాధ్యమంటున్నది. ఉత్తరాఖండ్‌లో నివసించే వేరే రాష్ట్రాలవారికి సైతం ఇది వర్తిస్తుందని చెబుతోంది. ఇలా పౌరుల వ్యక్తిగత అంశాల్లోకి రాజ్యం చొరబడటం సబబేనా? అసలు దేశమంతటికీ వర్తించే ఉమ్మడి పౌరస్మృతి ఉండాలని 44వ అధికరణ నిర్దేశిస్తుండగా, ఒక రాష్ట్రం అలాంటి చట్టం తీసుకురావటం రాజ్యాంగబద్ధమేనా?

వాగ్దానాల అమలే పాలనకు గీటురాయి

విశ్లేషణ



డా॥ పి. పృథ్వీకర్ రెడ్డి

ఎన్నికల మేనిఫెస్టో అనేది కేవలం ఎన్నికల సందర్భంగా ఇచ్చే అహేతుకమైన హామీల పత్రం కాదు. అలవికాని హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా తప్పించుకోవడానికి కొన్ని పార్టీలు తమ శక్తియుక్తులను ఉపయోగించడం కనిపిస్తుంది. అయితే ప్రజలు ఇటువంటి పార్టీలను గమనిస్తూనే ఉంటారు. సమయం వచ్చినప్పుడు ఓటు ద్వారా బుద్ధి చెబుతారు. ఇందుకు మంచి ఉదాహరణ 2014లో తెలుగుదేశం పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన విధానాన్ని గమనించిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు వైసీపీకి అధికారం కట్టబెట్టడమే. దీన్ని సద్వినియోగం చేసుకొని వైసీపీ 99 శాతం హామీలను నెరవేర్చి మరో విజయం వైపు దూసుకుపోతోంది.

ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు తాము ఏం చేస్తామో చెబుతూ ఒక రాజకీయ పార్టీ తన సిద్ధాంతాలు, ఉద్దేశాలు, విధానాలను ప్రతిబింబిస్తూ ఇచ్చే హామీ పత్రమే ఎన్నికల మేనిఫెస్టో. దీని ఆధారంగా, తమ అంచనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ఏ పార్టీ మేనిఫెస్టో ఉందో ప్రజలు నిర్ణయించుకొని ఓటువేయడానికి వీలవుతుంది. అందువల్ల, రాజకీయ పార్టీ హామీలు స్పష్టంగా ఉండాలి. అమలులో ఎలాంటి అస్పష్టతకు ఆస్కారం ఇవ్వకూడదు. భారత ఎన్నికల సంఘం 2013 సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా, రాజకీయ పార్టీలకు 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్' కింద మార్గదర్శకాలను రూపొందించడానికీ, వారు చేసిన వాగ్దానాలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించిన విషయాలపై చర్చించడానికీ, రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ వాటిపై స్పష్టత రాలేదని చెప్పాలి.

చట్ట ప్రకారం, ఎన్నికల మేనిఫెస్టోలోని వాగ్దానాలు అవినీతి అక్రమాల కిందకు రావని అందరికి తెలిసిన విషయమే. కానీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పార్టీల మధ్య సమాన పోటీ స్థాయిని నిర్ధారించడానికీ, ఎన్నికల స్వచ్ఛతనూ, ప్రజలకు చేసిన వాగ్దానాలనూ కాపాడటం కోసం మాత్రమేనని నిర్ధారించడమైనది.

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేయడం సర్వసాధారణం. అమెరికాలో, ఇది ఆర్థిక, విదేశీ విధానాలు, ఆరోగ్య సంరక్షణ, పాలనా సంస్కరణలు, పర్యావరణ సమస్యలు, వలసలు వంటివాటిపై వారు చేయబోయే పనులను తెలియచేస్తుంది. అనేక పశ్చిమ ఐరోపా దేశాలలో, మేనిఫెస్టోలు మరింత నిర్దిష్ట విధాన ఎంపికలు, బడ్జెట్ చిక్కులను ప్రస్తావిస్తాయి.

2022లో ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ కె. ఝా రాజ్యసభలో మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోకు చట్టబద్ధత కల్పించాలని, ఎన్నికల తర్వాత, రాజకీయ పార్టీలు తాము చేసిన వాగ్దానాలను మరచిపోయి ఆడంబరమైన వాదనలు చేయకుండా చట్టం ఉండాలని చెప్పిన విషయాలను గుర్తు చేసుకోవడం సముచితం. మేనిఫెస్టో ఔచిత్యం తగ్గుతోందని వారు ఆవేదన పడుతూ, 1952, 1957, 1962 ఎన్నికలప్పుడు విడుదల చేసిన మేనిఫెస్టోలను ఉటంకించారు. పార్టీలు చేయదగిన అంశాలను మాత్రమే ఆ యా మేనిఫెస్టోల్లో చేర్చేవారని పేర్కొన్నారు.

తెలుగు దేశం పార్టీ 2014లో విడుదల చేసిన మేనిఫెస్టోను, 'దశ–దిశ చూపించే ఒక పవిత్ర పత్రం'గా అభివర్ణించారు ఆ పార్టీవారు. దీనిలో 'కష్టాలలో ఉన్న రైతులను రుణ మాఫీతో ఆదుకొంటాం' అని చెప్పారు. రుణమాఫీ గురించి ఇంతకు మించి వివరణ మేనిఫెస్టోలో కనపడదు. అనగా ఏ తారీఖు వరకున్న రుణాలు, ఎంత మేరకు మాఫీ చేస్తారనే విషయం ఎక్కడా లేదు. ఈ విషయమై ఆ పార్టీ అధ్యక్షులు బహిరంగ సభలలో చెప్పిన వాగ్దానాలు మేనిఫెస్టోలో లేవు. గెలిచిన తర్వాత ఈ వాగ్దానం అమలును 'మమ' అనిపించడానికి పార్టీ పెద్దలు చాలా శ్రమించారు. ప్రొఫెసర్ కె.వి. రమణారెడ్డి, ఇదే పత్రికలోనూ, డెక్కన్ క్రానికల్ ఆంగ్ల పత్రికలోనూ తెలుగుదేశం పార్టీ ఈ విషయమై రైతులను ఏవిధంగా మభ్య పెట్టిందో తన పరిశోధన ద్వారా విశదంగా వివరించారు. 'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం, రూ 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రైతువారి ఇన్సూరెన్స్' వంటి హామీలనూ ఇదే మేనిఫెస్టోలో పెట్టారు. కానీ గెలిచాక, వీటి ఊసే లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 'రైతుభరోసా కేంద్రా'లను ఏర్పాటు చేసి, రైతుకు కావలసినవన్నీ ఒకే చోట అందుబాటులో ఉంచడంతో బాటు, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం, ధరల స్థిరీకరణ నిధి ద్వారా గిట్టుబాటు ధర అందించడం, పంటనష్ట నివారణకు ఇన్సూరెన్స్ అమలుచేసి రైతుకు అండగా నిలవడం వంటి నిర్మాణాత్మక పనులు చేసింది.



తెలుగుదేశంవారు 'మహిళా సాధికారత కోసం డ్వాక్రా రుణాల రద్దుతో బాటు, వారి అభివృద్ధికి, భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు.' కాని, వాస్తవానికి ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక ఐదు సంవత్సరాలలో ఏమి జరిగిందో మహిళలకు తెలుసు. వైసీపీ ప్రభుత్వం వచ్చినాక, డ్వాక్రా రుణాలను వడ్డీతో బాటు మాఫీ గావించారు. ఇలా ఎన్నికల వాగ్దానాలను పార్టీలు మరచిపోతే, ప్రజలు మరచిపోతారు లేదా క్షమిస్తారనుకోవడం పెద్ద పొరబాటు. తెలుగు దేశం తన పార్టీ మేనిఫెస్టోలో, 'రానున్న అయిదేళ్ళలో ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం/ ఉపాధి అవకాశం కల్పిస్తా'మని మాటిచ్చింది. కానీ దాని గురించి ఏమీ పట్టనట్లు ఐదేళ్లు గడిపేసింది. యువత 2019లో జరిగిన ఎన్నికల్లో, ఎలా గుణపాఠం చెప్పారో అందరికీ తెలిసిందే.

'గుడిసెలు లేని ఆంధ్రప్రదేశ్, ప్రతి గ్రామానికీ తారు రోడ్డు, ప్రతి వీధికి సిమెంటు రోడ్డు, ప్రతి ఇంటికి ఉచితంగా మరుగుదొడ్డి నిర్మించి ఇచ్చుట' వంటి హామీలూ తెలుగుదేశం ఇచ్చింది. అయిదేళ్ల ప్రభుత్వంలో ఉండి, ఎన్ని ఇండ్లు కట్టించారో, మిగతా హామీలు ఏమిచేశారో తెలిసిన విషయమే. ఈ విషయమై ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులు, కట్టిస్తున్న కాలనీల గురించి, పచ్చ పత్రికలకు కనబడక పోయినా, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా తెలుస్తూనే ఉంది. అలాగే పేద పిల్లలకు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామనీ, హెల్త్ కార్డ్ ద్వారా అన్నిరకాల వ్యాధులకు కార్పొరేట్, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యం అందిస్తామనీ మాటిచ్చి గెలిచాక టీడీపీ అమలు చేయలేదు. కానీ వైసీపీ ప్రభుత్వం పదహారు ప్రభుత్వ ఆసుపత్రులను నిర్మించడంతో బాటు డాక్టర్ల నియామకాలు గావించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను కేంద్రం సైతం కొనియాడింది. ఈ మధ్యకాలంలో ప్రారంభించిన ఇంటింటికి వెళ్లి వైద్యపరీక్ష చేయడంతో పాటు ఇతర సేవలందించడం వంటి కార్యక్రమం ఇండియాలోనే ఆరోగ్యరంగంలో ఒక విప్లవం లాంటిది. పేదలకు చదువే ఒక స్థిరమైన ఆస్తిగా గుర్తించి 'నాడు–నేడు' ద్వారా చదువులో తీసుకొచ్చిన సంస్క రణలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

తెలుగుదేశం 2012లో ప్రకటించిన బీసి డిక్లరేషన్ ప్రకారం 100 శాసనసభ స్థానాలు వారికి కేటాయించడం, వారికి ప్రత్యేక బడ్జెట్, బీసీ సబ్–ప్లాన్ పెట్టి అమలు చేస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. గెలిచాక ఇవన్నీ మూలబడ్డాయి. బీసీలకు ప్రస్తుత ప్రభుత్వం ఏమి చేస్తున్నదో అందరికీ తెలుసు.

వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న అనేక సేవలు గుర్తుకు వస్తే, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో అమలు అవుతున్నదని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తెలుగుదేశం తన మేనిఫెస్టోలో, 'ప్రతి ఒక్క హామీనీ, పథకాన్నీ, చిత్తశుద్ధితో అమలు చేస్తాం, ఆచరణలో ఆదర్శంగా నిలుస్తాం' అని చెప్పింది. కానీ ఏ ఒక్క హామీనీ సంపూర్ణంగా అమలు చేయలేక పోయింది. కానీ వైసీపీ నాయకత్వం 2019లో ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకిచ్చిన 'బాండు పేపరు'గా పరిగణించి నూటికి 99 శాతం అమలుచేసి... చిక్కుముడులు విప్పి, ఆ ఒక్కశాతం కూడా అమలుకు ప్రయత్నిస్తామని ప్రజలకు చెబుతోంది. సహజంగా అటువంటి నాయకులను ప్రజలు ఆదరిస్తారు, చిరకాలం గుర్తుపెట్టుకొంటారు.

ఎన్నికైన ప్రభుత్వానికి వారిచ్చిన మేనిఫెస్టో కీలకంగా ఉండాలి. వాస్తవిక ఎన్నికల మేనిఫెస్టో కోసం, రాజకీయాలను మరింత జవాబుదారీగా, పారదర్శకంగా చేయడానికి ఎలక్షన్ కమిషన్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు పదును పెట్టి ప్రజలికిచ్చిన హామీలను కనీసం మూడు వంతులైనా పాటించేట్లుగా నిబంధనలు పెట్టాలి. లేని పక్షంలో, ప్రజలకిచ్చిన మాట తప్పినట్లుగా పరిగణించి తగిన శిక్ష విధించాలి. అలా కానిచో పార్టీల మధ్య సమాన పోటీ స్థాయి ఉండదు. ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేసినట్లవుతుంది.

వ్యాసకర్త హైదరాబాద్‌లోని 'సెస్'(సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్) సీనియర్ పరిశోధకుడు । prudhvikar@cess.ac.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక్కటే ఉండాలనా?



భారత ప్రజాస్వామ్యానికి చెడ్డ కాలం. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత, 'ప్రతిపక్ష' నాయకులు 'సందర్శకుల గ్యాలరీ'లోనే కూర్చోవాల్సి ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఏక పార్టీ దిశగా భారత్ పయనిస్తోందా? ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశపు జనాల కోరిక అదేనా?

– చంద్ర కుమార్ బోస్, యాక్టివిస్ట్

చొరబాటు



ఉత్తరాఖండ్ శాసనసభలో ప్రవేశపెట్టిన ఉమ్మడి పౌర స్మృతి బిల్లు... 'లివ్–ఇన్ రిలేషన్‌షిప్' (సహజీవనం) లోకి అడుగుపెట్టిన ఒక నెల లోగా ఆ బంధాన్ని తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని చెబుతోంది. పరస్పర అంగీకారం ఉన్న వ్యక్తుల జీవితాల్లోకి ప్రవేశించడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన ప్రయత్నం ఇది. పౌరుల వ్యక్తిగత జీవితంతో రాజ్యానికి ఏం సంబంధం?

– శమా మహమ్మద్, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ప్రేమ కోసం విరామం



ఇంగ్లండ్ వర్సెస్ ఇండియా మ్యాచులకు సంబంధించి, బీసీసీఐ షెడ్యూల్ చాలా ఆలోచనాయుతంగా ఉంది. ఫిబ్రవరి 2– 6 వరకు రెండో టెస్టు పోరాటం. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు – రోజ్ డే, చాకొలేట్ డే, ప్రపోజ్ డే, టెడ్డీ డే, ప్రామిస్ డే, హగ్ డే, కిస్ డే, వాలెంటైన్స్ డే. 15 ఫిబ్రవరి – పోరాటం మళ్లీ ప్రారంభం, మూడో టెస్టు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

నింపితే సరి!



గాజాలోని 75 శాతం హమాస్ దళాలను ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) నిర్వీర్యం చేసినట్టూ, కానీ వారి సొరంగాల్లో 25 శాతం మాత్రమే చేయగలిగినట్టూ (ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్) నెతన్యాహూ చెబుతున్నారు. అదృష్టవశాత్తూ, మధ్యధరా ప్రాంతంలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

అంతటా అలాగే...




నేను ఒక పుస్తకాన్ని వేలాది పౌండ్లు పెట్టి ప్రచురిస్తానా... తీరా అది ఒక్క కాపీ మాత్రమే అమ్ముడవుతుంది.

– ఒస్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

ఇన్ బాక్స్

మేరునగధీరుడు

మాజీ ఉప ప్రధాని, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఈ మధ్యనే 96వ జన్మదినాన్ని జరుపుకున్న లాల్ కృష్ణ అద్వాణీకి కేంద్ర ప్రభుత్వం 'భారతరత్న' అవార్డుతో సత్కరించటం ఎంతైనా సముచితం. స్వాతంత్య్రం అనంతర భారత రాజకీయ నాయకులలో విలువలతో కూడిన రాజకీయం చేసిన వారిలో అద్వాణీ ఒకరు. 1927 నవంబర్ 8న నేటి పాకిస్తాన్‌లోని కరాచీలో ఆయన జన్మించారు. తన జీవితంలో తొలి 20 ఏళ్ల పాక్‌లో నివసించినప్పటికీ దేశవిభజన సమయంలో భారత్‌కు వచ్చారు. అంతకు ముందే ఆయన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రచారక్‌గా మారారు.



ఎల్.కె. అద్వాణీ

ఆర్ఎస్ఎస్ మాసపత్రిక 'ఆర్గనైజర్'లో పాత్రికేయునిగా, నాటి భారతీయ జన సంఘ్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శిగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నడిచారు.

తదనంతరం నాటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ చాలక్ గురూజీ గోల్వాల్కర్ ఆదేశాలతో భారతీయ జనసంఘ్‌లో పూర్తి సమయ రాజకీయ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించారు. అటల్ బిహారి వాజ్‌పేయ్, భైరాన్ సింగ్ షెకావత్, రాజమాత విజయరాజె సింధియా వంటి నాయకులతో కలసి భారతీయ జనసంఘ్‌ను దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా తీర్చిదిద్దటంలో అద్వాణీ కృషి వెలకట్టలేనిది. ఎమర్జెన్సీలో ప్రజాస్వామ్యం కోసం పోరాడి బెంగళూరులోని కేంద్ర కారాగారంలో 19 నెలలు జైలు జీవితాన్ని గడిపారు. జైలు నుంచి తన విడుదల కోసం బెంగళూరు హైకోర్టులో తన కేసును తానే వాదించుకొని విడుదల అయిన తర్వాత జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటులోనూ, పతనంలోనూ సంతోషాన్నీ నిస్పృహను అనుభవించిన నిస్వార్థపరుడు అద్వాణీ. 1980లో జనతా పార్టీ పతనం తర్వాత ముంబైలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) స్థాపకుల్లో ఒకరయ్యారు. ఆ పార్టీని అంచలంచెలుగా ఒక నిబద్ధత కలిగిన రాజకీయ పార్టీగా తీర్చిదిద్ది 1998లో మొట్ట మొదటిసారిగా కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడంలో ఆయన పాత్ర మరువరానిది.

హిందీ, ఆంగ్ల భాషల్లో సమానమైన ప్రావీణ్యం గల అద్వాణీ చరిత్ర, రాజనీతి, సాహిత్యం, సామాజిక, తత్వ శాస్త్రాలకు సంబంధించిన అనేక రచనలను అధ్యయనం చేసిన విజ్ఞాన ఖని. కావుననే ఆయన ప్రసంగాల్లో, రచనల్లో ఆయన అనుభవం అపార అధ్యయనం తొణికిసలాడుతుంది. అదే విధంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అద్వాణీపై అక్రమంగా బనాయించిన అయోధ్య, హవాలా వంటి కేసుల విషయంలో విచారణ ఎదుర్కొన్నప్పుడు ఆయన చూపించిన మనో నిబ్బరం, తెగువ, నిజాయితీ నేటి రాజకీయ నాయకులకు ఎంతైనా ఆదర్శనీయం. నేటి భారతరత్న అవార్డుతో భారత దేశ రాజకీయ నాయకుల చరిత్రలో అద్వాణీ పేరు చిరస్థాయిగా నిలుస్తుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

– వై.వి. రామిరెడ్డి । ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్, తిరుపతి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

స్థిరమైన కేటాయింపులతోనే భద్రత

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో 2024–25 సంవత్సరానికిగాను రక్షణ శాఖకు రూ. 6.21 లక్షల కోట్లు కేటాయించింది. ఇంత భారీ మొత్తంలో కేటాయింపులు జరగడం ఇదే మొదటిసారి అని రక్షణ శాఖ అభివర్ణిస్తోంది. 2023–24 కేటాయింపుల కంటే ప్రస్తుత కేటాయింపులు 4.2 శాతం ఎక్కువనీ, మూల ధన వ్యయం కోసమే ఈసారి బడ్జెట్‌లో రూ. 1.72 లక్షల కోట్ల కేటాయింపు జరిగిందనీ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటన చెబుతోంది. మిలిటరీ వ్యవస్థ ఆధునీకీకరణకు, సాధన సంపత్తిని సమకూర్చుకునేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది.

అయితే ఒకసారి ఈ అంకెలను నిర్దిష్ట దృక్కోణంలో చూసే ప్రయత్నం చేద్దాం. భారత ప్రభుత్వం దాదాపు 31 ఎంక్యూ–9బీ సాయుధ డ్రోన్లను అమెరికాకు చెందిన జనరల్ అటామిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్ నుంచి కొనుగోలు చేసే ఆలోచన చేస్తోంది. ఇందుకోసం 400 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టేందుకూ సిద్ధమవుతోంది. అంటే దాదాపు రూ.33 వేల కోట్లు. కొన్నేళ్లపాటు దశల వారీగా ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. రక్షణ సన్నద్ధత కోసం పెట్టే పెట్టుబడి ఏ దేశానికైనా సంక్లిష్టమైందే, బాగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. రక్షణ శాఖ కేటాయింపులను అంచనా వేసేందుకు చాలా సూచికలున్నాయి. ప్రజలెన్నుకున్న ప్రభుత్వం (ప్రజాస్వామ్యం) లేదా అధికారంలో ఉన్న శక్తి (రాజు, మిలిటరీ) ఏదైనాసరే... మిలిటరీ సామర్థ్యం కోసం ఎంత మొత్తంలో ఖర్చుపెట్టాలో నిర్ణయిస్తాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతమన్నది మదింపునకు ఉపయోగపడే ఒక సూచిక.

2022లో ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో స్థూల జాతీయోత్పత్తిలో ఎంత శాతం రక్షణ శాఖకు కేటాయించారన్న విషయాన్ని పరిశీలిస్తే ఇండోనేసియా వంటి దేశాల్లో 0.6 శాతం మాత్రమే ఉంటే... సౌదీ అరేబియా వంటి దేశాల్లో అది 7.4 శాతం వరకూ ఉన్నట్లు తెలుస్తుంది. 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (ఎస్ఐపీఆర్ఐ–సిప్రి) ఈ విషయాలు వెల్లడిస్తోంది. భారత్ విషయానికి వస్తే స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 2.4 శాతాన్ని రక్షణ శాఖకు ఉపయోగిస్తున్నాం. అంటే దాదాపు 8,140 కోట్ల డాలర్లు. 'సిప్రి' జాబితాలో అమెరికా, చైనా, రష్యా తరువాత అత్యధిక కేటాయింపులు ఇండియావే. అయితే, రక్షణ శాఖ కేటాయింపుల్లో సరిహద్దులకు కాపలా కాసే సెంట్రల్ పోలీసు బలగాల కేటాయింపులు ఉండవు. ఈ బలగాలు కేంద్ర హోం శాఖ పరిధిలో పని చేస్తూండటం దీనికి కారణం. కాబట్టి భారతీయ రక్షణ వ్యవస్థ మొత్తానికి అంటే త్రివిధ దళాలు, కోస్ట్‌గార్డ్, డీఆర్‌డీవో, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, కర్మాగారాలకు జరిగిన వాస్తవ కేటాయింపులు 'సిప్రి' అంకెల కంటే భిన్నం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కేటాయింపులను మరింత నిశితంగా పరిశీలిస్తే దశాబ్ద కాలంలో రక్షణ శాఖ కేటాయింపులు అంత ప్రోత్సాహకరంగా ఏమీ లేవని చెప్పాల్సి వస్తుంది.



2024–25 సంవత్సరానికి రక్షణ శాఖ బడ్జెట్ అంచనాలు 2023–24తో పోలిస్తే ఐదు శాతం ఎక్కువ. అయితే ఈ పెంపు ద్రవ్యోల్బణ నష్టాలను కూడా పూడ్చ లేదు. ఇది మధ్యంతర బడ్జెట్ మాత్రమే,. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకూ చేసుకున్న తాత్కాలిక ఏర్పాటు అన్ని గుర్తుంచుకోవాలి.

జీడీపీలో ఎంత మొత్తం రక్షణ శాఖకు కేటాయిస్తున్నారన్న విషయాన్ని పరిశీలిస్తే మాత్రం కొంచెం ఇబ్బంది ఎదరవుతుంది. 'పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిపోర్టు' ప్రకారం 2023–24 కేటాయింపులు జీడీపీలో కేవలం 1.97 శాతం మాత్రమే. ప్రస్తుత ఏడాది ఇది 1.9 శాతం అయ్యింది. రక్షణపై ఏర్పాటైన 2018 నాటి స్టాండింగ్ కమిటీ జీడీపీలో కనీసం మూడు శాతాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు కేటాయించాలని సూచించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. ఈ మేరకు నిర్దిష్టంగా కేటాయింపులు ఉంటేనే సైనికదళాల సర్వసన్నద్ధత సాధ్య మని కమిటీ స్పష్టం చేసింది. అయితే ఈ సూచనను కేంద్రం పట్టించుకోలేదు.

గత దశాబ్దంలో ఏటికేడాదీ జరిగిన కేటాయింపులను పరిశీలిస్తే రక్షణ శాఖకు జీడీపీలో 2.2 శాతం (2013–14) నుంచి... క్రమేపీ తగ్గుతూ వస్తున్నాయి. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం, ఏకమొత్తం చెల్లింపుల కోసం ఒక్క ఏడాది మాత్రం ఎక్కువ కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం ఈ కేటాయింపులు రెండు శాతం కంటే తక్కువగా ఉన్న విషయం స్పష్టమే. రాజకీయ ప్రాథమ్యాలను దృష్టిలో పెట్టుకుంటే సమీప భవిష్య త్తులో ఈ కేటాయింపులు పెరిగే అవకాశమూ కనిపించడం లేదు.

జీడీపీతో పోలిస్తే రక్షణ శాఖ కేటాయింపులు క్రమేపీ తగ్గుతూండటం మిలిటరీ వ్యవస్థ ఆధునీకీకరణపై కచ్చితంగా ప్రభావం చూపుతుంది. ఇది కాస్తా భారతీయ సైన్యం యుద్ధ నైపుణ్యాలను నిర్ణయిస్తుంది. బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం కోసం జరిపిన కేటాయింపులు ఒక మంచి మార్పే. మూలధన వ్యయం కోసం కేటాయించిన రూ.1.72 లక్షల కోట్లను రెండు రకాలుగా చూడవచ్చు. పీఆర్ఎస్ నివేదిక (2023 ఫిబ్రవరి) ప్రకారం, 2013–14లో మూలధన వ్యయం కోసం పెట్టిన ఖర్చు రక్షణ శాఖ బడ్జెట్‌లో 32 శాతం వరకూ ఉండగా... 2023–24లో ఇది 29 శాతానికి తగ్గిపోయింది. అంతేకాదు... ఆయుధ దిగుమతిలో ప్రపంచంలోనే ఇండియా పైస్థానంలో ఉంది. ఈ కొనుగోళ్లన్నీ డాలర్లలో జరగాలి. అంటే డాలర్‌కు ఎన్ని రూపాయలు అన్నది కూడా రక్షణ శాఖ కొనుగోళ్లను ప్రభావితం చేయగలదు. 2013– 14లో డాలర్ విలువ రూ.60.95 కాగా... 2024 జనవరి 10 నాటికి ఇది 83.1కి పడిపోయింది. ఫలితంగా విదేశీ మారక నిల్వల విలువ తగ్గిపోతుంది.

2018లో రక్షణ శాఖపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ మిలిటరీ ఆధునికీకరణపై ఒక హెచ్చరిక కూడా జారీ చేసింది. మిలిటరీ ఆయుధాలు (పురాతన, ప్రస్తుత, అత్యాధునిక) సమాన స్థాయిలో (33.3 శాతం) ఉండాలన్నది ఈ హెచ్చరిక సారాంశం. భారత మిలిటరీ వ్యవస్థలో 68 శాతం ఆయుధాలు పాతవి. 24 శాతం మాత్రమే ఈ కాలానికి చెందినవి. ఇక, అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు కేవలం 8 శాతమే! ఆర్మీ విషయానికి వస్తే ఆయుధాలు, పేలుడు సామగ్రి, నిల్వలన్నింటిలోనూ వెనుకబడి ఉందని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

పాతకాలపు ఆయుధాలను వదిలించుకుని ఆధునికీకరణ చేసుకునేందుకు ఒక విధాన రూపకల్పన, నిధుల కేటాయింపుల విషయంలో తగిన ఆసక్తి లేదని స్టాండింగ్ కమిటీ వ్యాఖ్యానించినట్లు పీఆర్ఎస్ నివేదిక పేర్కొనడం ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం ఈ తేడాలను గమనించి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. దేశం మిలిటరీ పరంగా ఎదుర్కొంటున్న సవాళ్లన్నింటికీ ఇది కీలకమవుతుంది. ఇతరులను నమ్మించేందుకు మాత్రమే ప్రయత్నిస్తూంటే... అది కూడా జాతీయ భద్రత విషయంలో ఇలా జరిగితే... 1962 అక్టోబర్ నాటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదాలు లేకపోలేదు!

వ్యాసకర్త న్యూఢిల్లీలోని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్

('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.11.04 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.53 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.53 నుండి 2.24 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.53 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** రా.10.11 నుండి 11.44 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.54.

క్లుప్తంగా...

ఎయిర్‌పోర్టులో నగదు మార్పిడి కౌంటర్



గోపాలపట్నం (విశాఖ జిల్లా): విశాఖ విమానాశ్రయంలో నగదు మార్పిడి కౌంటర్‌ను ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజా రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ విమానాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కౌంటర్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రాకపోకలు నిర్వహించే విదేశీ ప్రయాణికులు నగదు బదిలీ చేసుకోవచ్చనని తెలిపారు. ఏప్రిల్‌లో రెండు విదేశీ విమానాలు ప్రారంభం కానున్నాయని రాజా రెడ్డి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. ఈ విమాన సర్వీసులు వారానికి మూడురోజులు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

న్యాయవాదుల సంక్షేమంపై తీర్మానం హర్షణీయం

సాక్షి, అమరావతి: న్యాయవాదుల సంక్షేమ చట్టానికి సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడం పట్ల వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉందనేందుకు తాజా తీర్మానమే నిదర్శనమన్నారు. న్యాయవాదులను సంప్రదించకుండా రూ.20 వెల్ఫేర్ స్టాంపు విషయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్షంగా తీర్మానం చేసిందన్నారు. దీంతో ప్రభుత్వం అప్పట్లో న్యాయవాదుల సంక్షేమ చట్టానికి సవరణలు చేసిందని చెప్పారు. ఆ తర్వాత బార్ కౌన్సిల్ తీర్మానంపై న్యాయవాదులు పెద్ద ఎత్తున నిరసనలు తెలపడంతో బార్ కౌన్సిల్ రూ.20 వెల్ఫేర్ స్టాంపును ఉపసంహరించిందన్నారు. న్యాయవాదుల మనోభావాలకు విరుద్ధంగా తీసుకున్న నిర్ణయం తప్పని బార్ కౌన్సిల్ తెలుసుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తాజా తీర్మానం చేసిందన్నారు. రూ.20 వెల్ఫేర్ స్టాంపు అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అది పూర్తిగా బార్ కౌన్సిల్ తీసుకున్న అనాలోచిత, ఏకపక్ష నిర్ణయమన్నారు. కావాలని బురద జల్లేందుకు కొందరు వ్యక్తులు రూ.20 వెల్ఫేర్ స్టాంపు వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజా, న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఈ మేరకు మనోహర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

చిచ్చుపెట్టే లేఖాస్త్రాలను మానుకో జోగయ్య

- టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు రమణ

తిరుపతి కల్చరల్: జనసేన, టీడీపీ పొత్తుపై హరిరామజోగయ్య లేఖాస్త్రాలను మానుకోవాలని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ హితవు పలికారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాపుల ఐక్యత కోసం పోరాడుతున్న ముద్రగడకు మద్దతుగా కదిలిన రాయలసీమ కాపులపై నాడు పాలకొల్లులో నీ కుమారుడు దాడి చేసిన ఘటనతో కాపు జాతికి ఏమి సందేశం ఇచ్చారో చెప్పాలన్నారు. మీడియాకు అనవసర లేఖలు పంపించి చర్చలకు దారితీస్తూ కాపుల్లో అనైక్యతను సృష్టించడం వెనుక ఆంతర్యమేమిటో జోగయ్య చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో రెండు చోట్ల పోటీ చేసిన పవన్‌కళ్యాణ్‌ను ఓడించారని, 'ఎమ్మెల్యేగా కూడా గెలవలేకపోయాను ముఖ్యమంత్రి స్థానాన్ని ఎలా అడగగలను' అని పవన్ చెబుతుంటే జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఎన్ని సీట్లు అడగాలో సూచించడం జోగయ్యకు భావ్యం కాదని హితవు పలికారు.

ఆ ప్రకటనలతో 'ప్రభుత్వ డాక్టర్స్'కు సంబంధం లేదు

- ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమస్యలు పరిష్కరించకపోతే ఆస్పత్రులకు తాళాలు వేసి ఉద్యమ బాట పడతామంటూ వైద్య సంఘాల సమన్వయ కమిటీ పేరుతో ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ కొన్ని పత్రికల్లో అసోసియేషన్ల పేర్లతో ప్రచురితమైన ప్రకటనలకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్ మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అసోసియేషన్ నిబంధనలను అనుసరించి అసోసియేషన్ తరఫున ఏ విధమైన పాలసీ మేటర్లకు సంబంధించి గానీ, అసోసియేషన్‌కు సంబంధించిన ఏ విషయం పైన కూడా మాట్లాడడానికి గానీ రాష్ట్ర అధ్యక్షుడనైన తనకు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిన డాక్టర్ బి.దుర్గాప్రసాద్‌కు తప్ప.. మరెవరికీ అధికారం లేదని పేర్కొన్నారు. అనుమతి లేకుండా మీడియాకు ఎక్కిన వాళ్లపై ప్రభుత్వంతో పాటు అసోసియేషన్ కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడదని హెచ్చరించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడినని అంటూ ప్రజలను, ప్రభుత్వ వైద్యులను గందరగోళానికి గురి చేస్తున్న డాక్టర్ డి.జైదీర్‌బాబును గతంలోనే అసోసియేషన్ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రులకు తాళాలు వేయడం జరగదన్నారు. ప్రభుత్వ డాక్టర్ల విషయాల్లో ప్రభుత్వం ఎంతో సానుకూలంగా స్పందిస్తున్నదని తెలిపారు.

వైద్య రంగంలో విప్లవాత్మక ఫలితాలు

నాడు-నేడుతో వేగంగా ఆస్పత్రుల ఆధునికీకరణ

- ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తరణ
- వైద్యంతో పాటు, వైద్య విద్యపైనా ప్రత్యేక శ్రద్ధ
- వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



విద్యార్థినులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ బాబ్జీ తదితరులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): వైద్య రంగంలో రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న విప్లవాత్మక విధానాలతో సత్ఫలితాలొస్తున్నాయని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ స్పష్టం చేశారు. వైద్య సేవలనే కాకుండా, వైద్య విద్యను సైతం అందరికీ చేరువ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హాలులో జరిగిన వేడుకల్లో యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన నిమ్‌హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమా మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అంతేకాకుండా 60 మంది విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేస్తున్నదని తెలిపారు. సమాజంలో వైద్య రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, నిరుపేదలకు ఉపయోగపడేలా సేవాభావంతో వైద్యం చేయాలన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలకు అందలం

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను ప్రభుత్వం మరింత విస్తరించిందన్నారు. ఆ పథకంలో చికిత్సల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో పాటు, 3,257 వైద్య ప్రక్రియలతో సహా, అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులకు ఎలాంటి వ్యయ పరిమితి లేకుండా ఉచితంగా చికిత్స అందించడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో గతంలో ఉన్న 11 వైద్య కళాశాలలకు అదనంగా 17 కొత్త మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఐదు మెడికల్ కళాశాలల్లో కోర్సులు ప్రారంభమైనట్లు తెలిపారు. రాష్ట్రంలో 10,132 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 177 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 53 ఏరియా ఆస్పత్రులు, 12 జిల్లా ఆస్పత్రులు, 11 టీచింగ్ ఆస్పత్రులు, 15 స్పెషాలిటీ ఆస్పత్రులు, 542 యూపీహెచ్‌సీలు రోగుల ఆరోగ్యానికి భద్రత ఇస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథి నిమ్‌హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైద్యులు నిత్య విద్యార్థిగా ఉండాలని సూచించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, అకడమిక్ జాయింట్ రిజిస్ట్రార్ అజయ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుమిత శంకర్, జాయింట్ రిజిస్ట్రార్ (ఎగ్జామినేషన్స్) పి.ప్రవీణ్‌కుమార్, యూనివర్సిటీ సభ్యులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, పూర్వ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య సేవలు భేష్

- ప్రపంచ బ్యాంక్ బృందం ప్రశంస
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటన



వణుకూరులో ప్రపంచ బ్యాంక్ బృందం

పెనమలూరు/కంచికచర్ల: ప్రపంచ బ్యాంక్ ప్రతినిధుల బృందం మంగళవారం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పర్యటించింది. వణుకూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సందర్శించింది. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం అందిస్తోన్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ద్వారా అందిస్తోన్న సేవలను తెలుసుకుంది. ఫ్యామిలీ డాక్టర్ సేవలు, జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుతోన్న వైద్య సేవలను పరిశీలించింది. జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాల్లో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నట్లు అధికారులు ప్రపంచ బ్యాంక్ బృందానికి చెప్పారు. వణుకూరు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు జాతీయ స్థాయిలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ అవార్డు వచ్చినట్లు చెప్పారు. కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు, ఆరోగ్య వెబ్‌సైట్ నిర్వహణ, ఈ-ఔషధి టెలీ మెడిసన్, తదితర అంశాల నిర్వహణను పరిశీలించింది. బృందంలో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారి షాహిద్ ఆలీ వర్షీ, ఎన్‌హెచ్ ఎస్ఆర్‌సీ ప్రతినిధి షీనా చబ్రా, డాక్టర్ గురు రాజేష్, స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్ రావు, స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ప్రతిపక్షం చేష్టలు సిగ్గుచేటు



1,227వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: అసెంబ్లీలో ప్రజాసమస్యలపై స్పందించకుండా ప్రతిపక్షాలు వేస్తున్న చిల్లర చేష్టలు సిగ్గుచేటని, వారు వ్యవహరించిన తీరు చూసి ప్రజలు విస్తుబోతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,227వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. ఏపీలో ప్రతిపక్షం చేస్తున్న దుర్మార్గపు రాజకీయాల కారణంగా బహుజనులు నానా ఇబ్బందులు పడుతున్నారనేందుకు జరుగుతున్న పరిణామాలే నిదర్శనమన్నారు. వికేంద్రీకరణ ద్వారా యావత్ రాష్ట్రానికి ఫలాలు అందించాలని తాము పోరాటం చేస్తున్నామని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చట్టసభల్లో నిర్ణయించి ముందుకెళితే కేవలం తమ సామాజిక వర్గమే అభివృద్ధి చెందాలనే కులవాదులను తరిమికొడతామని హెచ్చరించారు. తమ చిన్నారులకు ఇంగ్లిష్ విద్య, రాజధాని ప్రాంతంలో 54 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు రాకుండా అడ్డుకుంటూ వేసిన తప్పుడు కేసులు ఎవరి లబ్ధికోసమో బాబు బహిరంగ పరిచి ఎన్నికల్లో తమ ఓట్లు అడిగేందుకు రావాలన్నారు. బాబు తన సామాజిక వర్గం, బినామీలను అడ్డుపెట్టి పెట్టుబడిదారీ ఉద్యమం నడుపుతూ ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారానికి దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, పెరికే వరప్రసాద్, కారుమూరి పుష్పరాజు, ఈపూరి ఆదాం, ఇందుపల్లి సుభాషిణి, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు.

పచ్చ మీడియా పిచ్చి రాతలు

రాజ్యాంగబద్ధ ఎన్నికల సంఘంపైనా బురదజల్లే యత్నం

- పబ్లిక్ డొమైన్‌లోని డేటాను దొంగలించారని దుష్ప్రచారం
- సీఈఓ స్థాయిలో ప్రస్తుత ఓటర్ల జాబితా, మార్పులు-చేర్పులు డేటా మాత్రమే యాక్సెస్
- ఈ డేటానే దొంగలించారని అంటూ కట్టుకథ
- పాతడేటా మొత్తం భారత ఎన్నికల సంఘం ఈ ఆర్వోనెట్ 2.0 సర్వర్‌లో భద్రం
- ఆ డేటా కావాలంటే సీఈఓ సైతం ఈసీఐని సంప్రదించాల్సిందే
- అవగాహన లేకుండా ఎల్లో మీడియా బరితెగింపు పచ్చమీడియా పిచ్చి రాతలు
- వైఎస్సార్‌సీపీ ప్రతిష్ఠనూ దిగజార్చేలా అసత్య కథనాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పచ్చ మీడియా పైత్యం హద్దులు దాటుతోంది. రాజ్యాంగ వ్యవస్థలను సైతం తన కుట్రల్లోకి లాగుతూ అడ్డగోలుగా బురద జల్లుతోంది. ఎన్నికల సంఘంలో డేటా నిర్వహణ ప్రొటోకాల్స్‌పై అవగాహన లేకుండా పిచ్చిరాతలతో బొక్కబోర్లా పడింది. పబ్లిక్ డొమైన్‌లో ఎవరైనా సులభంగా యాక్సెస్ చేయగల డేటాను.. వైఎస్సార్‌సీపీ కోసం ఐప్యాక్ సభ్యులు దొంగలించారంటూ మంగళవారం 'ఈసీలో దొంగలు పడ్డారు' పేరుతో కథనాన్ని అచ్చేసి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకుంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం (సీఈఓ) తీవ్రంగా స్పందించింది. సీఈఓ పనితీరు, ఐటీ వ్యవస్థ నిర్వహణపై అవగాహన లేకుండా నిరాధార ఆరోపణలు చేయడం, తమ నుంచి ఎలాంటి స్పష్టత తీసుకోకుండానే ప్రజలను భయాందోళనకు గురిచేసేలా వార్తను ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఇటువంటి నిరాధార ఆరోపణలు సీఈఓ కార్యాలయ సమగ్రతను, ప్రజాస్వామ్య ప్రక్రియలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది.

ఈ డేటాను ఎవరైనా తీసుకోవచ్చు..

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్వో నెట్ 2.0ను అమలుచేస్తోంది. దేశంలోని మొత్తం డేటాబేస్‌ను సైబర్ సెక్యూరిటీ నిబంధనలను పాటిస్తూ ఈసీఐ తన సర్వర్ ద్వారా నిర్వహిస్తుంది. అంతేగానీ.. ఈసీఐ సర్వర్ ఒక రాష్ట్ర సీఈఓ నిర్వహణలో ఉండదు. ఇక్కడ ఈసీఐ నిర్దేశించిన అత్యాధునిక భద్రతా చర్యలు, అత్యంత పారదర్శకంగా ఉండే డేటాఫ్రేమ్ వర్క్‌లోనే సీఈఓ కార్యాలయం పనిచేస్తుంది. వాస్తవానికి.. రాష్ట్ర సీఈఓ కార్యాలయంలోని ఈఆర్వో నెట్‌లో రెండు రకాలుగా డేటా అందుబాటులో ఉంటుంది. ఇందులో ప్రస్తుత ఓటర్ల జాబితా డేటా, ఓటర్ల జాబితాలో మార్పులు-చేర్పులు, తొలగింపులకు వచ్చిన దరఖాస్తు ఫారాలకు సంబంధించిన డేటా మాత్రమే ఉంటుంది. ఇది పబ్లిక్ డొమైన్‌లో.. అంటే సీఈఓ వెబ్‌సైట్ ద్వారా సాధారణ ప్రజలు సైతం చూడొచ్చు. మరోవైపు.. ఓటర్ల జాబితా ప్రచురణ సమయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు హార్డ్ డిస్కులలో దీనిని అందిస్తుంది. ఈ డేటాను సీఈఓ ద్వారా నిర్ణీత రుసుము చెల్లించి ఎవరైనా తీసుకోవచ్చు. ఇంకా ఓటర్లు తమ ఓటులో మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత సవరించిన జాబితా సైతం సీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. దీనిని ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ సమాచారాన్ని ప్రతీవారం ఈఆర్వో, డీఈఓలు అన్ని రాజకీయ పార్టీలతోనూ పంచుకుంటారు. వాస్తవానికి.. ఈసీఐ నియంత్రణలో ఉన్న ఈఆర్వోనెట్ సర్వర్‌కు సీఈఓ, డీఈఓ, డీఆర్వోకి పరిమితంగా యాక్సెస్ ఉంటుంది. ఓటర్ల జాబితా, మార్పులుచేర్పులు అభ్యర్థనలు.. ఈ రెండు రకాల డేటా మినహా మరే ఇతర డేటాను సీఈఓ స్థాయిలో యాక్సెస్ చేయలేరు.

సీఈఓ సైతం ఈసీఐని అడగాల్సిందే..

ఏప్రిల్ 2023లో ఈసీఐ ఈఆర్వో నెట్ 2.0ను ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఈసీఐ ఆయా రాష్ట్రాల ఓటర్ల జాబితా మొత్తాన్ని తన సర్వర్‌లో భద్రపరిచింది. ఏ రాష్ట్ర సీఈఓ కార్యాలయం అయినా పాత డేటా కావాలంటే ఈసీఐ దృష్టికి తీసుకెళ్లాల్సిందే. అలాంటిది.. అంతభద్రంగా దాచిన డేటాను తొలగించడం అనేది అసాధ్యం. కానీ, పచ్చమీడియా మాత్రం 2021, 22 సంవత్సరాలకు సంబంధించిన డేటాను ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సాయంతో కొంతమంది దొంగలించారని బరితెగించి అసత్య ఆరోపణ చేస్తోంది. ఎవ్వరూ ఈసీఐ సర్వర్‌ను యాక్సెస్ చేయలేనప్పుడు ఆ డేటా ఎలా దొంగిలిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

- వైఎస్సార్ జిల్లా బద్వేలు-నెల్లూరు జాతీయ రహదారిలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.45 లక్షలను బద్వేలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులపై టీడీపీ దౌర్జన్యకాండ

- టైరు తగలబెట్టి పోలీసులపై విసిరిన పచ్చమూకలు
- ఉయ్యూరులో మాజీ ఎమ్మెల్సీ వైవీబీ అనుచరుల అరాచకం

ఉయ్యూరు: కృష్ణా జిల్లా ఉయ్యూరులో పోలీసులపై టీడీపీ మూక దౌర్జన్యకాండకు దిగింది. అరాచక శక్తుల్లా పేట్రేగిపోయి టైర్లకు నిప్పు పెట్టి పోలీసులపైకి విసిరింది. ఇందుకు సంబంధించిన వివరాలు... ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఉదయం 'అసెంబ్లీ ముట్టడి' పేరుతో ఉయ్యూరులోని తన నివాసం నుంచి బయలుదేరారు. ఆ కార్యక్రమానికి అనుమతిలేదని ఎస్ఐ గణేష్‌కుమార్ వచ్చి తెలియజేశారు. అయినా వైవీబీ తన అనుచరులతో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైవీబీ అనుచరులు ఒక్కసారిగా పోలీసులపై విరుచుకుపడ్డారు. సీఎం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీసులతో తోపులాటకు దిగారు. టీడీపీ కార్యకర్త ఒకరు పోలీసు కాలర్ పట్టుకోవడంతో ఎస్ఐ గణేష్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపైనే దాడి చేస్తారా? అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు పాత టైర్లు తీసుకువచ్చి నిప్పు పెట్టారు. మంటల్లో కాలుతున్న టైర్లను విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందిపైకి విసిరారు. దీంతో ఒక్కసారిగా వాతావరణం భయానకంగా మారింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులపై టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి కాలుతున్న టైర్లను విసరడంతో పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తంచేశారు. టీడీపీ కార్యకర్తల విధ్వంసకర చర్యలు ఉధృతం కాకుండా వైవీబీని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అనంతరం సీఐ హబీబ్ బాషా, ఎస్ఐ చాకచక్యంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

టీడీపీ అంటే గౌరవం ఇదేనా బోండా!?

- పార్టీ కండువాలను కాలుతో తీసి కార్యకర్తల మెడలో వేసిన ఉమా
- నెట్టింట ఆ వీడియో హల్‌చల్
- సోషల్ మీడియాలో విమర్శల వెల్లువ



పార్టీ కండువాను కాలుతో తీస్తున్న టీడీపీ నాయకుడు బోండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): టీడీపీ కండువా అయినా.. కార్యకర్తలైనా నా కాలిగోటితో సమానం.. అన్నట్లుగా టీడీపీ నాయకుడు బోండా ఉమామహేశ్వరరావు వ్యవహారం ఉందని పలువురు నెట్టింట విమర్శలు గుప్పిస్తున్నారు. పలువురు యువకులు టీడీపీలో చేరే కార్యక్రమం ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం జరిగింది. బోండా ఉమా పార్టీ కండువాలను యువకుల మెడలో వేసేందుకు తన ఎదురుగా ఉన్న బల్లపై నుంచి ఒక్కొక్కటి తీస్తున్నాడు. ఈ క్రమంలో కండువాలు కిందపడిపోగా వాటిని ఉమా తన కాలుతో పైకి తీసి కార్యకర్తల మెడలో వేశారు. ఇలా రెండుసార్లు తన కాలుతోనే టీడీపీ కండువాలను తీసి కార్యకర్తల మెడల్లో వేయడంతో అక్కడున్న నాయకులతో పాటు కొత్తగా పార్టీలో చేరుదామని వచ్చిన యువకులు సైతం నోరు వెళ్లబెట్టారు. ఈ వీడియో వెలుగులోకి రావడంతో సోషల్ మీడియాలో సోమవారం దీనిపై అనేక విమర్శలు వచ్చాయి. టీడీపీపై, కార్యకర్తలపై బోండా ఉమాకు ఉన్న గౌరవం ఇదేనా అంటూ పలువురు ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా అనుచరులు, సొంత పార్టీ నాయకులే ఈ వీడియోను నెట్టింట వైరల్ చేయడం గమనార్హం.

బరితెగించిన ఎర్రచందనం స్మగ్లర్లు

- టాస్క్‌ఫోర్స్ పోలీసులను కారుతో ఢీకొట్టిన దుండగులు
- ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ గణేశ్
- ముగ్గురు పరారీ.. మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు
- కానిస్టేబుల్ కుటుంబానికి రూ.30 లక్షల తక్షణ సాయం ప్రకటించిన సీఎం వైఎస్ జగన్



గణేశ్(ఫైల్)

కేవీపల్లె/పీలేరు: ఎర్రచందనం స్మగ్లర్లు బరితెగించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులను కారుతో ఢీకొట్టారు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లాలో జరిగింది. వివరాలు.. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా ఏర్పడి సోమవారం రాత్రి కేవీపల్లె, సుండుపల్లె మండలాల సరిహద్దుల్లో తనిఖీలు చేపట్టారు. ఆర్ఎస్ఐ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆరుగురు సిబ్బంది కేవీ పల్లె మండల సరిహద్దు వద్ద గస్తీ కాస్తుండగా.. మంగళవారం తెల్లవారుజామున కేఏ 02 ఎంజీ 2847 నంబర్ కలిగిన స్విఫ్ట్ కారు అటుగా దూసుకువచ్చింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కారును ఆపేందుకు ప్రయత్నించారు. కానీ కారు వేగంగా వచ్చి కానిస్టేబుల్ బి.గణేశ్(40)ను ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే గణేశ్ మృతి చెందాడు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కారును చుట్టుముట్టేసరికి ముగ్గురు స్మగ్లర్లు పారిపోగా.. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కారులో ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులిద్దరూ తమిళనాడుకు చెందినవారని పోలీసులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి.. వివరాలను తెలుసుకున్నారు. కానిస్టేబుల్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

గణేశ్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

విధి నిర్వహణలో గణేశ్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలుసుకున్న సీఎం జగన్ మానవత్వంతో స్పందించారు. గణేశ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి తక్షణ సాయంగా రూ.30 లక్షలు ప్రకటించారు. ఈ విషయాన్ని అనంతపురం డీఐజీ వెంకటేశ్వర్లు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు చెప్పారు. పీలేరు ప్రభుత్వాస్పత్రి వద్ద గణేశ్ మృతదేహానికి డీఐజీ, ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ నివాళులర్పించారు. గణేశ్ కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గణేశ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. గణేశ్‌కు నివాళులర్పించిన వారిలో డీఎస్పీ మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో వివేక్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి, ఎఫ్ఆర్‌వో రామ్లానాయక్, సీఐలు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులున్నారు.

శోకసంద్రంలో కుటుంబసభ్యులు

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం గుట్టకిందపల్లెకు చెందిన గణేశ్.. 2013 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్‌లో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ.. తిరుపతిలోనే నివాసం ఉంటున్నారు. గణేశ్‌కు భార్య అనూషతో పాటు కుమారులు రాజకిశోర్(6), వేదాన్ష్(3) ఉన్నారు. పీలేరు ప్రభుత్వాస్పత్రికి వచ్చిన గణేశ్ కుటుంబసభ్యులు.. అతని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.

పాకిస్తాన్‌లో సాధారణ ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమవుతోంది. గురువారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. పాక్‌లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా సైన్యం దన్నున్న పార్టీయే గెలవడం ఆనవాయితీ. ఆ లెక్కన ఈసారి మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్)దే విజయం ఖాయమంటున్నారు. మరో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సైన్యం ఆగ్రహానికి గురై జైలుపాలవడంతో ఆయన పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ కకావికలైపోయింది. బిలావల్ భుట్టో సారథ్యంలోని పీపీపీ కూడా పెద్దగా పోటీ ఇచ్చేలా కన్పించడం లేదు. ఎప్పట్లాగే ఈ ఎన్నికల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం అంతంతే ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ ఎన్నికల బరిలో...
ఆమె అంతంతే

పోటీలో ఉన్న మహిళలు 839 మందే

- మొత్తం అభ్యర్థుల్లో కేవలం 4.7 శాతం
- తొలిసారి బరిలో హిందూ మహిళ
- ఆకట్టుకుంటున్న మరో యూట్యూబ్ సంచలనం

పాకిస్తాన్ ఎన్నికల బరిలో ఉన్న మొత్తం 17 వేల మంది పై చిలుకు అభ్యర్థుల్లో మహిళలు ఎందరో తెలుసా? కేవలం 839 మంది! అంటే 4.7 శాతం. సాంప్రదాయికంగా పాక్‌లో మహిళలకు రాజకీయాల్లో అంతగా ప్రోత్సాహం దక్కదు. దాంతో ఎన్నికల్లో కూడా వారి ప్రాతినిధ్యమూ అంతంతమాత్రంగానే ఉంటూ వస్తోంది. పరిస్థితిని మార్చేందుకు మహిళలకు కనీసం 5 శాతం టికెట్లివ్వడాన్ని ఎన్నికల సంఘం తప్పనిసరి చేసింది. అయినా వారికి ఆ మాత్రం టికెట్లిచ్చేందుకు కూడా ప్రధాన పార్టీలకు మనసు రావడం లేదు. ఈసారి మహిళలకు ఇమ్రాన్ సారథ్యంలోని పీటీఐ ఇచ్చిన 53 టికెట్లే అత్యధికం! అయితే వారిలోనూ జాతీయ అసెంబ్లీకి పోటీ పడుతున్నది కేవలం 28 మందే. మిగతా 25 మంది ప్రావిన్సుల స్థానాల్లో పోటీకి పరిమితమయ్యారు. ఇక మహిళలకు పీపీపీ 4.5 శాతం, పీఎంఎల్ (ఎన్) కేవలం 4.2 శాతం టికెట్లతో సరిపెట్టాయి. పీపీపీ నుంచి 35 మంది, పీఎంఎల్ నుంచి 28 మంది మహిళలే బరిలో ఉన్నారు. వారిలోనూ చాలామంది పోటీ ప్రావిన్సు స్థానాలకే పరిమితం! కాకపోతే పాక్ చరిత్రలోనే తొలిసారిగా ఓ హిందూ మహిళ బరిలోకి దిగుతుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలవనుంది. అలాగే ఓ యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్, తాలిబన్ల చేతిలో భర్తను కోల్పోయిన మరో మహిళా నేత బరిలో ఉన్నారు....

సవీరా.. తొలి హిందూ అభ్యర్థి



25 ఏళ్ల సవీరా ప్రకాశ్ పాకిస్తాన్‌లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి హిందూ మహిళగా చరిత్ర సృష్టించారు. ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్సులో బునెర్ జిల్లాలోని పీకే-25 నియోజకవర్గం నుంచి పీపీపీ టికెట్‌పై బరిలో దిగిన ఆమె ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇటీవలే వైద్యవిద్య పూర్తి చేసిన సవీరాది ఆసక్తికరమైన నేపథ్యం. ఆమె తండ్రి ఓం ప్రకాశ్ సిక్కు కాగా తల్లి క్రిస్టియన్. వారిద్దరి అంగీకారంతో సవీరా మాత్రం హిందూ మతావలంబిగా మారారు. తద్వారా పాక్ వంటి ముస్లిం మెజారిటీ దేశంలో మత సహనానికి, సామరస్యానికి ప్రతీకగా నిలిచారామె. భారత మూలాలున్న ఓం ప్రకాశ్ ఉచిత వైద్యంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో బాగా పేరు పొందారు. ఎన్నడూ ఎన్నికల బరిలో దిగకపోయినా 30 ఏళ్లుగా పీపీపీ కార్యకర్తగా ఉంటూ వస్తున్నారు. చెడు చేయాలని ఏ మతమూ చెప్పదంటూ సవీరా చేస్తున్న ప్రచారానికి ముస్లింల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. మత, లింగ వివక్షను నిర్మూలించడమే తన లక్ష్యమని ఆమె అంటున్నారు. ''పాక్‌లో ప్రజా జీవితంలో మహిళ పట్ల వివక్ష బాగా ఉంది. మా జిల్లానే తీసుకుంటే చదువుకున్న మహిళల సంఖ్య కేవలం 29 శాతం. దేశవ్యాప్తంగా కూడా మహిళల్లో అక్షరాస్యత 46 శాతమే. దీన్ని మార్చేందుకే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా'' అని చెబుతున్నారు. మహిళా రిజర్వు స్థానం నుంచి కాకుండా జనరల్ సీటు నుంచి ఆమె బరిలో దిగడం మరో విశేషం.

ఓటర్లను 'ఇన్‌ఫ్లుయెన్స్' చేస్తుందా...?



లాహోర్‌లోని ఎన్ఏ-122 స్థానంలో పీఎంఎల్ (ఎన్) అభ్యర్థి ఖవాజా సాద్ రఫీక్, పీటీఐకి చెందిన లతీఫ్ ఖోసా హోరాహోరీ తలపడుతున్నారు. వారిద్దరినీ ఢీకొంటున్న ఓ యూట్యూబ్ సంచలనం ఇప్పుడు దేశమంతటి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఆమె జెబా వకార్. వృత్తిరీత్యా గైనకాలజిస్టు అయిన ఆమె జమాత్ ఇ ఇస్లామీ అనే మతపరమైన పార్టీ సభ్యురాలు. ఆ పార్టీ తరఫునే బరిలో దిగారు. యూట్యూబ్‌లో ఆమెకు 17,500 మందికి పైగా ఫాలోయర్లున్నారు. ఖురాన్, హదీత్‌లపై రోజూ ప్రసంగాలు అప్‌లోడ్ చేస్తుంటారు. విద్యాధికులైన యువతులకు ఖురాన్ పాఠాలు చెప్పే సంస్థను కూడా భర్తతో కలిసి నడుపుతున్నారు. ''నన్ను గెలిపిస్తే మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా చూస్తా. వారిపై వేధింపులకు తెర దించేలా కఠిన చట్టాల కోసం కృషి చేస్తా'' అని చెబుతున్నారు.

భర్త బాటన...



ఇక పెషావర్ నుంచి బరిలో దిగుతున్న సమర్ హరూన్ బిలౌర్‌ది మరో గాథ. గత ఎన్నికల వేళ ఆమె భర్త హరూన్‌ను ప్రచారం సందర్భంగా పాక్ తాలిబన్లు కిరాతకంగా కాల్చి చంపారు. దాంతో ఆయన స్థానంలో సమర్ బరిలో దిగాల్సి వచ్చింది. అవామీ వర్కర్స్ పార్టీ తరఫున ఆ ఎన్నికల్లో నెగ్గి పెషావర్ నుంచి తొలి మహిళా ప్రావిన్షియల్ ఎంపీగా రికార్డు సృష్టించారామె. దాంతో దేశ రాజకీయాల్లో ఆమె పేరు అందర్లోనూ నానింది. ఈసారి కూడా ఆమె మళ్లీ బరిలో దిగుతున్నారు. అఫ్గాన్ సరిహద్దులకు సమీపంలో ఉండే పష్తూన్ ప్రాబల్య నగరమైన పెషావర్‌లో, పరిసర ప్రాంతాల్లో మహిళలపై అణచివేత మరింత అధికం. మహిళలపై తీవ్ర అణచివేతలకు పేరుమోసిన తాలిబన్ల ప్రభావం మరింత ఎక్కువ. దాంతో సమర్ చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. గత ఎన్నికలప్పుడు మతోన్మాద మూకల బెదిరింపుల నేపథ్యంలో బిక్కుబిక్కుమంటూనే ప్రచారం చేశారు. ఈ ఐదేళ్లలో పరిస్థితులు కాస్త మెరుగయ్యాయంటారు సమర్. నిత్యం ప్రజల్లో తిరుగుతూ, వారి సమస్యలను వింటూ, ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండటం ఆమెకు బాగా పేరు తెచ్చింది.

అందుబాటులోకి 'భారత్ రైస్'



కేజీ ధర రూ.29

న్యూఢిల్లీ: రాయితీ ధరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'భారత్ రైస్' బియ్యం విక్రయాలు దేశవ్యాప్తంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. కిలో బియ్యం ధరను రూ.29గా ప్రభుత్వం నిర్ణయించిన విషయంతెల్సిందే. భారత జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్), భారత జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య(ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భండార్ రిటైల్ ఔట్‌లెట్‌లలో ఈ బియ్యాన్ని విక్రయిస్తారు. గత ఏడాదికాలంలో బియ్యం ధరలు రిటైల్ మార్కెట్లో 15 శాతం మేర పైకెగసిన నేపథ్యంలో సాధారణ ప్రజానీకానికి ధరల నుంచి కాస్తంత ఉపశమనం కల్పించే లక్ష్యంతో కేంద్రం ఇలా రాయితీ బియ్యం అమ్మకాలు ప్రారంభించింది. '' సగటు భారతీయునికి రోజువారీ ఆహార పదార్థాల ధరలు అందుబాటులో ఉంచేందుకే ఇలా బియ్యాన్ని రాయితీ ధరకు విక్రయిస్తున్నట్లు ఢిల్లీలో సబ్సిడీ రైస్ అమ్మకాల ప్రారంభోత్సవంలో కేంద్ర ఆహార, వినియోగ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. 5 కేజీలు, 10 కేజీల ప్యాకెట్లలో భారత్‌రైస్ అందుబాటులో ఉంటుంది. ఢిల్లీలో భారత్‌రైస్‌ను విక్రయించే 100 మొబైల్ వ్యాన్లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఐదుగురు లబ్ధిదారులకు ఐదు కేజీల బ్యాగులను పంపిణీచేశారు. ఈ బియ్యాన్ని ఆన్‌లైన్‌లో ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపైనా ఆర్డర్‌చేయవచ్చు.

'పోటీ పరీక్షల' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

విపక్షాలు సూచించిన సవరణలకు తిరస్కరణ

న్యూఢిల్లీ: పోటీ పరీక్షల్లో అక్రమాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024ను మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు సైతం బిల్లుకు మద్దతు పలికారు. ఈ బిల్లుకు మరికొందరు విపక్ష ఎంపీలు కొన్ని సవరణలు సూచించగా, ప్రభుత్వం తిరస్కరించింది. ప్రతిభ కలిగిన విద్యార్థుల, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడడానికే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో వెల్లడించారు.

త్వరలో 10 వందే భారత్ స్లీపర్ రైళ్లు

న్యూఢిల్లీ: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మాదిరిగానే వందే భారత్ స్లీపర్ రైళ్లు త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రూపుదిద్దుకున్న ఈ రైళ్ల ట్రయల్ రన్ ఏప్రిల్ నుంచి ప్రారంభం కానుంది. మొదటి దశలో 10 రైళ్లను ప్రవేశపెడతారు. ఇందులో ఏసీ, నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లుంటాయి. సుమారుగా 16 నుంచి 20 వరకు కోచ్‌లుండే ఈ రైళ్లను మొదటి దశలో ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా మార్గాల్లో నడిపేందుకు ఏర్పాట్లు శరవేగంతో జరుగుతున్నాయి. రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే ఇవి వేగంగా ప్రయాణించనున్నాయి. వీటిలో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉండటంతోపాటు, ప్రయాణ సమయం కనీసం రెండున్నర గంటలు ఆదా అవుతుందని సమాచారం.

ఢిల్లీలో లష్కరే ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా మాడ్యూల్‌కు చెందిన ఉగ్రవాది రియాజ్ అహ్మద్ రథేర్‌ను అరెస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు మంగళవారం తెలిపారు. ఇతడు గత ఏడాది జనవరిలో రిటైరైన ఆర్మీ అధికారి అని వెల్లడించారు. నియంత్రణ రేఖ వెంబడి సరిహద్దు ఆవలి నుంచి లష్కరే శ్రేణుల నుంచి ఇతడు ఆయుధాలు, మందుగుండు సామగ్రిని దొంగచాటుగా తీసుకురావడంలో ఇతడు కీలకంగా ఉన్నాడన్నారు. ఈ కుట్రలో పాలుపంచుకుంటున్న ఖుర్షీద్ అహ్మద్ రథేర్, గులాం సర్వర్ రథేర్‌తోపాటు అయిదుగురిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు.

మిస్ జపాన్ కిరీటం వదులుకున్న షినో

టోక్యో: మిస్ జపాన్ కిరీటం దక్కించుకున్న సుందరి కరోలినా షినోకు చివరికి నిరాశే మిగిలింది. ఉక్రెయిన్‌లో జన్మించిన ఈ సుందరి జపాన్‌లోనే పెరిగింది. జనవరి 22వ తేదీన నిర్వహించిన పోటీల్లో మిస్ జపాన్ కిరీటం దక్కించుకుంది. ఆమె జపనీయురాలు కాదంటూ అప్పుడే ఆమెపై విమర్శలు చెలరేగాయి. అవి సద్దుమణిగేలోగానే మరో బాంబు పేలింది. కరోలినా షినో ఓ డాక్టర్‌తో సంబంధం పెట్టుకుందని, అతడికి ఇప్పటికే పెళ్లయి పిల్లలు కూడా ఉన్నారంటూ బున్షున్ అనే మేగజీన్ కథనం ప్రచురించింది. ఈ కథనంతో షినో షాక్‌కు గురైంది. అతడికి పెళ్లయినట్లు తెలుసని, తెలీదని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేసి విమర్శల పాలైంది. చివరికి, మిస్ జపాన్ కిరీటాన్ని వదులుకుంటున్నట్లు ప్రకటించింది. కార్యక్రమం నిర్వాహకులు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. మిస్ జపాన్-2024 విజేత పోస్టు ఖాళీగానే ఉండిపోతుందని ప్రకటించారు.

ట్రంప్‌ను విచారించొచ్చు

అల్లర్ల కేసుపై అపీల్స్ ప్యానెల్ స్పష్టీకరణ

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ. 2020 అధ్యక్ష ఎన్నికలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన కేసులో విచారణ నుంచి ఆయనకు మినహాయింపు లేదని ఫెడరల్ అపీల్స్ ప్యానల్ మంగళవారం స్పష్టం చేసింది. అప్పట్లో దేశాధ్యక్షున్ని గనుక ఇలాంటి విచారణల నుంచి తనకు మినహాయింపు ఉందన్న ట్రంప్ వాదనలను న్యాయమూర్తులు తిరస్కరించడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. ఇక దీనిపై సుప్రీంకోర్టే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వచ్చే నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు పూర్తయ్యేదాకా ఈ అంశం సుప్రీం దాకా వెళ్లకుండా చూసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల్లో నెగ్గి మళ్లీ అధ్యక్షుడైతే తన ప్రత్యేకాధికారాలను ఉపయోగించి ఈ కేసులను కొట్టేయడమో, స్వీయ క్షమాభిక్ష ప్రసాదించుకోవడమో చేస్తారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తరాఖండ్ అసెంబ్లీలో యూసీసీ బిల్లు

- అతిత్వరలో చర్చ.. ఓటింగ్
- యూసీసీ బిల్లు నుంచి గిరిజనులకు మినహాయింపు

డెహ్రాడూన్: అత్యంత కీలకమైన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) విషయంలో బీజేపీ పాలిత ఉత్తరాఖండ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. యూసీసీ బిల్లును సీఎం పుష్కర్‌సింగ్ ధామీ మంగళవారం అసెంబ్లీ ప్రవేశపెట్టారు. అధికార బీజేపీ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేయగా విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఉమ్మడి పౌరస్మృతి బిల్లుపై మంగళవారమే చర్చ, ఓటింగ్ జరగాల్సి ఉండగా, విపక్షాల నిరసనల వల్ల అది సాధ్యం కాలేదు. చర్చ జరగకుండానే బిల్లును ఆమోదించుకోవడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందని ప్రతిపక్ష ఎమ్మెల్యే యశ్‌పాల్ ఆర్య మండిపడ్డారు. యూసీసీ బిల్లుపై ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఒకటి రెండు రోజుల్లో చర్చ, అనంతరం ఓటింగ్ జరిగే అవకాశం ఉంది. సభలో ప్రభుత్వానికి తగిన సంఖ్యాబలం ఉండడంతో బిల్లు ఆమోదం పొందడం, గవర్నర్ సంతకంతో చట్టంగా మారడం లాంఛనమేనని చెప్పొచ్చు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇలాంటి బిల్లును ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ చరిత్ర సృష్టించింది. ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ ఉమ్మడి పౌరస్మృతి బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు దేశంలో ప్రస్తుతం గోవాలో మాత్రమే ఉమ్మడి పౌరస్మృతి చట్టం అమలవుతోంది. అక్కడ పోర్చుగీసు పాలనా కాలంలోనే ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.



రాజ్యాంగ ప్రతితో అసెంబ్లీకి వెళ్తున్న సీఎం

ఉమ్మడి పౌరస్మృతి బిల్లులో ఏముంది?

- ఉత్తరాఖండ్‌లో నివసిస్తున్న ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న ఉత్తరాఖండ్ పౌరులకు ఈ బిల్లు వర్తిస్తుంది.
- గిరిజన వర్గాల ప్రజలను బిల్లు నుంచి మినహాయించారు.
- భారత రాజ్యాంగంలోని పార్ట్-21 కింద తమ హక్కుల రక్షణ పొందుతున్న వ్యక్తులకు, సమూహాలకు కూడా మినహాయింపు ఉంటుంది.
- సహజీవనాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.
- సహజీవనం ద్వారా జన్మించిన పిల్లలకు చట్టబద్ధంగా గుర్తింపు లభిస్తుంది.
- వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వం, దత్తత తదితర అంశాల్లో మతాలకు అతీతంగా ప్రజలందరికీ ఒకే చట్టం అమలు చేస్తారు.
- మతాలతో సంబంధం లేకుండా బహుభార్యత్వంపై నిషేధం అమలవుతుంది. ఒక్కరు ఒక్కరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకోవడానికి వీల్లేదు.
- ఎవరి మతాచారం ప్రకారం వారు వివాహం చేసుకోవచ్చు.
- సహజీవనం చేసే స్త్రీపురుషుల వయసులు వరుసగా 18, 21 ఏళ్లకు పైబడి ఉండాలి.
- సహజీవనం ప్రారంభించిన తర్వాత నెల రోజులలోపు ప్రభుత్వ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేకపోతే వారికి ఆరు నెలల దాకా జైలుశిక్ష లేదా రూ.25 వేల జరిమానా లేదా ఈ రెండు శిక్షలూ విధిస్తారు.
- సహజీవనంపై రిజిస్ట్రార్‌కు తప్పుడు సమాచారం ఇస్తే భారీగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.
- సహజీవనం సాగిస్తున్న మహిళను పురుషుడు వదిలేస్తే బాధితురాలు కోర్టును ఆశ్రయించవచ్చు. అతడి నుంచి జీవనభృతి పొందవచ్చు.
- పెళ్లి కాని జంటల మధ్య సహజీవనాన్ని అరికట్టేలా బిల్లులో పలు కీలకాంశాలు జోడించారు.

సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్

శివాజీనగర: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు హైకోర్టులో చుక్కెదురైంది. ధర్నా, రాస్తారోకోలో పాల్గొని ప్రజలకు ఇబ్బంది కలిగించిన కేసును రద్దు చేయాలని కోరుతూ ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో సిద్ధరామయ్య, కాంగ్రెస్ నేతలు రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఎంబీ పాటిల్, ఎమ్మెల్యే రామలింగారెడ్డి తదితరులు 2022 ఏప్రిల్ 14న కాంట్రాక్టర్ సంతోష్ ఆత్మహత్యను ఖండిస్తూ బెంగళూరులోని సీఎం బస్వరాజ్ బొమ్మై నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ధర్నాతో ప్రజలకు ఇబ్బంది కలిగించారంటూ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయాలని ఇటీవల సిద్ధరామయ్య హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును మంగళవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్.దీక్షిత్.. ప్రజాప్రతినిధులు నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్ఐని వ్యక్తిగతంగా ప్రతివాదిగా చేర్చినందుకు సిద్ధరామయ్యతోపాటు మిగతా వారికి రూ. 10 వేలు జరిమానా విధిస్తూ అర్జీని కొట్టివేశారు.

సీజన్ వర్షపాతమంతా రెండ్రోజుల్లోనే

లాస్‌ఏంజెలెస్‌లో కుంభవృష్టి • కాలిఫోర్నియాకు కొండచరియల ముప్పు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలో తుపానులు మోసుకొచ్చిన కుండపోత వర్షాలతో కాలిఫోర్నియా దక్షిణ ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షకాల సీజన్ మొత్తం కురవాల్సిన వర్షపాతం కేవలం రెండ్రోజుల్లోనే పడి లాస్‌ఏంజెలెస్‌ను పూర్తిగా ముంచెత్తింది. దీంతో కొండచరియలు విరిగి పడే ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు దాదాపు 3 సెంటీమీటర్ల మేర వర్షం పడే అవకాశం ఉందని పేర్కొంది. తుపానుకు కాలిఫోర్నియాలో ముగ్గురు బలయ్యారు. ఎడతెగని వానలు లాస్‌ఏంజెలెస్‌నూ ముంచెత్తాయి. ఇక్కడ వార్షిక సగటు వర్షపాతం 36 సెంటీమీటర్లయితే ఒక్క సోమవారమే 18 సెంటీమీటర్ల మేర కురిసింది. మంచు, హిమపాతం నేపథ్యంలో కాలిఫోర్నియాలోని 8 కౌంటీల్లో ఎమర్జెన్సీ విధించారు.

అజిత్ వర్గమే అసలు ఎన్సీపీ

పార్టీ, గుర్తు వారికే: ఈసీ

- శరద్ పవార్ వర్గానికి గట్టి షాక్
- సుప్రీంకోర్టుకు వెళ్తామని వెల్లడి



శరద్ పవార్



అజిత్ పవార్

న్యూఢిల్లీ: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడు శరద్‌పవార్‌కు పెద్ద షాక్ తగిలింది. ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ నేతృత్వంలోని చీలిక వర్గమే అసలైన ఎన్సీపీ అని ఎన్నికల సంఘం తేల్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్సీపీ ఎన్నికల గుర్తు 'గోడ గడియారం'ను అజిత్ వర్గానికే కేటాయించింది. ఎన్సీపీ ఎమ్మెల్యేల్లో మెజార్టీ సభ్యులు అజిత్ వర్గంలోనే ఉన్నారని ఈసీ గుర్తు చేసింది. త్వరలో రాజ్యసభ ఎన్నికలున్నందున తమ పార్టీకి వెంటనే మరో పేరు పెట్టుకునేందుకు శరద్ పవార్ వర్గానికి అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొంది. అందుకు బుధవారం మధ్యాహ్నంలోగా మూడు పేర్లు ప్రతిపాదించాలని సూచించింది. అజిత్ 2023 జూలైలో మెజారిటీ ఎమ్మెల్యేలతో కలిసి వేరుకుంపటి పెట్టుకోవడం, మహారాష్ట్రలో బీజేపీ-శివసేన ప్రభుత్వంలో భాగస్వామిగా చేరడం తెలిసిందే. ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. అనంతరం తమనే అసలు ఎన్సీపీగా గుర్తించాలంటూ రెండు వర్గాలూ ఈసీని ఆశ్రయించాయి.

కోర్టుకెళ్లినా ఇబ్బంది లేదు: అజిత్

ఈసీ తాజా నిర్ణయంపై అజిత్ హర్షం వెలిబుచ్చగా శరద్ పవార్ వర్గం భగ్గుమంది. ఉన్నత స్థాయి ఒత్తిడితో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఉందని ఆరోపించింది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారంటూ ఎన్సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్ మండిపడ్డారు. ఈసీ నిర్ణయాన్ని రెండు రోజుల్లోగా సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని శరద్ పవార్ కూతురు సుప్రియా సులే ప్రకటించారు. ఈసీ నిర్ణయం అనంతరం అజిత్ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీయే ముఖ్యమని, అది తమకే ఉందని చెప్పుకొచ్చారు. ''50 మంది ఎమ్మెల్యేలతో ఎన్సీపీ శ్రేణుల్లోనూ అత్యధికులు మావైపే ఉన్నారు. రాష్ట్రంలో దాదాపుగా అన్ని జిల్లాల అధ్యక్షులతో పాటు పార్టీకి చెందిన పలు విభాగాల అధ్యక్షులు మాకే మద్దతిస్తున్నారు'' అని చెప్పారు. శరద్ పవార్ వర్గం కోర్టుకు వెళ్లినా తమకు ఇబ్బందేమీ లేదన్నారు. ఈ అంశంలో అర్హత, మెజారిటీ ఆధారంగానే ఈసీ నిర్ణయం తీసుకుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అభిప్రాయపడ్డారు. దాదాపు రెండేళ్ల క్రితం షిండే కూడా ఉద్ధవ్ ఠాక్రేతో విభేదించడం, శివసేనను చీల్చి బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి సీఎం కావడం తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ ఉద్ధవ్ కోర్టుకు వెళ్లినా లాభం లేకపోయింది. షిండే వర్గాన్నే అసలు సేనగా ఈసీ గుర్తించి ఉద్ధవ్ వర్గానికి షాకిచ్చింది.

బాణసంచా యూనిట్‌లో పేలుడు..

11 మంది దుర్మరణం

- మరో 174 మందికి గాయాలు
- మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని హర్దాలో బాణసంచా కర్మాగారంలో భీకర పేలుడు సంభవించింది. ఘటనలో 11 మంది చనిపోగా 174 మందికి గాయాలపాలయ్యారు. మంగళవారం ఉదయం బైరాగఢ్‌లోని ఫ్యాక్టరీలో శక్తివంతమైన పేలుడు సంభవించింది. దాంతో మంటలు చెలరేగి ఫ్యాక్టరీ చుట్టుపక్కలున్న 50కి పైగా ఇళ్లు సైతం కాలిబూడిదయ్యాయి. ఫ్యాక్టరీలో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన గన్‌పౌడర్ వల్లే పేలుడు సంభవించిందని చెబుతున్నారు. చెల్లాచెదురుగా దూరంగా పడిన మృతదేహాలు, కాలిబూడిదైన, ధ్వంసమైన ఇళ్లు, ఇతర సామగ్రి, దట్టంగా వ్యాపించిన పొగతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది. పేలుళ్ల శబ్దాలు 20 కిలోమీటర్ల దూరం వరకు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాణసంచా ఫ్యాక్టరీ భవనం ఆసాంతం శిథిలాల కుప్పలా మారిపోయిందని ఆయన వ్యాఖ్యానించడాన్ని చూస్తే ప్రమాద తీవ్రత అర్థమవుతుంది. మృతుల్లో కొందరు బాలలు సైతం ఉన్నట్లు చెబుతున్నారు. శిథిలాల్లో మృతదేహాల భాగాలను కొందరు ఏరుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన కొన్ని వీడియోల్లో ఉన్నాయి. ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కుక్క బిస్కెట్.. ఒక వివాదం

- కార్యకర్తకు రాహుల్ కుక్క బిస్కెట్లిస్తున్న వీడియో వైరల్
- తినకపోవడంతో యజమానితో ఇప్పించానని రాహుల్ వివరణ

గుమ్లా(జార్ఖండ్): భారత్ జోడో న్యాయ్‌యాత్ర సందర్భంగా ఒక కాంగ్రెస్ కార్యకర్త పెంపుడు శునకానికి రాహుల్‌గాంధీ బిస్కెట్లు తినిపించేందుకు ప్రయత్నించిన వీడియో వైరల్‌గా మారింది. కుక్క కూడా తినని బిస్కెట్లను కాంగ్రెస్ కార్యకర్తలకు సపంచుతున్నారంటూ బీజేపీ నేత అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. దీనిపై అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ''రాహుల్, ఆయన కుటుంబమంతా నాతో ఇలాంటి బిస్కెట్లు తినిపించేందుకు విఫయత్నం చేశారు. వాటిని తిరస్కరించి కాంగ్రెస్‌కూ రాజీనామా చేశా'' అంటూ ట్వీట్‌చేశారు. దీంతో రాహుల్ వివరణ ఇచ్చారు. ''వందల మంది జనంలో బిత్తరపోయిన ఆ పెంపుడు కుక్క నేనిచ్చిన బిస్కెట్లు తినడానికి భయపడింది. అందుకే పక్కనే ఉన్న దాని యజమానికి ఇచ్చి తినిపించమని చెప్పాను. ఆయన పెడితే తినేసింది. ఇందులో వివాదమేముంది?'' అంటూ స్పష్టతనిచ్చారు. బీజేపీవి చౌకబారు విమర్శలంటూ కాంగ్రెస్ మండిపడింది. మరోవైపు భారత్ జోడో న్యాయ్‌యాత్ర మంగళవారం జార్ఖండ్‌లో ముగిసి ఒడిశాలో అడుగుపెట్టింది. అభివృద్ధి పేరిట గిరిజనుల భూములను మోదీ సర్కార్ లాక్కొని కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోలకు ధారాదత్తం చేస్తోందని రాహుల్ ఈ సందర్భంగా ఆరోపించారు.

మంత్రిగానేకాదు ఎంపీగానూ పనికిరావు

మురుగన్‌పై డీఎంకే నేత బాలు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: తమిళనాడుకు కేంద్ర నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపుతున్నారంటూ బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి మురుగన్‌పై డీఎంకే నేత టీఆర్ బాలు చేసిన విమర్శలు మంగళవారం లోక్‌సభలో వివాదానికి దారితీశాయి. ఆయన క్షమాపణలు చెప్పాలన్న బీజేపీ ఎంపీల డిమాండ్లతో సభ వేడెక్కింది. ప్రశ్నోత్తరాల సమయం ఇందుకు వేదికైంది. తుపాను హెచ్చరికలపై తమిళనాడును కేంద్రం అప్రమత్తం చేయలేదని బాలు అనడంతో తమిళనాడుకే చెందిన మురుగన్ వారించారు. ఆగ్రహించిన బాలు, ''మధ్యలో జోక్యం చేసుకోకు. నువ్వు ఎంపీ పదవికి సరితూగవు. మంత్రి పదవికి అస్సలు పనికిరావు. కూర్చో'' అన్నారు. దాంతో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, అర్జున్ మేఘ్వాల్ తప్పుబట్టారు. వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవడంతో పాటు బాలుకు మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మంత్రినే స్థాయిలేని వాడనడం ద్వారా మొత్తం ఎస్సీ సామాజిక వర్గాన్నే అవమానించారన్నారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటామాటా పెరిగింది. చివరికి బాలు వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు.

ప్రొస్టేట్ కేన్సర్ కాదు

చార్లెస్ అనారోగ్యంపై ప్యాలెస్ వివరణ



లండన్: బ్రిటన్ రాజు చార్లెస్-3 (75) అనారోగ్యంపై బకింగ్‌హామ్ ప్యాలెస్ స్పష్టతనిచ్చింది. ఇటీవల ఆయన ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్‌కు చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యాధి చికిత్స సమయంలో చేసిన ఇతర పరీక్షలతో కాన్సర్ వంటి లక్షణాలు బయట పడినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ తెలిపింది. అవి ప్రొస్టేట్‌కు సంబంధించినవి మాత్రం కాదని సోమవారం సాయంత్రం స్పష్టం చేసింది. అయితే, అది ఏ రకమైన కేన్సర్ అనే విషయం వెల్లడించలేదు. రాజుకు కేన్సర్ చికిత్స మొదలైందని కూడా తెలిపింది. ఎన్నో కేన్సర్ చారిటీలకు నేతృత్వం వహిస్తున్న ఆయన..తనకు కేన్సర్ సోకిన విషయాన్ని బహిరంగపరచాలని భావించారని తెలిపింది. చికిత్స కొనసాగుతున్న సమయంలో అధికార పత్రాల పరిశీలన, ఆమోదం వంటి విధులను స్వయంగా ఆయనే చూసుకుంటారని, మిగతా బాధ్యతలను రాణి కెమిల్లా, ప్రిన్స్ విలియమ్ పంచుకుంటారని పేర్కొంది. రాజు చార్లెస్-3 ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ చికిత్స అనంతరం గత సోమవారం ఆయన డిశ్చార్జి అయ్యారు. ఆదివారం రాణి కెమిల్లాతో కలిసి శాండ్రింగ్‌హామ్ చర్చికి వెళ్తూ చివరి సారిగా బహిరంగంగా కనిపించారు. కేన్సర్ విషయాన్ని రాజు చార్లెస్ తన తోబుట్టువులు, పిల్లలకు స్వయంగా తెలిపినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ వర్గాలు తెలిపాయి.



స్ట్రాంగ్ రూంల ఏర్పాటుకు చర్యలు

ఇబ్రహీంపట్నం: జూపూడిలోని నిమ్రా, నోవా ఇంజినీరింగ్ కళాశాలలను మంగళవారం కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్ పరిశీలించారు. ఇక్క డ స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు.



వైద్య సేవలపై సంతృప్తి

పెనమలూరు: వణుకూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ప్రపంచ బ్యాంకు బృందం సందర్శించింది. అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది.

సివిల్ సప్లయిస్ కృష్ణా జిల్లా మేనేజర్‌గా సతీష్



చిలకలపూడి: కృష్ణాజిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌గా టి.వెంకటసతీష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

న్యూస్‌రీల్

12న అప్రెంటిస్ మేళా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 12వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా కంపెనీల్లో అప్రెంటిస్ పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో చదువుకున్న అన్ని ట్రేడ్‌లకు చెందిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని వివరించారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటుగా ఒక సెట్ జిరాక్స్ పత్రాలు, పాస్‌పోర్ట్ ఫొటోతో విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగే అప్రెంటిస్ మేళాకు హాజరు కావాల్సిందిగా సూచించారు. ఇతర వివరాలకు 0866-2475575, 99480 29903, 83094 42698, 77804 29468 సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

నిత్యాన్నదానానికి రూ. 2.50 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నంకు చెందిన భక్తులు మంగళవారం రూ. 2.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. విశాఖపట్నం బుచ్చిరాజుపాలెంకు చెందిన బండి కిశోర్‌కుమార్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 2.50 లక్షల విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

సుబ్బారాయుడి సన్నిధిలో..

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వీరుభొట్ల సుధాకర్ జ్ఞాపకార్థం ఆయన భార్య విశాలాక్షి మంగళవారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ ఏసీ చక్రధర్‌రావు ఆలయ మర్యాదలతో దాతను సత్కరించారు.

నులిపురుగులను నివారిద్దాం



వైద్యాధికారి డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ నెల 9న ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అన్ని అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మాత్రలు అందిస్తామని ఆమె పేర్కొన్నారు. కాగా తొమ్మిదో తేదీన డీవార్మింగ్ చేయని చిన్నారులకు 16న ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు సమావేశం..

బుధవారం గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని మండల అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో, విజయవాడలోని మూడు జోనల్ కమిషనర్‌ల ఆధ్వర్యంలో, మునిసిపాలిటీల్లో కమిషనర్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పాఠశాలలు, అంగన్‌వాడీలకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆయా ప్రాంతాల్లోని విద్యాశాఖాధికారులు, వైద్యాధికారుల సమన్వయంతో సంబంధిత పాఠశాలలు, కళాశాలలకు మాత్రలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ ఉప ముఖ్య నిర్వహణాధికారిగా ఆర్‌సీ ఆనంద కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో డెప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న జి. శ్రీనివాసరావు నెల్లూరు జిల్లా డ్వామా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా హౌసింగ్ పీడీగా పనిచేస్తున్న ఆర్‌సీ ఆనందకుమార్‌ను నియమించారు. దీంతో ఆయన మంగళవారం కలెక్టర్ పి. రాజాబాబును జెడ్పీ సీఈవో వి. జ్యోతి బసుతో పాటు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం డెప్యూటీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

మామయ్య ప్రేమ.. గోరుముద్దగా..

విద్యార్థులకు పౌష్టిక విందు.. భలే పసందు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- జగనన్న గోరుముద్ద కింద రోజుకో రకం వంటకం
- వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, మూడు రోజులు రాగి జావ
- రోజూ 85వేల మందికి పైగా మెనూ ప్రకారమే వంటలు
- సీఎం జగన్ ప్రత్యేక చొరవతో పారదర్శకంగా అమలు



విద్యార్థినులకు బిర్యానీ రైస్ వడ్డిస్తున్న ఆయాలు(ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో మార్పులు తెచ్చింది. నాణ్యతను పెంచి మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని అందించాలని జగనన్న గోరుముద్ద పథకాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు డ్రాపవుట్లు (బడి మానేయడం) నివారణకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. అయితే దీనిపై గత టీడీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడటం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ పథకం సరిగ్గా అమలుకు నోచుకోలేదు. తగినంత పెట్టేవారు కాదు. నాసిరకంగా వంటకాలు పెట్టడంతో విద్యార్థులు సరిగా తినేవారు కాదు. పేద విద్యార్థుల ఆకలి కష్టాలను గమనించిన సీఎం జగన్ వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు తెచ్చారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంతో నూతన మెనూ తయారు చేసి, పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. వారానికి ఐదు కోడిగుడ్లు, మూడు రోజులు రాగి జావతో పాటు ఆకుకూరలు, వెజిటబుల్ బిర్యాని, పులిహోర వంటివి పెడుతుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరిగింది.

పారదర్శకంగా అమలు..

జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించేలా బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాతే విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా రోజూ తమ పరిధిలోని ఒక పాఠశాలను సందర్శించి, నాణ్యతను పరిశీలిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

పాఠశాల స్థాయి	పాఠశాలలు	హాజరవుతున్న విద్యార్థులు	భోజనం చేస్తున్న విద్యార్థులు
ప్రాథమిక	620	32,480	30,473
ప్రాథమికోన్నత	134	11,006	9,838
ఉన్నత (హైస్కూల్స్)	163	54,974	45,365
మొత్తం	916	98,460	85,676

జగనన్న గోరుముద్ద మెనూ..

- సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ
- మంగళవారం: పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ
- బుధవారం: వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- గురువారం: నిమ్మకాయ పులిహోర, టమాటా చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
- శనివారం: ఆకుకూర అన్నం, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, తీపి పొంగలి, రాగి జావ



రాజుపేట వడ్డి రంగారావు మునిసిపల్ యూపీ స్కూల్‌లో..

ఇంటి కంటే బాగుంటోంది..



నేను రోజు స్కూల్‌లోనే మధ్యాహ్న భోజనం చేస్తాను. గతంలో రుచి బాగుండేది కాదు. జగన్ మామయ్య వచ్చాక మంచి భోజనం పెడుతున్నారు. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, రోజుకో వెరైటీ కూరలు పెడుతున్నారు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే బడిలోనే రుచిగా ఉంటోంది.

– నక్షత్ర, 7వ తరగతి, రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్, మచిలీపట్నం

తిన్నంత పెడుతున్నారు..



మా స్కూల్‌లో మంచి భోజనం పెడుతుండటంతో మధ్యాహ్నం అన్నం ఇక్కడే తింటున్నాను. రోజూ అన్నం, గుడ్డు, చిక్కీ, ఆకు కూరలు తిన్నంత పెడుతున్నారు. రాగీ జావ చాలా బాగుంటుంది. మాకు గోరుముద్దలు అందిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– కనకమహాలక్ష్మి, 8వ తరగతి, రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్, మచిలీపట్నం

విద్యార్థుల సంఖ్య పెరిగింది..



జగనన్న గోరుముద్ద పథకం అమల్లోకి వచ్చాక భోజనం మెనూలో మార్పులు వచ్చాయి. రుచికర, నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో స్కూళ్లలో తినే వారి సంఖ్య పెరిగింది. ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో నాణ్యతలో రాజీ పడకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. హెచ్ఎంల ఇండెంట్ ప్రకారం సరఫరా చేస్తున్నాం.

– మనోహర్ నాయక్, ఏడీ, మధ్యాహ్న భోజన పథకం

మాదకద్రవ్య రహిత రాష్ట్రమే లక్ష్యం

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నానికి పూలమొక్క అందజేస్తున్న కృష్ణా జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య

గుడివాడరూరల్: మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే నాని స్వగృహంలో జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య మంగళవారం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిని ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఎమ్మెల్యే నానికి పూలమొక్కను ఆవులయ్య అందజేశారు. కొద్దిసేపు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్‌తో ముచ్చటించారు.

రైలు చైన్ లాగడంపై ప్రత్యేక డ్రైవ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా అలారం చైన్ పుల్లింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అందులో భాగంగా గత జనవరి నెలలో డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరైన కారణం లేకుండా అలారం చైన్‌ను లాగిన 112 మందిని ఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటువంటి ఘటనను రైల్వేశాఖ క్రిమినల్‌గా కేసుగా పరిగణించి రైల్వే చట్టం 1989 సెక్షన్ 141 ప్రకారం ఒక ఏడాది జైలు శిక్ష, లేదా రూ.1,000 జరిమానా లేదా రెండు శిక్షలు విధిస్తారని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డివిజన్‌లో ఇదే తరహా తనిఖీల్లో 1,097 మందిని అరెస్టు చేసి రూ. 6.39 లక్షల పెనాల్టీ వసూలు చేసినట్లు చెప్పారు. ఈ కేసుల్లో ఎక్కువగా యువతే ఉంటున్నారన్నారు. అలారం చైన్ పుల్లింగ్‌పై ప్రయాణికులు పూర్తి అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచించారు.

విద్యాభివృద్ధి చర్యలు భేష్

ఐబీ కరిక్యులమ్ బృంద ప్రతినిధి ఆల్డో ప్రశంస

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేస్తున్న అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడం, విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, దుస్తులు, బూట్లు సైతం ఇవ్వడం.. నాణ్యమైన విద్యను, నాణ్యమైన ఆహారాన్ని అందించడం చాలా గొప్ప విషయమని ఐబీ(ఇంటర్నేషనల్ బక్కలారియెట్)కరిక్యులమ్–మెక్సికో ప్రతినిధి ఆల్డో ప్రశంసించారు. ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాశాఖలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పథకాలను పరిశీలించేందుకు సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించింది. క్లాస్ రూమ్‌లకు వెళ్లి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. వారిని పలు ప్రశ్నలు అడిగి వారి స్కిల్ డెవలప్‌మెంట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి బెంచ్‌లపై కూర్చొని బోధన తీరును తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని రుచి చూశారు. ముందుగా ఎన్‌సీసీ కేడర్స్ వారికి గౌరవ వందనం చేసి స్వాగతం పలికారు. ఎస్‌సీఈఆర్టీ ప్రొఫెసర్ డాక్టర్ వై.గిరిబాబు, డీసీఈబీ సెక్రటరీ ఉమర్‌అలీ, పాఠశాల హెచ్‌ఎంలు పరసా వెంకటేశ్వరరావు, ఇమామ్‌బాషా, స్కూల్ సూపర్‌వైజర్ బి.రాజేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి బెంచ్‌పై కూర్చొని పాఠాలు వింటున్న ఐబీ ప్రతినిధి ఆల్డో

పునాదిపాడు, ఈడుపుగల్లు పాఠశాలల సందర్శన

కంకిపాడు: అంతర్జాతీయ బక్కలారియెట్(ఐబీ) బృంద సభ్యుడు ఆల్డో కంకిపాడు మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం సందర్శించారు. పర్యటనలో భాగంగా పునాదిపాడు, ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం సమకూర్చిన వసతులు, అమలు చేస్తున్న విద్యా విధానాన్ని, బోధనా పద్ధతులను నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానం ద్వారా విద్యారంగంలో వచ్చిన మార్పులు, విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని డీఈఓ తాహెరా సుల్తానా ఐబీ బృంద సభ్యుడు ఆల్డోకు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధి వై.గిరిబాబు, డీసీఈబీ జిల్లా కార్యదర్శి ఉమర్ ఆలీ, మండల విద్యాశాఖాధికారి కేఎస్‌వీ ప్రసాద్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి బెంచ్‌పై కూర్చొని పాఠాలు వింటున్న ఐబీ ప్రతినిధి ఆల్డో

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

డీఈఓ తాహెరా సుల్తానా



సమావేశంలో సూచనలు ఇస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా

ఉయ్యూరు: నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా పనిచేయాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. పట్టణంలోని ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పాఠశాలల వారీగా సమీక్ష చేశారు. గతేడాది ఫలితాలు కంటే ఈ ఏడాది ఫలితాలు మెరుగుపడాలని, నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని స్పష్టం చేశారు. ఎఫ్ఏ 1, ఎఫ్ఏ 2, ఎఫ్ఏ 3, ఎస్ఏ 1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ప్రగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 50 శాతం ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలలను గుర్తించి ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. డీఈఓ మాట్లాడుతూ గతేడాది తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను ఎంఈఓలు, డీవైఈఓలు తరచూ సందర్శించి విద్యార్థుల ఉన్నతికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. విద్యాభివృద్ధికి ప్రభు త్వం చేస్తున్న కృషిని గుర్తెరిగి బాధ్యతను విస్మరించకుండా ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీవైఈఓ ఐ.పద్మారాణి, జిల్లా సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్ అహ్మద్, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, పెద పారుపూడి, పామర్రు మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రూ.1.93 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులు

నందిగామ టౌన్: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ఆయా గ్రామాలలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.93 కోట్లతో చేపడుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు సోమవారం రాత్రి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చందర్లపాడు మండలంలోని మునగాలపల్లి గ్రామంలో రూ.92.70 లక్షలు, ముప్పాళ్ల గ్రామంలో రూ.61.20 లక్షలు, నందిగామ మండలంలోని అంబారుపేట గ్రామంలో రూ.39.43 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వైద్యులు.. కొంగొత్త ఆశలు

- అట్టహాసంగా వైఎస్సార్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవం
- 60 మందికి మెడల్స్ అందజేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డాక్టర్ కారుమూడి ప్రత్యూషకు నాలుగు గోల్డ్‌మెడల్స్, రెండు బహుమతులు



గవర్నర్ చేతుల మీదుగా పట్టా స్వీకరిస్తున్న డాక్టర్ కారుమూడి ప్రత్యూష

లబ్బీపేట(విజయవాడతూర్పు): కలలు కన్నారు.. సాకారం చేసుకున్నారు.. వైద్య విద్యపై అమితమైన ప్రేమతో ఇష్టంగా చదివారు.. అత్యుత్తమ ప్రతిభకనబరచి సత్తా చాటారు. సగర్వంగా 'పట్టా' అనేకమందికి ఆదర్శంగా నిలిచారు. కన్న తల్లిదండ్రుల కళ్లల్లో అవధుల్లేని ఆనందాన్ని నింపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం 26వ స్నాతకోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. విజయవాడలోని వెన్యూ కల్యాణ మండపంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పతకాలు, బహుమతులను యూనివర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్ అందజేశారు. మెడిసిన్, దంత వైద్యం, ఆయుష్ విభాగాలకు చెందిన 60 మందికి 76 మెడల్స్, 24 బహుమతులను ప్రదానం చేశారు. దీంతో కల్యాణ మండప ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. పట్టాలు పొందిన విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులతో కలిసి సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ డైరెక్టర్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిమ మూర్తి, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె. బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికారెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆయుర్వేదాన్ని చేరువ చేస్తా..



మాది విజయవాడ. చిన్నప్పటి నుంచి ఆయుర్వేద వైద్యం అంటే ఎంతో ఆసక్తి. దీంతో ఎంబీబీఎస్‌లో సీటు వచ్చినా, బెంగళూరులో బీఏఎంఎస్ పూర్తిచేశా. అనంతరం విజయవాడలోని నోరి రామశాస్త్రి ఆయుర్వేద కళాశాలలో ఎండీ కాయచికిత్స చేశా. అక్కడ చూపిన ప్రతిభతో రెండు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. భారతీయ వైద్యమైన ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తా.

– డాక్టర్ దందు ఉమావల్లి, విజయవాడ

సంతోషంగా ఉంది..



ఈ రోజు జీవితంలో మరిచిపోలేని రోజు. యూనివర్సిటీ స్నాతకోత్సవంలో నాలుగు గోల్డ్ మెడల్స్, రెండు బహుమతులను అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబ సభ్యులు కూడా చాలా హ్యాపీగా ఉన్నారు. ప్రస్తుతం జనరల్ మెడిసిన్‌లో పీజీ చేస్తున్నా. భవిష్యత్తులో రుమటాలజీ కానీ, న్యూరాలజీలో సూపర్‌స్పెషాలిటీ చేస్తా.

– కారుమూడి ప్రత్యూష, ఇబ్రహీంపట్నం

మరుపురాని రోజు..



రెండు బంగారు, ఒక వెండి పతకాలు, రెండు బహుమతులు అందుకున్నా. ఆంధ్రా వైద్య కళాశాలలో ఎంఎస్ ఆప్తమాలజీలో చూపిన ప్రతిభకు మెడల్స్ వచ్చాయి. ప్రస్తుతం రెటీనా వైద్యంలో ఫెలోషిప్ చేస్తున్నా. రానున్న రోజుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తా.

– డాక్టర్ మరిడి అపర్ణ, కాకినాడ

ఆనందంగా ఉంది..



కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ప్రస్తుతం అదే కళాశాలలో ఎండీ డెర్మటాలజీ చదువుతున్నా. యూజీలో చూపిన ప్రతిభకు నాలుగు గోల్డ్ మెడల్స్ రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పతకాలు సాధించడంతో తల్లిదండ్రుల కృషి, టీచింగ్ వైద్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

– సాదు పూజిత, కర్నూలు

క్లుప్తంగా

30 మంది ఎస్‌ఐల బదిలీ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో 30 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న పి.అర్జమ్మ హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ2, ఎస్.కన కదుర్గ గన్నవరం (యూపీఎస్) ఎస్‌ఐ, టి.శ్రీనివాస్ కూచిపూడి ఎస్‌ఐ, ఎండీ మక్బూల్ ఇనగుదురుపేట ఎస్‌ఐ2, కె.రాంబాబు గుడివాడ-2 టౌన్ ఎస్‌ఐ2, ఎం.వెంకటరమణరెడ్డి ఉయ్యూరు ఎస్‌ఐ2, ఎస్.శ్రీనివాసులు ఆర్‌పేట ఎస్‌ఐ2, ఎ.గరగరావు గుడివాడ ట్రాఫిక్ ఎస్‌ఐ, ఎ.సీహెచ్.శేఖర్ బందరు ట్రాఫిక్ ఎస్‌ఐ, ఎస్.హరిబాబు బందరు ట్రాఫిక్ ఎస్‌ఐ2, సత్యాల సత్యనారాయణ పెడన ఎస్‌ఐ2, జి.కేశవరావు గన్నవరం ట్రాఫిక్ ఎస్‌ఐ, పి.శ్రీనివాసరావు దిశ పీఎస్ ఎస్‌ఐ, ఎ.ఎస్.ఆర్.సీహెచ్.మూర్తి దిశ పీఎస్ ఎస్‌ఐ, ఎ.శివాజీ దిశ పీఎస్ ఎస్‌ఐ, పదాల శ్రీనివాసరావు గన్నవరం ట్రాఫిక్ ఎస్‌ఐ2, వాల్లు సత్యనారాయణ డీఎస్‌బీ ఎస్‌ఐ, ఎండీ గౌస్ మొహిద్దీన్ సీసీఎస్ గుడివాడ ఎస్‌ఐ3, జి.అజయ్‌కుమార్ డీటీసీ కృష్ణా ఎస్‌ఐ3, వి.శ్రీనివాసరావు సీసీఎస్, బందరు ఎస్‌ఐ, టి.రాంబాబు సీసీఎస్, బందరు ఎస్‌ఐ, ఎస్.నాగేశ్వరరావు డీఎస్‌బీ ఎస్‌ఐ, ఆర్.వి.ఎన్.మూర్తి డీఎస్‌బీ కృష్ణా ఎస్‌ఐ, సీహెచ్.కుమార్ సీసీఎస్, గుడివాడ ఎస్‌ఐ, వి.సూర్యప్రసాద్ డీఎస్‌బీ కృష్ణా ఎస్‌ఐ, కె.వెంకటేశ్వరరావు సీసీఎస్, బందరు ఎస్‌ఐ, ఐ.వీరరాజు గూడూరు ఎస్‌ఐ, ఎస్.చంటిబాబు నందివాడ ఎస్‌ఐ, ఘంటసాల ఎస్‌ఐ కె.శ్రీనివాసు పమిడిముక్కల, కూచిపూడి ఎస్‌ఐ డి.సందీప్ కంకిపాడు ఎస్‌ఐగా బదిలీ అయ్యారు.

వివాహిత బలవన్మరణం



పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ టి.వి.వి.రామారావు కథనం మేరకు.. పెనమలూరు గ్రామానికి చెందిన ఎ.అవినాష్‌కు 11 సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన దీప్తి(31)తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. సంక్రాంతి పండుగ నుంచి దీప్తి పుట్టింట్లోనే ఉంటోంది. సోమవారం రాత్రి తన ఇద్దరు పిల్లలతో ఇంటిపై అంతస్తులో ఆమె నిద్రపోయింది. అర్ధరాత్రి దాటిన తరువాత పిల్లలు నిద్రలేచి చూడగా తల్లి కనిపించలేదు. దీంతో కింది పోర్షన్‌లో ఉన్న తాత భాస్కరరావు వద్దకు వెళ్లి చెప్పారు. భాస్కరరావు వెంటనే పై అంతస్తుకు వచ్చి చూడగా మరో గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు దీప్తి ఉరివేసుకుని కనిపించింది. అనారోగ్య కారణాలతోనే దీప్తి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదలకు అండగా నిలిచిన ఏకైక సీఎం జగనన్న

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్ తదితరులు

పెనమలూరు: భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసి, మహిళలకు పెద్దపీట వేసి చరిత్ర సృష్టించారని గృహ నిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. కానూరులో మంగళవారం నాల్గో విడత వైఎస్సార్ ఆసరా సాయం చెక్కును అక్కచెల్లెమ్మలకు పంపిణీ చేసి ప్రసంగించారు. దేశంలో 28 రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ఉంటే జగనన్న ఒక్కరే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు అమ్మ ఒడి, ఆసరా, ఇంటికే రేషన్, ఆరోగ్య శ్రీ, ఇళ్ల స్థలాలు వంటి సంక్షేమ పథకాలు అమలుచేసి చరిత్రకెక్కారని కొనియాడారు. కరోనా వంటి విపత్తు సమయంలోనూ సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతి మహిళా బాధ్యతతో తమ కుటుంబాన్ని అభివృద్ధి చేసుకునేలా ముందడుగు వేయాలని, ఇందుకు జగనన్న అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

తోడు దొంగలు వస్తున్నారు జాగ్రత్త

రాష్ట్రంలో తోడు దొంగలు వస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి జోగి రమేష్ హెచ్చరించారు. చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో ఏనాడైనా పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేశాడా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో కనిపించని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేడు తోడుదొంగల్లా తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. పేదలకు తోడుగా ఉన్న జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కానూరులో 3,542 మంది అక్కచెల్లెమ్మలకు రూ.13.36 కోట్ల రుణ మాఫీ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ నినావత్ చిన్ని, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మెప్మా పీడీ వెంకటనారాయణ, తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి, వైఎస్సార్ సీపీ మునిసిపల్ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, గ్రామ మాజీ సర్పంచులు దేవభక్తుని సుబ్బారావు, అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, జిల్లా సాంస్కృతిక అధ్యక్షుడు గుమ్మడి విజయ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు చాంద్‌బాషా, శివరామకృష్ణ, పఠాన్ అహ్మద్, నాయకులు దేవభక్తుని చక్రవర్తి, వేమూరి బాలకృష్ణ, తుమాటి శ్రీరాములు, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం


- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- తక్షణసాయం కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.50 వేల చొప్పున అందజేత



సోహెల్ తల్లికి ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: గుడివాడ బస్టాండ్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు యువకుల కుటుంబాలను ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పరామర్శించారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను ఎమ్మెల్యే కొడాలి నాని, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం రాత్రి పరామర్శించారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున రూ.1.50 లక్షలు అందజేశారు. తొలుత రోడ్డు ప్రమాద వివరాలను ఎమ్మెల్యే కొడాలి నానికి టూటౌన్ పోలీసులు వివరించారు. షేక్ సోహెల్ (23), హరిబ్రహ్మ సాయిహరికృష్ణ(28), బేరా హర్షవర్ధన్ (17) స్కూటీపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ మృతి చెందాని వివరించారు. అనంతరం సీఎంఓ అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటానని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో చీకటి నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తనతో పాటు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మట్టా జాన్‌విక్టర్, అలీ బేగ్, జోగా కిషోర్, తోట సాయి, ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 23వ భారత్ రంగ మహోత్సవ్ ప్రారంభం



మైరీ మోకాసే కహా హిందీ నాటకంలోని ఓ సన్నివేశం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఏపీ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆజాదీ కా అమృతోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఆరు రోజులపాటు నిర్వహించే భారతీయ రంగ మహోత్సవ్ మంగళవారం ప్రారంభమైంది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తొలిరోజు కార్యక్రమంలో ఎన్ఎస్‌డీ రిపటరీ కంపెనీ న్యూఢిల్లీ వారి మైరీ మోకాసే కహా (అమ్మా నేను ఎవరితో చెప్పుకోను) హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించి మాట్లాడుతూ.. భాషా సంస్కృతీ సంప్రదాయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ దేశంలో నాటక రంగ అభివృద్ధికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ సృజనాత్మక సమితి సీఈఓ ఆర్.మల్లికార్జునరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వివేక్ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వాహకుడు రాజేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెపై లైంగికదాడి చేసిన తండ్రికి జీవితఖైదు

ఘటన వెలుగు చూసిన 13 నెలల్లో తీర్పు ఇచ్చిన పోక్సో కోర్టు

విజయవాడస్పోర్ట్స్: కన్న కూతురిపై పాశవికంగా లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి మరణించే వరకు (జీవిత ఖైదు) కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజని మంగళవారం తీర్పు చెప్పారు. విజయవాడ గుణదలలోని గంగిరెద్దులదిబ్బలో గత ఏడాది జనవరి పదో తేదీన ఈ ఘటన వెలుగు చూసింది. భార్య, ఇద్దరు కుమార్తెలతో నిందితుడు గంగిరెద్దులదిబ్బలో నివసించేవాడు. కుమార్తెలు ఇద్దరూ ఓ హాస్టల్‌లో ఉంటూ గన్నవరంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుకునేవారు. 2023 జనవరి ఏడో తేదీ సాయంత్రం హాస్టల్ నుంచి ఇంటికి చేరుకున్న 13 ఏళ్ల కుమార్తెపై ఆమె తండ్రి లైంగిక దాడి చేశాడు. బాలిక కేకలు వేయడంతో ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ బెల్టుతో కొట్టి గాయపర్చాడు. మూడు రోజుల తరువాత బ్యాంకులో పని ఉందని బాలికను రామవరప్పాడు ఫ్లై ఓవర్ వద్ద నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి మరోసారి లైంగిక దాడిచేశాడు. అదే రోజు రాత్రి బాలిక ద్వారా ఈ విషయం తెలుసుకున్న తల్లి తన భర్తను నిలదీసింది. నిందితుడు కోపంతో కుటుంబ సభ్యులపై దాడి చేసి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. నిందితుడు ఇంట్లో లేని సమయం చూసుకుని తల్లి తన ఇద్దరు కుమార్తెలతో దిశ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. అప్పటికే మూడేళ్ల నుంచి తనపై తండ్రి లైంగికంగా దాడి చేస్తున్నాడని పోలీసుల విచారణలో బాధితురాలి తెలిపింది. దిశ ఏసీపీ వి.వి.నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి కోర్టుకు వాదనలు వినిపించారు. సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు సమక్షంలో 16 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి మరణించే వరకు జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు చెల్లించిన జరిమానా మొత్తాన్ని బాలికలకు అందజేయాలని, మరో రూ.5 లక్షలను నష్టపరిహారంగా బాలికకు అందజేయాలని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడికి మూడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు మంగళవారం తీర్పు చెప్పారు. 2018 మార్చి 13వ తేదీ రాత్రి సీతారామపురం కొత్తవంతెన సమీపంలోని ఓ బడ్డీ కొట్టును పగలగొట్టేందుకు ముగ్గురు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ విషయాన్ని వైర్ లెస్ మైక్ ద్వారా ఆ రోజు బీట్‌లో ఉన్న సత్యనారాయణపురం కానిస్టేబుల్ హోంగార్డ్‌తో కలిసి నిందితులను వెతకడం ప్రారంభించారు. బైక్‌పై పారిపోతున్న నిందితులను పోలీసులు వెంబడించారు. కొద్ది దూరం చేసుకున్న తరువాత ఎట్టకేలకు నిందితులను పట్టుకున్నారు. ఆ సమయంలో నిందితుడు సింగరాతి ఏబేలు తన వెంట తెచ్చుకున్న కత్తితో కానిస్టేబుల్‌ను పొడిచి పరారయ్యాడు. వెంబడించిన హోం గార్డ్‌ను రాయితో గాయపర్చాడు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం స్టేషన్‌లో కేసు నమోదు చేసి భానునగర్‌కు చెందిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.భాస్కరరావు కోర్టుకు వాదనలు వినిపించారు. 10 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి పై విధంగా జైలు శిక్ష విధించారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): గ్రామ/వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో ఆయన మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, పంటల ఈ-కేవైసీ, ధాన్యం సేకరణ, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కొత్తగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు బాధ్యతలు తీసుకున్నారన్నారు. జిల్లాలో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారుల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 85 వేల మంది లబ్ధిదారులకు 10,700 మందికి రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు సచివాలయాలను సందర్శించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంటల ఈ-కేవైసీ పురోగతి 60 శాతం పూర్తి చేశారని, గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో చివరి వరకు నీరు అందాల్సి ఉందన్నారు. నీటిని వృథా చేయకుండా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు లను నింపుకోవాలని సూచించారు. కాలువల్లో తూడు తొలగించటం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇందు కోసం టెండర్లు పిలిచినప్పటికీ ఎక్కడ పనులు ప్రారంభం కాలేదో వాటి వివరాలను తెలియజేయా లని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కాపు వెల్ఫేర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



చింతా శ్రీనివాస్‌కు నియామకపత్రం అందిస్తున్న చైర్మన్ అడపా శేషు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కాపు వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు చింతా శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ మేరకు కాపు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు నియామక ఉత్తర్వులను శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా చింతా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, చైర్మన్ అడపా శేషుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాపులందరిని ఏకతాటిపైకి తీసుకొస్తానని పేర్కొన్నారు. చింతా శ్రీనివాసరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్ఎస్వీ జానారెడ్డి, ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యుడు అలీమ్ తదితరులు చింతా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు



సతీష్‌ను అభినందిస్తున్న రెవెన్యూ సంఘ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ టి.వెంకటసతీష్ తెలిపారు. జిల్లా మేనేజర్‌గా ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఇప్పటి వరకు తన ముందు పనిచేసిన అధికారులు పకడ్బందీగా నిర్వహించారని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచనల మేరకు రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఏ ప్రాంతంలోనైనా కొనుగోలు ప్రక్రియలో సందేహాలు, అనుమానాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తోట సతీష్‌కు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పి.సత్యనారాయణ, వై.శివశంకర్, పామర్తి శ్రీనివాస్, అక్బర్‌ఖాన్, ఎండీ బేగ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది పాఠశాలే



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ రాజాబాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది పాఠశాలలేనని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో కీలకమన్నారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ వార్షికోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజాబాబు హాజరై ప్రసంగించారు. పచ్చని ప్రకృతి ఒడిలో నవోదయ విద్యాలయ ప్రాంగణం ఎంతో ఆహ్లాదకరంగా ఉందని, ఇలాంటి పరిసరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తప్పకుండా రాణించగలరని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభచాటిన విద్యార్థులకు, పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు కలెక్టర్ రాజాబాబు చేతుల మీదగా బహుమతులు, ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. డీఈఓ తాహెరా సుల్తానా, ఎంఈఓ శ్రీరామ్ బాలాసింగ్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

- ఈ నెల 29వ తేదీ వరకు గడువు
- ఏలూరు జోన్-2 కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రాణి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎల్ రాణి

ఏలూరు (టూటౌన్): కార్మిక శాఖ జోన్-2 ఏలూరు పరిధిలోని ఏడు జిల్లాల్లో దుకాణాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు, కార్మికులను వినియోగించే కాంట్రాక్టర్లు ఈ నెల 29వ తేదీలోగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని జోన్-2 ఏలూరు సంయుక్త కార్మిక కమిషనర్ ఎ.రాణి సూచించారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని జేసీఎల్ కార్యాలయంలో వివిధ వర్తక, వాణిజ్య యాజమాన్య సంఘాలతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జోన్-2 పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోన సీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటారు రవాణా యాజమాన్యాలు గతంలోనే ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉంటే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. గతంలో విడివిడిగా కాకుండా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ చట్టం 2015 కింద కార్మిక చట్టాలన్నింటికీ ఒకే రిజిస్ట్రేషన్/లైసెన్స్ పొందే వెసులుబాటు ఉందన్నారు. ఈ చట్టం కింద సంస్థల రిజిస్ట్రేషన్/రెన్యువల్ కోసం యజమానులు లేదా కాంట్రాక్టర్లు సమీపంలోని మీ-సేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లు, గ్రామ/వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ప్రతి వర్తక యాజమాన్య సంఘాలు దుకాణం లేదా సంస్థ యజమానులకు లైసెన్స్, రిజిస్ట్రేషన్, నవీకరణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నమోదు ప్రక్రియ వేగవంతం చేసి విజయవంతం చేయాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. డీసీఎల్ పి.శ్రీనివాస్, ఏసీఎల్‌లు జి.నాగేశ్వరరావు, టి.వి.వి.ఎ.ఎస్.మూర్తి, సహాయ కార్మిక అధికారులు జి.వెంకటరమణ, జె.గోపాలకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ ఏలూరు అధ్యక్షుడు నేరేళ్ల రాజేంద్ర, కిరాణా మర్చంట్ అసోసియేషన్ నాయకుడు బాలకృష్ణ, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి బ్రహ్మయ్య, మెటల్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుల అరెస్టు

తోట్లవల్లూరు(పామర్రు): మండలంలోని యాకమూరులో బాలికపై జరిగిన లైంగికదాడి ఘటనలో నిందితులను గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు. ప్రధాన నిందితుడు బోలెం దిలీప్‌ను ఉయ్యూరు సివిల్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించటంతో గన్నవరం సబ్‌జైలుకు తరలించామని పేర్కొన్నారు. నిందితుల్లో 17 ఏళ్ల బాలుడిని విజయవాడ మూడో అదనపు కోర్టు మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచి జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్ఐ విశ్వనాథ్ వెల్లడించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రథమ చికిత్స విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రోడ్డు భద్రత నిబంధనలు వివరిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

సిద్ధార్థ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం జరిగింది. కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తెల్సుకోవడమే కాకుండా తోటివారు వాటిని పాటించేలా చూడాలన్నారు. జనవరి 20 నుంచి ఈ నెల 19వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. రోడ్డు సేఫ్టీ ఎస్ఐ ఎస్‌కే త్రిమూర్తులు, డాక్టర్ తేజ, కళాశాల ప్రిన్సిపాల్ చుండి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ వచ్చే లోపు చేయాల్సిన ప్రథమ చికిత్సపై డాక్టర్ తేజ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులే



మొబైల్ కోర్టులో విచారణ జరుపుతున్న న్యాయమూర్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సర్కిల్–2 కార్యాలయంలో జరిగిన మొబైల్ కోర్ట్‌లో 9 కేసులు నమోదయ్యాయి. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు రోడ్లపైన చెత్త వేసినవారికి, నిబంధనలను ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం నిర్వహించే మొబైల్ కోర్ట్‌లో భాగంగా కార్పొరేషన్ కోర్ట్ న్యాయమూర్తి విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం మొబైల్ కోర్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై చెత్త వేసినందుకు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించిన వారికి సర్కిల్–2 పరిధిలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నమోదు చేసిన 9 కేసులపై విచారణ జరిపి రూ.2,680 జరిమానా విధించారు. ఒకసారి జరిమానా విధించినా రెండో సారికూడా అదే తప్పు చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని న్యాయమూర్తి హెచ్చరించారు. అంతే కాకుండా ప్రజలుకానీ వ్యాపారస్తులుకానీ మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘిస్తే మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

250 మందికి ఉచిత వైద్యసేవలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనీల్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): చుట్టుగుంటలోని అనిల్ న్యూరో అండ్ ట్రామా సెంటర్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం ప్రారంభమైంది. తొలి రోజు 250 మంది వరకూ సద్వినియోగం చేసుకున్నట్లు ఆస్పత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ డి.అనీల్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రి ఏర్పాటు చేసిన ఐదేళ్లలో ప్రజలకు మెరుగైన సేవలు అందించామన్నారు. దీనిలో భాగంగా రెండు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కలిగిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో సరైన వైద్యాన్ని అందజేస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో భవానీపురంలోని శ్రావణి హాస్పటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అనీల్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

తోపుడు బండ్ల పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రభుత్వ లబ్ధిని ప్రజలకు వివరిస్తూ వారిని పార్టీకి మరింత చేరువచేయడమే లక్ష్యంగా గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ బావ వై.సిద్ధార్థ్ అన్నారు. ఆయన మంగళవారం 19వ డివిజన్‌లోని బృందావన్ కాలనీ ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి నాలుగున్నర ఏళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా డివిజన్‌కు చెందిన నాలుగు పేద కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం రూ.85 వేలు విలువ చేసే టిఫిన్ బండి, మూడు తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ రహేన నాహిద్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సలీం, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌ను తీర్చిదిద్దుకోవాలి

ఆటోనగర్(విజయవాడతూర్పు): విద్యార్థులు ఉద్యోగాల డిమాండ్లకు అనుగుణంగా కెరీర్‌ను మలచుకోవాలని మారిస్ స్టెల్లా కాలేజీ అధ్యాపకులు తెలిపారు. మారిస్ స్టెల్లా కళాశాలలోని కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో మినట్ 2ఔ 24 ఫెస్ట్ కార్యాక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. న్యాయవాది ఐశ్వర్య మాట్లాడుతూ ప్రపంచ మార్కెట్ వాణిజ్య రంగం కేంద్రంగా భారత్ ఎదుగుతోందన్నారు.అనంతరం మిస్టర్, మిస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేఖ, మాధవీలత, మంజుల, పద్మజ, శ్వేతాప్రియ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అమ్మవారి కీర్తనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో కృష్ణాజిల్లా కవులూరుకు చెందిన సంతాన వేణుగోపాల స్వామి భజన మండలి బృందం భజన, కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కవులూరుకు చెందిన సీహెచ్ సువర్ణకుమారి సభ్యులు విఘ్నేశ్వర ప్రార్థన, అమ్మవారి కీర్తనలు, వెంకటేశ్వర స్వామి భజన ఆకట్టుకుంది. భజన అనంతరం భక్త మండలి సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

9న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని యజమాన్యాల పరిధుల్లో ఉన్న (ప్రభుత్వ, ప్రైవేట్, మున్సిపల్, ఎయిడెడ్) పాఠశాలలో ఈ నెల తొమ్మిదో తేదీన నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జరిగే నులిపురుగుల మందుల పంపిణీని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తోహేరాసుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ మందులు అందజేస్తారని పేర్కొన్నారు. పాఠశాలల యజమాన్యాలు, అధికారులు సూచించిన పిల్లలు నులిపురుగుల మందు వేసుకొనేట్లు చూడాలని కోరారు.

దాసాంజనేయుడికి సిందూర అర్చనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, సిందూర అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహనాలకు పూజలు చేయించుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

వార్డు సచివాలయం సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయం సేవలు సద్వినియోగం చేసుకోవాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో మంగళవారం వార్డు సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు, వార్డు సచివాలయ సేవలను వివరించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, నాయకులు వెంకటరెడ్డి, అంగిరేకుల విజయ్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఆరోగ్యకర సమాజానికి పునాదులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రీడలు ఆరోగ్యకర సమాజానికి పునాదులు వంటివని సిలంబం ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్, ఇండియన్ టీం కోచ్ కె.సత్యశ్రీకాంత్ అన్నారు. కృష్ణలంకలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో మంగళవారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రపంచ గుర్తింపు పొందిన ఆటల పోటీల్లో ప్రావీణ్యం పొందితే పేరు ప్రతిష్టలు, ఉన్నత పదవులు పొందవచ్చన్నారు.

స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ ఆటలు ఆడితే ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని, కాన్ఫిడెన్స్ లెవల్స్ పెరుగుతాయన్నారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ జాతీయ గోల్డ్‌మెడలిస్ట్ బి.ఖాగేశ్వరరావు, ఏజీఎం ఎం.మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్‌బాబు, అకడమిక్ డీన్ ఆర్.రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా మెహందీ పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్లో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యాన జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో భాగంగా మంగళవారం సాయంత్రం మెహందీ పోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి. 22 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. జనశిక్షణ సంస్థాన్ రిసోర్స్‌పర్సన్ ఎస్.సునీత, ఒ.భవానీదేవి పోటీల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ బహుమతిని పి.జ్యోతి, ద్వితీయ బహుమతిని బి.నందిని పొందారు. విజేతలకు జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా, డైరెక్టర్ పూర్ణిమ బహుమతులను అందజేశారు. మహిళా ఉత్సవ్‌లో భాగంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు హెయిర్ స్టైల్ పోటీలు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించండి

ఏఐఎల్ఆర్ఎస్ఏ జనరల్ సెక్రటరీ జేమ్స్



మాట్లాడుతున్న కేసీ జేమ్స్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) జనరల్ సెక్రటరీ కె.సి. జేమ్స్ డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎస్ఏ దక్షిణ మధ్య రైల్వే జోన్‌లోని విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్ డివిజన్ కమిటీల ఆధ్వర్యాన విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో 'రన్నింగ్ స్టాఫ్‌పై పనిభారం – ప్రయాణికుల భద్రతకు ముప్పు' అనే అంశంపై సెమినార్ జరిగింది. జేమ్స్ మాట్లాడుతూ సురక్షితమైన రైళ్ల నిర్వహణకు లోకో పైలట్ల పాత్ర కీలకమన్నారు. వీరు విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై పలు డివిజన్ల నేతలు సెమినార్‌లో చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తీర్మానించినట్లు తెలిపారు. ముఖ్యంగా రన్నింగ్ సిబ్బందికి 8 గంటల పని దినం, రెండు రాత్రులకు మించి నైటు డ్యూటీలు వెయ్యరాదని, సెలవులు, సిక్ లీవ్‌లు క్రమం తప్పకుండా అమలు చేయాలని, లోకోమోటివ్‌లో టాయిలెట్‌లు, టూల్స్, ఏసీ సదుపాయాలు కల్పించడానికి రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఏఐఎల్ఆర్ఎస్ఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల చంద్రన్, జోనల్ ప్రెసిడెంట్ ఎస్‌కే చౌబే, డివిజనల్ సెక్రటరీ కె.రామకృష్ణ, పలు డివిజన్ల లోకో పైలట్‌లు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణాంతకమైన గర్భాశయ క్యాన్సర్(లియోమయోసార్కోమా)కు విజయవంతంగా చికిత్స చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కల్యాణ్ పోలవరపు తెలిపారు. పొత్తికడుపు పెరగడం, ఒక నెల నుంచి నొప్పి వంటి సమస్యలతో హాస్పటల్‌కు వచ్చిన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 42 ఏళ్ల మహిళకు ఎంఆర్ఐ స్కాన్‌లో ఆమె గర్భాశయంలో కణితి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అనంతరం బయాప్సీ చేయగా లియోమయోసార్కోమాగా నిర్ధారించినట్లు తెలిపారు. ఇతర సమస్యలు ఉన్నట్లు పేర్కొన్నారు. రోగికి అధిక రక్తస్రావం అవుతుండటంతో శస్త్ర చికిత్స సమయంలో రక్తనష్టాన్ని తగ్గించడానికి యాంజియోఎంబోలైజేషన్ చేసినట్లు తెలిపారు. ఆమె శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించడం, సమగ్రమైన సంరక్షణను అందించడంతో పూర్తిగా కోలుకున్నట్లు డాక్టర్ కల్యాణ్ తెలిపారు. అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటంతో తీవ్రమైన కేసులకు విజయవంతం చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

● అభినందన



కాపు వెల్ఫేర్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన చింతా శ్రీనివాసరావును మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్ ఎస్వీ జానారెడ్డి, ఎండీ షాహీనాసుల్తానా, కో ఆప్షన్ సభ్యుడు అలీమ్, నేతలు కార్యకర్తలు, అభిమానులు తదితరులు అభినందించారు.

–అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

మానవాళిని రక్షిస్తున్న మరియమాత



దివ్య సత్ప్రసాద ఆరాధనతో పుణ్యక్షేత్ర గురువులు

గుణదల (విజయవాడ తూర్పు): తన ప్రార్థనా విజ్ఞాపనల ద్వారా మానవాళిని రక్షిస్తున్న మరియ తల్లిని లోకమాతగా కీర్తిస్తున్నారని హైదరాబాద్ పునీత యోహాను గురు విద్యాలయ రెక్టర్ ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల్లో ఏడో రోజు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల జనులకు దీవెనల మాతగా గుణదల లూర్దు మాత కొలువై నిలిచిందన్నారు. దేవుని రక్షణ ప్రణాళికలో భాగంగా మరియమాత లోక రక్షకుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి అందించిందని తెలిపారు. దేవునిపై విశ్వాసముంచి రక్షణ మార్గంలో నడుచుకోవాలని సూచించారు.

అనుదిన ప్రార్థన, బైబిల్ పఠనంతో ఆధ్యాత్మిక జీవనం గడపాలని కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ , పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ గాబ్రియేల్, ఫాదర్ చిన్నప్ప తదితరులు హాజరయ్యారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మంగళవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌కు చెందిన బూరాడ లక్ష్మి, రాంబాబు భార్యభర్తలు. అతను టైలరింగ్ చేస్తుంటాడు. రాంబాబు తన పనిపై వచ్చేసంపాదన సరిపోక, తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి రావడంతో ఈ నెల 5వ తేదీ రాత్రి నుంచి రాంబాబు కనిపించడం లేదు. సుమారు రెండు లక్షల మేర రాంబాబుకు అప్పులు ఉండటంతో ఆ రోజు రాత్రి ఇంట్లో లెటర్ రాసి పెట్టి బయటకు వెళ్లి పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు రైల్వే స్టేషన్, బస్టాండ్, బంధువులను వద్ద అడిగినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పట్టా.. పక్కా..

- నందమూరునగర్‌లో 70 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మాట నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- సంబరాలు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలు



ఎమ్మెల్యే వెలంపల్లి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజకు కృతజ్ఞతలు తెలుపుతున్న నందమూరునగర్‌వాసులు (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వారంతా సుమారు నాలుగు దశాబ్దాల నుంచి అక్కడే నివసిస్తున్న సామాన్య కుటుంబాలవారు. వీరికి ఇంటి పట్టాలు ఇప్పించే విషయంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వీరికి ఇంటిపట్టాలు ఇవ్వడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో 58వ డివిజన్ పరిధిలోని నందమూరునగర్‌వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. సింగ్‌నగర్‌పరిధిలోని నందమూరినగర్ ప్రధాన రహదారి వెంట 70 కుటుంబాలవారు ఏళ్ల తరబడి జీవిస్తున్నారు. వీరి ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో ఇవి అక్కరకు రావడం లేదు. తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ గత టీడీపీ ప్రభుత్వ హయంలో వందలసార్లు అప్పటి నాయకులకు విన్నవించినా ఒక్కరూ పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచిన డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ ఎన్నికల సమయంలో మీ అందరికి పట్టాలు ఇప్పించడానికి కృషిచేస్తానని మాట ఇచ్చారు. వీరి ఇళ్ల పట్టాల సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే అంశాన్ని వారు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. పట్టాల విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆ తర్వాత సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వచ్చిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను నందమూరినగర్ ప్రాంత ప్రజలు తమ సమస్యను డెప్యూటీ మేయర్‌తో కలిసి వివరించారు. ఈ డెబ్బై కుటుంబాల ఇంటి పట్టాల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు నేరుగా తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. దీంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దశాబ్దాల స్వప్నాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు రుణపడి ఉంటామని స్థానికులు చెబుతున్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం ఇదే



నాలుగు దశాబ్దాల పైనుంచి ఇక్కడే జీవిస్తున్నాం. వచ్చిన ప్రతి ప్రభుత్వం ఎన్నికల ముందు ఏదో హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేసేవారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. మా చిరకాల కోరిక తీరడం సంతోషంగా ఉంది.

– సీహెచ్ దుర్గ, స్థానికురాలు

జగనన్నకు అండగా ఉంటాం



నందమూరునగర్‌లో మా ఇళ్లను ఇక్కడి నుంచి తొలగించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ప్రయత్నాలు కూడా చేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు అండగా నిలబడి ఇంటిపట్టాలు ఇచ్చేందుకు ఆమోదం తెలపడం గొప్ప విషయం. మేమంతా జగనన్నకు అండగా నిలబడతాం.

–సత్యనారాయణరాజు, స్థానికుడు

టిప్పర్ ఢీ.. వాహనచోదకుడికి గాయాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపూడికి చెందిన ఇ.విఠల్(58) జక్కంపూడిలో వ్యవసాయం చేస్తుంటాడు. ఈ నెల నాలుగో తేదీ జక్కంపూడిలోని తన పొలాలకు వెళ్లిన విఠల్ తన బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. పాములకాల్వ వద్ద నూతనంగా నిర్మిస్తున్న హైవే వద్దకు వచ్చే సరికి గొలపూడి నుంచి నున్న వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో విఠల్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

9న చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 9వ తేదీ శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. హోమంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. హోమంలో పాల్గొనదలచే భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

దీక్షాస్వాముల నగర సంకీర్తన



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి దీక్షాస్వాములు మంగళవారం గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి విగ్రహాలతో గ్రామంలోని డౌన్ సెంటర్ నుంచి కోలాట నృత్యాలు, భజన గీతాలతో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం

పాయకాపురం(విజయవాడసెంట్రల్): ఆటో కార్మికులకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నున్న గ్రామంలో మంగళవారం జరిగిన రైల్వే ఆటో వర్కర్స్ యూనియన్ వనభోజనాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టించి పని చేసే ఆటో కార్మికులంటే తనకి అపార గౌరవమని పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్‌తో తనకి విడదీయరాని బంధం ఉన్నట్లు వెల్లడించారు. ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మళ్లీ మన ప్రభుత్వమే

శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజనతో ఏర్పడిన రెవెన్యూ లోటు, చంద్రబాబు సర్కారు నిర్వాకంతో పెరిగిన ఆర్థిక సంక్షోభం, కోవిడ్‌ మహమ్మారి లాంటి సవాళ్లను దీటుగా ఎదుర్కొని గత నాలుగున్నరేళ్లుగా ప్రజలకు మంచి చేశామని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మంగళవారం ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రెవెన్యూ లోటు, తగ్గిన ఆదాయం, పెరిగిన ఖర్చులు, కేంద్ర నిధుల తగ్గుదలను గణాంకాలతో సహా వివరించారు. టీడీపీ హయాంలో రాబడి, అప్పులు, ఖర్చులను వైఎస్సార్‌సీపీ వచ్చాక ఎలా ఉందో వెల్లడిస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు. అంతటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొని కూడా గత సర్కారు చేయని విధంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించామని గుర్తుచేశారు. డీబీటీ, నాన్‌ డీబీటీ పథకాలతో ప్రజలకు మొత్తం రూ.4.31 లక్షల కోట్లను అందించామన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ వాస్తవాలను వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్‌ మాట్లాడారు.


మాట్లాడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌

> **నమ్మకం ఉంటే ఇన్ని పొత్తులెందుకు?**
>
> 'మనందరి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు మంచి కాకుండా చెడు చేసిందని, మేనిఫెస్టో వాగ్దానాలను అమలు చేయలేదని ప్రతిపక్షం అంతగా నమ్మితే ప్రజలే మనల్ని ఓడిస్తారని ధీమాగా ఉండొచ్చు కదా? వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఏమొచ్చింది? చంద్రబాబు ఒక జాతీయ పార్టీతో ప్రత్యక్షంగా, మరో జాతీయ పార్టీతో పరోక్షంగా అవగాహన కుదుర్చుకోవాల్సిన అవసరం ఏముంది? కుట్రలతో పరువు దక్కించుకోవాల్సిన దుస్థితి విపక్షానికి ఎందుకు దాపురించింది? రాష్ట్రంలో ప్రతిపక్షం బలపడలేదు. ఇటువైపు.. నేను ఒక్కడినే ఉన్నా. అభివృద్ధి చేసిన అధికార పార్టీకి తిరుగులేదు'
>
> - సీఎం వైఎస్‌ జగన్‌

➤ గత ప్రభుత్వ విధానాలతో కీలకమైన విద్య, వ్యవసాయం, మహిళా సాధికారత కుదేలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం 2018 మార్చిన విడుదల చేసిన నివేదికను గమనిస్తే విద్యారంగంలో జీఈఆర్‌ రేషియో జాతీయ స్థాయిలో 96.91 శాతం ఉంటే మన రాష్ట్రంలో 83.29 శాతమే ఉంది. ఆ డేటా చూస్తే అమ్మ ఒడి పథకం ఎంత అవసరమో అందరికీ అర్థమవుతుంది. గత సర్కారు హయాంలో ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్‌లో రాష్ట్రం చివరిన మూడో స్థానంలో ఉంది. దాన్ని మనం ఏ స్థాయికి తీసుకొచ్చామో గణాంకాలు చూస్తే అర్థమవుతుంది.

➤ చంద్రబాబు రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. రూ.87 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని దగా చేశారు. ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు కూడా ఇవ్వలేకపోయారు. రైతుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యాయి. మనం వచ్చాక రైతు భరోసా పథకం అందించి తోడుగా నిలిచాం. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను చంద్రబాబు మోసం చేశారు. సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేస్తానని దగా చేశారు. మనం అధికారంలోకి వచ్చాక పొదుపు సంఘాలకు జీవం పోశాం.

➤ 'ట్యాక్స్‌ బాయోన్సీ' అన్నది అత్యంత ప్రధానం. పెద్ద పెద్ద సిటీల్లో ట్యాక్స్‌ రెవెన్యూ ఎక్కువగా ఉంటుంది. అందుకే నేను విశాఖపట్నం గురించి గట్టిగా చెబుతా. జాతీయ స్థాయిలో జీడీపీ గమనిస్తే వ్యవసాయ రంగం నుంచి 18 శాతం ఉంటే తెలంగాణలో 17 శాతం ఉంది. మన రాష్ట్రంలో 34 శాతం వ్యవసాయ రంగం నుంచి ఉంది. మనది రైతులతో కూడిన ఎకానమీ. దీని వల్ల ఎబిలిటీ టూ జనరేట్‌ ట్యాక్స్‌ రెవెన్యూ తగ్గుతుంది. హైదరాబాద్‌ లాంటి నగరం లేకపోవడం, విభజన వల్ల రాష్ట్రం ఏటా రూ.13 వేల కోట్లను ఆదాయపరంగా నష్టపోతున్నాం. ఈ పదేళ్లలో రూ.1.35 లక్షల కోట్లు నష్టపోయాం. రాష్ట్రాన్ని విడగొట్టే సమయంలో చట్టంలోనైనా ప్రత్యేక హోదా ఇస్తామని పొందుపరచి ఉంటే మనం కోర్టుకు వెళ్లి తెచ్చుకునేవాళ్లం. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టారు. చట్టంలో చేర్చకపోవడంతో ప్రత్యేక హోదా ఎండమావిగా మారిపోయింది. కేంద్రంలో అధికార పార్టీకి పూర్తి మెజారిటీ లేకపోతే, మన మద్దతు అడిగిన వారిని మనం గట్టిగా డిమాండ్‌ చేయగలిగేవాళ్లం.

➤ ఇన్ని ఇబ్బందులు, సవాళ్ల మధ్య మన ఆర్థిక వ్యవస్థను 56 నెలలుగా సమర్థంగా నడుపుతూ ముందడుగులు వేస్తున్నాం. ఎక్కడా అవినీతి అన్నదే లేకుండా వ్యవస్థను ప్రక్షాళన చేశాం. మన ప్రభుత్వం రాకముందు నిధులు అవినీతి లేకుండా ప్రజలకు చేరేవి కాదు. ఈరోజు బటన్‌ నొక్కడం ద్వారా నేరుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు పంపిస్తున్నాం. ఎక్కడ లంచాలు, వివక్ష లేదు. ఏకంగా రూ.2.55 లక్షల కోట్లు డీబీటీ ద్వారా అందించాం. నాన్‌ డీబీటీ స్కీమ్స్‌ ద్వారా మరో రూ.1.07 లక్షల కోట్లు ఇచ్చాం. (ఇళ్ల స్థలాల మార్కెట్‌ విలువ కూడా తీసుకుంటే దాదాపు రూ.1.76 లక్షల కోట్లు ఉంటుంది)

➤ మన ప్రభుత్వానికి శత్రువులు ఎక్కువగా ఉన్నారు. ఎల్లో మీడియా ఒకే అబద్ధాన్ని చెప్పిందే చెబుతూ గోల చేస్తోంది. మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎక్కువ, మూలధన వ్యయం తక్కువ అని ఆరోపణలు చేస్తున్నారు. జగన్‌ బటన్‌ నొక్కుతున్నాడని ఆరోపిస్తున్నారు. క్యాపిటల్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ చంద్రబాబు హయాంలో సగటున రూ.15,227 కోట్లు కాగా మన ప్రభుత్వ పాలనలో రూ.17,757 కోట్లుగా ఉంది. నాడు– నేడు ద్వారా స్కూళ్లు, ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నాం. అదనంగా మూడు పోర్టులు నిర్మిస్తున్నాం.

➤ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వులు చూడాలనే ఈ ప్రభుత్వం అడుగులు ముందుకు వేసిందని గర్వంగా చెబుతున్నా. ఇచ్చిన హామీలను ఏకంగా 99 శాతం అమలు చేసి మేనిఫెస్టోను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజల ఆశీస్సులు అందుకుంటున్న ప్రభుత్వం మనది మాత్రమే. ఇంటింటి ఆర్థిక వ్యవస్థను మనం మార్చగలిగాం.

➤ చంద్రబాబు వయసు 75 ఏళ్లు. ఆయన రాజకీయాల్లోకి వచ్చి 40 ఏళ్లు. మొదటిసారి సీఎం అయి దాదాపు 30 ఏళ్లు అవుతోంది. మూడు సార్లు సీఎం అయ్యారు. ఇన్నేళ్ల తరువాత కూడా ఫలానిది చేశాను కాబట్టి నాకు ఓటు వేయండి... అని అడిగే దమ్ము చంద్రబాబుకు లేదు. మరోసారి అవకాశం ఇస్తే ఇది చేస్తా అది చేస్తా అంటున్నారు. చంద్రబాబు ప్రతి సామాజిక వర్గాన్ని మోసం చేశారు. ఏ గ్రామంలోనైనా చంద్రబాబు ఫలానిది చేశారని చెప్పేందుకు ఒక్క బిల్డింగ్‌ కనిపించదు. స్కూళ్లన్నీ నిర్వీర్యం చేశారు. మరోసారి కొత్త ఎరలతో ఆ పెద్ద మనిషి బయలుదేరారు. నమ్మినవాడు మునుగుతాడు.. నమ్మించిన వాడు దోచుకోగలుగుతాడన్నది ఆయన సిద్ధాంతం. హైదరాబాద్‌లో కూర్చొని అరడజను వాగ్దానాలతో కిచిడి చేసి మేనిఫెస్టో రూపంలో తెచ్చారు. మేనిఫెస్టోలో వందల హామీలు ఇస్తారు. ఎన్నికల తరువాత చెత్తబుట్టలో వేస్తారు.

ఒక్క అబద్ధమాడితే 2014లోనే సీఎం అయ్యేవాడిని

2014 ఎన్నికల్లో మనకు 45 శాతం ఓట్లు వస్తే మనకంటే దాదాపుగా ఒక్క శాతం ఓట్లు అధికంగా పొంది చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. మనకు చంద్రబాబుకు తేడా ఒక్క శాతం మాత్రమే. నాడు మనం కూడా రూ.87 వేల కోట్లు రైతుల రుణాలను మాఫీ చేస్తామంటూ హామీ ఇద్దామని చాలా మంది నాకు చెప్పారు. చేయలేనిది చెప్పకూడదు.. మాట ఇస్తే తప్పకూడదని ఆ రోజు నేను చెప్పా. ఆ రోజు నేను అధర్మం చేయని కారణంగా ఒక్క శాతం ఓటు తేడాతో ఐదేళ్లు ప్రతిపక్షంలో కూర్చున్నా. ఒక్క అబద్ధం చెప్పి ఉంటే ఆ రోజే ముఖ్యమంత్రి స్థానంలో కూర్చునేవాడిని. కానీ ఈ రోజు కూడా నాకు రిగ్రెట్‌ లేదు. వెనక్కి వెళ్లి మళ్లీ అబద్ధం చెప్పను. నా నోట్లో నుంచి అబద్ధాలు రావు. నేను ఆ రోజు చేసిన పని వల్ల అధికారంలోకి రాకపోవచ్చు. కానీ విశ్వసనీయత అన్న పదానికి అర్థం జగనే అని ప్రజలు నమ్మారని గర్వంగా చెబుతున్నాను.




కరోనా విపత్తు వల్ల రాష్ట్ర ప్రభుత్వం కోల్పోయిన ఆదాయం వివరాలు

రాష్ట్ర ఆదాయం తగ్గినా...

➤ జటిల పరిస్థితుల్లో మనం అధికారంలోకి వచ్చాం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఐదేళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. దేశంలో ఇటువంటి పరిస్థితులు ఎప్పుడూ లేవు. కోవిడ్‌తో రాష్ట్ర ఆదాయం తగ్గింది. అనుకోకుండా ఖర్చులు పెరిగాయి. సాధారణంగా ఏటా రాష్ట్ర ఆదాయం పెరుగుతుంది. కానీ గత ఐదేళ్లలో అనూహ్య పరిస్థితులు చూశాం. కేంద్రం వసూలు చేసిన పన్నుల్లో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటా బాగా తగ్గింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులూ తగ్గాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తూ రాష్ట్రాన్ని నడిపించాల్సి వచ్చింది. రాష్ట్ర విభజనతో వచ్చిన ఇబ్బందులు ఇప్పటికీ ఉన్నాయి. రెవెన్యూ లోటును అధిగమిస్తూ గొప్ప పాలన అందించాం.

➤ 2015– 2019లో రాష్ట్రంలో స్టేట్‌ ట్యాక్స్‌ రెవెన్యూ 13.29 శాతం పెరిగింది. ఆ ప్రకారం గ్రోత్‌ రేట్‌ ఉంటే మనకు 2019–24 మధ్య రూ.2,24,603 కోట్లు రావాలి. కానీ రాష్ట్రానికి కేవలం రూ.1,15,552 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రం కాంపౌండ్‌ యాన్యువల్‌ గ్రోత్‌ రేట్‌ 12.76 శాతం ఉండటంతో అనుకున్న మేర మనకు నిధులు ఇవ్వలేకపోయింది. ఈ రకంగా కూడా రాష్ట్రం నష్టపోవాల్సి వచ్చింది. ఆదాయం కోల్పోవడం, ఖర్చుల భారం పెరగడంతో ఆర్థిక వ్యవస్థలో కుదుపు వచ్చింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన గణాంకాలు గమనిస్తే 2013–14లో జీడీపీ రేషియో 50 శాతం ఉంది. వారు అనుసరించిన విధానాల వల్ల 2018 నాటికి డెట్‌ జీడీపీ రేషియోను 48 శాతానికి తగ్గించారు. కోవిడ్‌ వచ్చినప్పటి నుంచి ఇది 61 శాతానికి పెరిగింది. ఇవాళ 57 శాతం ఉంది.

➤ 2015–2019 మధ్య కేంద్ర పన్నుల ఆదాయంలో రాష్ట్రాలకు 42 శాతం వాటా ఇవ్వాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేస్తే 35 శాతం ఇచ్చింది. చంద్రబాబు సర్కారుకు ఆ మాత్రమైనా లబ్ధి కలిగింది. కేంద్రం రాను రాను సెస్‌లు, సర్‌చార్జ్‌ల పేరుతో వాటాను తగ్గించింది. మన ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్ర పన్నుల్లో 31 శాతం వాటా మాత్రమే ఇచ్చారు. ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సి పన్నుల వాటా గమనిస్తే జీఎస్‌డీపీ 2018– 19లో రూ.32 వేల కోట్లు ఉండగా 2019–20లో రూ.28 వేల కోట్లుకు తగ్గింది. 2022– 2023లో రూ.24 వేల కోట్లకు పడిపోయింది. ఇప్పుడిప్పుడే కాస్త కుదుటపడుతోంది.



రాష్ట్రానికి సంబంధించిన అన్ని రకాల అప్పుల వివరాలు


అప్పులపై పదే పదే అబద్ధాలు

➤ అబద్ధాల బ్యాచ్‌ చేసే మరో ఆరోపణ.. రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేస్తోందట! నోటికి హద్దుపద్దు లేకుండా ఇష్టానుసారంగా అబద్ధాలు చెబుతున్నారు. విభజన నాటికి రూ.1.53 లక్షల కోట్లు అప్పు ఉంటే చంద్రబాబు దిగిపోయే నాటికి మొత్తంగా రూ.4,12,288 కోట్లు అప్పులున్నాయి. రూ.4,12,288 కోట్లు అప్పు నుంచి మనం ప్రయాణం మొదలు పెడితే ఇప్పుడు రూ.7.03 లక్షల కోట్లకు చేరింది. చంద్రబాబు హయాంలో అప్పుల పెరుగుదల రేటు 21.78 శాతం ఉంటే మన హయాంలో కేవలం 12.13 శాతమే ఉంది. చంద్రబాబు సమయంలో బటన్లు లేవు, స్కీమ్‌లు లేవు. అప్పుడు ఉన్నది దోచుకో..పంచుకో..తినుకో మాత్రమే.

➤ పరిమితి మించి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోందని కౌరవ సైన్యం ఆరోపణలు చేస్తోంది. చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య పరిమితికి మించి రూ.28,457 కోట్లు అప్పులు చేశారు. మన హయాంలో ఆర్థిక సంఘం సిఫార్సుల కంటే రూ.366 కోట్లు తక్కువగా అప్పులు చేశాం. ఇది వాస్తవం కాదా?

➤ టీడీపీ హయాంలో రాష్ట్ర అప్పులు 7.5 శాతం ఉన్నాయి. అదే సమయంలో కేంద్రం అప్పులు 3.6 శాతమే ఉన్నాయి. మన హయాంలో కేంద్రం అప్పులు 6.5 శాతం ఉంటే మనం అప్పు చేసింది 5.6 శాతం మాత్రమే. అప్పుల పరంగా గానీ, ప్రభుత్వ పరంగా గానీ ఎలా చూసినా సరే గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి చాలా తేడా ఉందని గర్వంగా చెబుతున్నా.

➤ మన ప్రభుత్వం రూ.2.90 లక్షల కోట్లు అప్పు చేస్తే.. ఒకడు రూ.13 లక్షల కోట్లు అంటారు. మరొకడు రూ.10 లక్షల కోట్లు అంటారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏ ఒక్క కుటుంబానికీ మంచి చేయలేదు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎవరి బ్యాంకు ఖాతాలో ఎంత వేశారు? మన ప్రభుత్వం వచ్చాక ఎంత వేశాం? ఇంటింటికీ వెళ్లి చూడమని చెబుతున్నా. అదే రాష్ట్రం, అదే బడ్జెట్‌.. మారిందల్లా ఒక్క ముఖ్యమంత్రి మాత్రమే. అప్పుల గ్రోత్‌ రేట్‌ అప్పటికంటే ఇప్పుడు చాలా తక్కువగా ఉంది. చంద్రబాబు మనకన్నా ఎక్కువ అప్పులు చేసి కూడా ప్రజల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ఎందుకు వేయలేకపోయారో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో కూడా ఆలోచించాలి. మా హయాంలో ప్రతి రూపాయికీ లెక్క ఉంది. ఆధార్‌ నంబర్లతో సహా బ్యాంకు ఖాతాల వివరాలు ఇస్తాం. ఎవరికి ఎంత ఇచ్చామో మేం చెప్పగలం. మరి టీడీపీ హయాంలో నిధులను ఎలా ఖర్చు చేశారో చెప్పగలరా? ఆ నిధుల్లో చంద్రబాబు తిన్నది ఎంత? దత్తపుత్రుడికి ఇచ్చింది ఎంత? ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లతో కూడిన ఎల్లో మీడియాకు ఇచ్చింది ఎంత?



చంద్రబాబు పాలనాకాలంలో పెరిగిన రెవెన్యూ లోటు వివరాలు (పింక్‌ కలర్‌లో)

బాబు పాలనంతా రెవెన్యూ లోటే

➤ మనం వెచ్చిస్తున్న రూ.70 వేల కోట్లకే రాష్ట్రం శ్రీలంక అవుతుందని అంటున్నారే.. మరి రూ.1.24 లక్షల కోట్లు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తే చంద్రబాబు సంపద సృష్టిస్తారంటూ ఎల్లో మీడియా డప్పు కొడుతోంది. చంద్రబాబు ట్రాక్‌ రికార్డు గమనిస్తే ఆయన సీఎం కాకముందు రెవెన్యూ మిగులు ఉండేది. చంద్రబాబు సీఎం అయ్యాక ఏ సంవత్సరం చూసినా రెవెన్యూ లోటే కనిపిస్తుంది. వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో రెవెన్యూ మిగులు ఉంది. చంద్రబాబు ప్రజలకు ఏ స్కీమ్‌ కూడా అమలు చేయలేదు. మరి ఎక్కడ సంపద సృష్టించారో ప్రజలు ఆలోచించాలి. చంద్రబాబు విజనరీ అయితే.. ఆయన పాలనలో రాష్ట్రం మెరుగుపడి ఉంటే జీడీపీలో మన జీఎస్‌డీపీ వాటా ఎంత అని గమనించాలి. 2014–19లో రాష్ట్రం దేశానికి పన్నుల కింద 4.47 శాతం వాటా ఆదాయం ఇస్తే.. మన హయాంలో ఈ ఐదేళ్లలో 4.82 శాతం వాటా ఆదాయాన్ని కేంద్రానికి ఇచ్చాం. దీనిని బట్టి ఎవరు సంపద సృష్టించారో స్పష్టంగా కనిపిస్తోంది. అది కూడా రెండేళ్లు కోవిడ్‌ ఉన్నా, ఆదాయం తగ్గినా, ఖర్చులు పెరిగినా, ఇన్ని పథకాలు అమలు చేస్తూనే ఈ స్థాయిలో జీఎస్‌డీపీ కేంద్రానికి ఇచ్చాం.

➤ మనసు లేని నాయకుడు, మోసం చేసే నాయకుడు కేవలం వాగ్దానాలు మాత్రమే చేస్తాడు. మనసున్న ప్రభుత్వం, అమలు చేసే నిజాలు చెబుతుంది. ఇదీ ఆయనకు, మనకు ఉన్న తేడా. చంద్రబాబుకు వాగ్దానాలు అమలు చేసే ఉద్దేశం లేదు. అమలు చేసిన చరిత్ర అంత కన్నా లేదు. చంద్రబాబు మేనిఫెస్టోని ఏ ఒక్కరైనా నమ్మడం అంటే బంగారు కడియం ఇస్తానన్న పులిని నమ్మినట్లే!

➤ చంద్రబాబు రకరకాల మోసాలు చేశారు కాబట్టే ఆ పార్టీని 23 స్థానాలతో ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. మాట మీద నిలబడ్డాం కాబట్టే 151 స్థానాలు ఇవ్వడమే కాకుండా ప్రతి ఎన్నికలోనూ ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుని వైఎస్సార్‌ సీపీని గెలిపించారు. విశ్వసనీయత అన్నది ఎప్పటికైనా గెలుస్తుంది. ఫలానా వ్యక్తి నమ్మకస్తుడనే గుర్తింపు సంపాదించుకోవాలంటే సంవత్సరాలు పడుతుంది. దేవుడి దయ వల్ల ఆ పేరు వైఎస్సార్‌ సీపీ సంపాదించుకోగలిగిందని గర్వంగా చెబుతున్నా. ఈ రోజు కూడా చెబుతున్నా.. వైఎస్సార్‌ సీపీ చేయగలిగిందే చెబుతుంది. చెప్పింది ఏదైనా కూడా కచ్చితంగా మాట మీద నిలబడుతుందని వంద శాతం చెబుతున్నాను.



టీడీపీ ఇప్పుడు ఇస్తున్న కొన్ని ఎన్నికల హామీలు అమలు చేయాలంటే అయ్యే ఖర్చు వివరాల అంచనా

అధికారం కోసం అడ్డగోలు హామీలు

జగన్‌ ప్రజలకు సంక్షేమ పథకాలు ఎక్కువగా ఇచ్చేస్తున్నాడు! సంక్షేమ పథకాలతో అభివృద్ధి ఆగిపోతుంది. రాష్ట్రం మరో శ్రీలంకలా తయారవుతుంది అని చంద్రబాబు ఇన్నాళ్లూ మాట్లాడారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి అవే రాతలు రాశాయి. ఎన్నికలు వచ్చేసరికి జగన్‌ ఇంతేనా ఇచ్చేది? నేను ఇంకా ఎక్కువ ఇస్తానని చంద్రబాబు నమ్మబలుకుతున్నారు. వీళ్లకు నిజంగా చిత్తశుద్ధి, నిబద్ధత ఉందా? అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ప్రజలను మోసం చేసేందుకు, దోచుకుని పంచుకునేందుకే వీళ్లకు అధికారం కావాలి. చంద్రబాబు మేనిఫెస్టో ఏది చూసినా ఇవే మోసాలు కనిపిస్తాయి. 1995 నుంచి ఇప్పటివరకు చంద్రబాబు మేనిఫెస్టోల్లో 650 వాగ్దానాలు చేశారు. వాటిలో 10 శాతం కూడా అమలు చేయలేదు. చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చే ఒక్క పథకమైనా ఉందా? ప్రజలను మరోసారి మోసగించేందుకే చంద్రబాబు ఆరు వాగ్దానాల పేరుతో వస్తున్నారు. ఇలాంటి వ్యక్తిని నమ్మడం కరెక్టేనా? అని ప్రజలు ఒకసారి ఆలోచించాలి. చంద్రబాబును నమ్మితే... బంగారు కడియం ఇస్తానని చెప్పి అమాంతంగా తినేసే పులిని నమ్మినట్టే.

➤ ఇవాళ 66.34 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. దీనికి ఏడాదికి రూ.36 వేల కోట్లు అవుతుంది. ఉచిత విద్యుత్‌కు రూ.11 వేల కోట్లు ఖర్చు అవుతుంది. సబ్సిడీ కింద బియ్యం రూ.4,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, 104, 108కు రూ.4,400 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు రూ.2,800 కోట్లు, సంపూర్ణ పోషణ, గోరుముద్ద లాంటి 8 పథకాలకు ఏటా రూ.53 వేల కోట్లు ఖర్చు అవుతుంది. వీటిని ఎవరూ రద్దు చేయలేరు.

➤ వాటికి చంద్రబాబు చెప్పిన 6 హామీలు అదనంగా చేరిస్తే.. మహాశక్తి పథకానికి రూ.36 వేల కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ.12,400 కోట్లు, యువగళం పథకానికి రూ.7,200 కోట్లు, దీపం పథకానికి రూ.4,634 కోట్లు, అన్నదాత పథకానికి రూ,10,706 కోట్లు కలిపి రూ.73 వేల కోట్లు అవుతుంది. కచ్చితంగా అమలు చేయాల్సిన 8 పథకాలకు అయ్యే రూ.53 వేల కోట్లకు రూ.73 వేల కోట్లు కూడా కలిపితే రూ.1.26 లక్షల కోట్లు ఏటా ఖర్చు చేయాల్సి వస్తుంది. దుర్బుద్ధితో ప్రజలను దగా చేయడం చంద్రబాబుకు ధర్మమేనా?

అసెంబ్లీలో టీడీపీ రగడ

- కాగితాలు చించి స్పీకర్‌ తమ్మినేనిపై వేసి, విజిల్స్‌ ఊదుతూ రచ్చ
- తప్పని పరిస్థితుల్లో టీడీపీ సభ్యుల సస్పెన్షన్‌

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన సభలో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు అవమానకరంగా ప్రవర్తించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్‌ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం మీద చర్చను అడ్డుకుని రాద్ధాంతం చేశారు. ఇతర సభ్యులు ఎవరూ ప్రసంగించకుండా స్పీకర్‌ను చుట్టుముట్టి నినాదాలు చేశారు. ఎంతకీ వారి తీరులో మార్పు రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారిని సభ నుంచి సస్పెండ్‌ చేశారు. ఉదయం 9 గంటలకు సభ ప్రారంభం కాగానే విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాజీనామాకు శాసనసభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్‌ తమ్మినేని సీతారామ్‌ ప్రకటించారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేలు వల్లూరి రామకృష్ణ చౌదరి (అనపర్తి), అలికిరి జగదీష్‌ (గుత్తి), పరకాల కాళికాంబ (నరసాపురం) అకాల మృతికి శాసన సభ సంతాపం ప్రకటించింది. తర్వాత గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. ఇంతలో టీడీపీ సభ్యులు నిత్యావసర ధరలపై వాయిదా తీర్మానం ప్రవేశ పెట్టాలని డిమాండ్‌ చేశారు. చర్చ పూర్తయ్యాక మాట్లాడదామని స్పీకర్‌ చెప్పారు. ఇందుకు టీడీపీ సభ్యులు అంగీకరించలేదు. ఆ పార్టీ సభ్యులు అచ్చెన్నాయుడు, నందమూరి బాలకృష్ణ, వెలగపూడి రామకృష్ణ, గద్దె రామ్మోహన్‌, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, ఏలూరి సాంబశివరావు, ఆదిరెడ్డి భవాని సహా 15 మంది స్పీకర్‌ పోడియాన్ని చుట్టుముట్టారు. అచ్చెన్న వెల్‌లో ఉండగా, మిగతా సభ్యులు పోడియం పైకి ఎక్కి స్పీకర్‌ కుర్చీని చుట్టుముట్టారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అక్కడితో ఆగకుండా బిల్లు పత్రాలను చింపి స్పీకర్‌పై చల్లి రగడ సృష్టించారు. స్పీకర్‌ వారిని ఎంతగా వారించినా పద్ధతి మార్చుకోకపోవడంతో 48 నిమిషాల్లోనే సభను వాయిదా వేశారు. తిరిగి ఉదయం 10.34 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే టీడీపీ సభ్యులు ఈసారి విజిల్స్‌ తీసుకొచ్చి స్పీకర్‌ చెవుల్లో ఊదడం ప్రారంభించారు. ఇది సరికాదని, స్పీకర్‌ పట్ల అవమానకరంగా ప్రవర్తించడం సభ్యత అనిపించుకోదని మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, అబ్బయ్య చౌదరి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారించినా పట్టించుకోలేదు. వెలగపూడి రామకృష్ణ అత్యుత్సాహం ప్రదర్శించి స్పీకర్‌ వద్దనున్న బెల్‌ను అదే పనిగా మోగించడం ప్రారంభించారు. సభలో ఇతర సభ్యులు మాట్లాడేది ఏదీ వినబడకుండా, స్పీకర్‌ చెప్పేది సభ్యులకు వినిపించకుండా టీడీపీ సభ్యులు నానా రగడా సృష్టించారు. దీంతో మార్షల్స్‌ స్పీకర్‌ తమ్మినేనికి రక్షణగా నిలబడ్డారు. ఎంత వారించినా వినకపోవడంతో టీడీపీ సభ్యులను సభ నుంచి సస్పెండ్‌ చేశారు. వెంటనే వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. బ్రేక్‌ తర్వాత టీడీపీ సభ్యులు 11 నిమిషాలు మాత్రమే సభలో ఉన్నారు.


స్పీకర్‌ చైర్‌ వద్ద విజిల్‌ ఊదుతున్న గద్దె రామ్మోహన్‌

దేశానికే ఆదర్శంగా జనరంజక పాలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ప్రజాబలం ముందు ప్రతిపక్షాలు కుటిల ఎత్తులు పనిచేయట్లేదని శాసనసభలో పలువురు సభ్యులు విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాల్లో భాగంగా మంగళవారం గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో వారు ప్రసంగించారు. సీఎం జగన్‌ నూతన రాజకీయ విధానానికి పునాది వేశారన్నారు. రాజకీయం కోసం సంక్షేమం చేయట్లేదని.. పేదల బతుకులు మార్చేందుకు తలపెట్టిన మహా యజ్ఞంగా అభివర్ణించారు. టీడీపీ నేతలు తాము చేసిందేమీ లేకపోవడంతో ప్రజలకు ఏం చెప్పాలో తెలీక.. ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు 'రా..కదిలిరా..' అంటున్నా ఎవ్వరూ పట్టించుకోవట్లేదని ఎద్దేవా చేశారు. విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, మహిళా సాధికారత, సామాజిక న్యాయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఒరవడిని సృష్టించిందన్నారు. అనంతరం గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదం చెప్పే తీర్మానాన్ని శాసనసభ ఆమోదించింది. సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్‌ ప్రకటించారు. ఇక సభలో సభ్యులు ఏమన్నారంటే..

చంద్రబాబు ఓ విఫల నాయకుడు



విభజనతో గాయపడిన తర్వాత ఏపీలో ఒక శాతం ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాష్ట్ర ఆర్థిక వనరులను దోచుకుని జన్మభూమి కమిటీలతో అరాచకం సృష్టించింది. ఫలితంగా చంద్రబాబు ఓ విఫల నాయకుడిగా మిగిలిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలోని జనరంజక పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. నవరత్నాల పేరుతో పేదలకు కూడు, గూడు గుడ్డ, ఒకేసారి కల్పించిన మనస్సున్న నేతగా సీఎం జగన్‌ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. టార్చ్‌బేరర్‌గా విద్యను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పుడు పేదింటి బిడ్డలు ఇంగ్లీషు విద్యలో రాణిస్తున్నారు. చట్టసభల్లో ఓసీ సీట్లను సైతం వెనుకబడిన వర్గాలకు కేటాయించారు. ఇవే యావత్తు దేశాన్ని ఏపీ వైపు చూసేలా చేసింది.

– కొరముట్ల శ్రీనివాసులు, ప్రభుత్వ విప్‌

బాబు పేరు చెబితే ఒక్క స్కీమూ గుర్తుకు రాదు



ఒంటరిగా పోటీచేసే సత్తాలేక ప్రతిపక్షాలు బుర్రకథ మేళంగా వెళ్తున్నాయి. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా చూసిన తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించడం ఓ చరిత్ర. మూడుసార్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీమూ గుర్తుకురాదు. కానీ, స్కాంల కథలు కోకొల్లలు. అందుకే ప్రజలు ఆయన్ని 'రా.. వదలరా' అంటున్నారు. ప్రజల స్థితిగతులు మారాయంటే విని తట్టుకునే శక్తి టీడీపీ వాళ్లకులేదు. ప్రస్తుతం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పాలన సాగిస్తున్నాం. టీడీపీ పాలనలో నెలకు రూ.500 కోట్ల చొప్పున ఐదేళ్లు లోకేశ్‌కు దోచిపెట్టారు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్‌

వివక్షకు తావులేకుండా సంక్షేమం



కుల, మత, రాజకీయ, లింగ వివక్షకు తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం జగన్‌ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో సాచురేషన్‌ విధానంలో లబ్ధిదారుల ఎంపిక చేపట్టారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగనంత సంక్షేమం, అభివృద్ధి గడిచిన 57 నెలల పాలనలో సీఎం జగన్‌ చేసి చూపించారు. ఇక ప్రభుత్వ చర్యలతో 2019లో 12 శాతంగా ఉన్న పేదరికం ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు శాతానికి తగ్గింది. అసలు చెప్పుకోదగ్గ ఒక్క పథకం కూడా బాబుకులేదు. అందుకే ఒంటరి పోటీకి భయపడుతున్నాడు.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే

టీడీపీ తెలుగు దుష్ప్రచార పార్టీ



గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను చేరువ చేస్తూ జనరంజకంగా సీఎం జగన్‌ పాలన చేపట్టారు. ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ టీడీపీ తెలుగు దుష్ప్రచారాల పార్టీగా మారింది. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌–1గా నిలిపేలా సీఎం జగన్‌ కృషి చేస్తున్నారు. 2019కి ముందుతో పోలిస్తే ప్రస్తుతం కేరళ కన్నా కూడా ఏపీనే అక్షరాస్యతలో ముందంజలో ఉండటం గమనార్హం.

– కె. రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయిలో బలం చెక్కుచెదరలేదు: రాపాక



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయిలో బలం చెక్కుచెదర లేదని రాజోలు జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో మంగళవారం తనను కలిసిన విలేకరులతో ఆయన ముచ్చటించారు. 'వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకత ఉందంటూ కొందరు బయట మార్కెట్‌లో చేస్తున్న హడావుడికి.. గ్రామాల్లో ఉన్న పరిస్థితికి పొంతన లేదు. వాస్తవానికి ప్రజలు సీఎం జగన్‌ను బలంగా నమ్ముతున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారంతా వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారు. ముఖ్యంగా మహిళలు వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతునిస్తున్నారు.' అని రాపాక చెప్పారు.

అడ్వొకేట్స్‌ సంక్షేమ నిధి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

సాక్షి, అమరావతి: ఏపీ అడ్వొకేట్స్‌ వెల్ఫేర్‌ ఫండ్‌ ఎమెండ్‌మెంట్‌ బిల్లు 2024కు మంగళవారం శాసనసభ ఆమోదం తెలిపింది. డిప్యూటీ సీఎం అంజాద్‌ బాషా ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 13 జిల్లాల బార్‌ కౌన్సిళ్లలో న్యాయవాదుల సంక్షేమ కమిటీలు మూడేళ్ల కాలపరిమితితో ఉండేవన్నారు. ఈ నేపథ్యంలో వాటి కాలపరిమితిని ఐదేళ్లకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. స్టాంప్‌ విలువను రూ.100 నుంచి రూ.250కు పెంచేందుకు, ఇందులో రూ.228 మొత్తాన్ని న్యాయవాదుల సంక్షేమ నిధికి, రూ.22 గుమస్తాల సంక్షేమ నిధికి కేటాయిస్తూ సంక్షేమ నిధి కమిటీ నిబంధనలు 43జీ, 44, 12, 12ఏలను సవరించినట్లు వివరించారు. ఇకపై కోర్టుల్లో వకాలత్‌ వేసిన ప్రతి పిటిషన్‌పైనా రూ.250 స్టాంప్‌ను అతికించనున్నారు. దీంతో సంక్షేమ నిధికి సుమారు రూ.30 కోట్లకు చేరనుంది.

మీడియా పాయింట్

కలియుగ శల్యుడు పవన్



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలియుగ శల్యుడు. ఆయన సీఎం కాలేదని, ఎమ్మెల్యే అవ్వలేదని, మీరు ఆగండంటూ కార్యకర్తలను అంటున్నారు. నాడు కర్ణుడి ధైర్యాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన వాడు శల్యుడు. ఇప్పుడు యుద్ధానికి సిద్ధమైన జనసేన కార్యకర్తల మానసిక స్థైర్యాన్ని చంపే వాడిని శల్యుడు అంటారు. కలియుగ భారతంలో శల్యుడి పాత్ర పవన్ పోషిస్తున్నారు. పల్లకీ మోయాలి అని చెప్తున్న పవన్ కలియుగ శల్యుడే. ఆయన శల్యుడు కాబట్టే సీఎం జగన్ అర్జునుడు అంటే బాధ కలిగి మాట్లాడుతున్నాడు. సీఎం జగన్ ప్రభుత్వం వల్ల మేలు జరిగిన ప్రతి కుటుంబం, ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీకృష్ణుడిలా తనకు అండగా ఉండి నడిపించమని సీఎం జగన్ కోరుతున్నారు. రేపు జరిగే కురుక్షేత్రంలో కుట్రలు, కుతంత్రాలతో కూటములు కట్టి మందిగా వస్తున్న కౌరవులను మట్టి కరిపించడానికి ప్రజలు సిద్ధమయ్యారు. కుటుంబ బంధాలు, మానవ సంబంధాల గురించి, కుటుంబ జీవితం గురించి పవన్ దగ్గర నేర్చుకోవడంకంటే హాస్యాస్పదం ఏముంటుంది? జనసైకోలు చిరంజీవిని దూషించినప్పుడు పవన్ కళ్యాణ్ నోరు ఏమైంది? ఇవాళ సన్నాయి నొక్కులు, పత్తిత్తు కబుర్లు చెబుతున్నారు పవన్. నా తల్లిని దూషిస్తారా అంటూ టీడీపీ, లోకేశ్, చంద్రబాబుపై గతంలో పవన్ రంకెలేశారు. సిగ్గు, శరం ఉన్నవారు ఎవరైనా తల్లి, తండ్రి, చెల్లి, భార్య అనే బంధాలకు విలువిచ్చేవాడైతే తల్లిని తిట్టిన వాడిని ఏం చేస్తారు? చేతనైతే వాడి పాడె మోస్తారు, లేదంటే దుర్మార్గంగా తాను మేలు చేస్తే తన తల్లిని తిట్టి అవమానించిన వాడిని శిక్షించాలి అని కోరుకుంటారు. కానీ పవన్ ఆయన తల్లిని తిట్టిన వారి పల్లకీ మోస్తున్నారు. ఇతడినేమనాలి?

జంపింగ్ జపాంగ్ బాలశౌరి

సీఎం జగన్ అసత్యాలు, అబద్ధాలు మాట్లాడతాడని జంపింగ్ జపాంగ్ బాలశౌరి నోటికొచ్చినట్లు మాట్లాడారు. బాలశౌరి దేనికి సిద్ధం? పారిపోవడానికి సిద్ధమా? పారిపోయే బతుకులు ఎవరివి? 2004 మన బతుకు ఎక్కడ? తెనాలి, తెనాలి నుంచి 2009లో నరసరావుపేటకు పారిపోయింది ఎవరు? 2014లో గుంటూరుకు పారిపోయింది ఎవరు? 2019లో గుంటూరు నుంచి బందరుకు పారిపోయింది ఎవరు? పారిపోయే బతుకులు ఎవరివి? నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి లేకపోతే నీకు బతుకు లేదు. సీఎం జగన్ ఏం పుట్టు మచ్చలు నీకు తెలుసు? అన్నీ తెలిసినవాడివే అయితే వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎందుకు పోటీ చేయాలి? పవన్ కళ్యాణ్‌కు బాలశౌరి నిజస్వరూపం త్వరలోనే తెలుస్తుంది గోడలు దూకే బాలశౌరి లాంటి వాడికి దేవుడు మేలు చేస్తాడా? చిన్న ఉద్యోగస్తులు, వర్కర్లు, సర్వర్లు అంటే చంద్రబాబుకు చిన్నచూపు. చంద్రబాబు దృష్టిలో వారికి అసలు విలువే లేదు. అందుకే ఇటువంటి పెత్తందారీ మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు రేపు జరగబోయే ఎన్నికల కురుక్షేత్రంలో కాల్చి వాతపెట్టాలి.

– పేర్ని నాని (వెంకట్రామయ్య), మాజీ మంత్రి

పవన్‌వి ప్రగల్భాలు



ప్రజా క్షేమాన్ని కాంక్షించే వారే రాజకీయ పార్టీ పెట్టాలి. చిరంజీవి పార్టీ పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారు. తప్పు సరిదిద్దుకొనేందుకే పవన్ పార్టీ పెట్టారనుకొన్నాం. చంద్రబాబు కోసం పార్టీ పెట్టారన్న విషయం బయటపడింది. లోకేశ్ అవినీతిపరుడని మాట్లాడిన పవన్ ఇప్పుడు టీడీపీతో అంటకాగుతున్నారు. పేదలకు సాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ని ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారు. పవన్ అసహాయ రాజకీయ నాయకుడు. ప్రజా సంక్షేమం అందించటంలో సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. దీంతో ఓర్చుకోలేకపోతున్న ఎల్లో మీడియా ప్రజల దృష్టి మళ్లించడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది. మా పథకాలు ప్రజల్లోకి వెళ్లాయి. మా ప్రభుత్వం ఏమీ చేయలేదని చెప్పే ధైర్యం వారికి లేదు.

– చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

పవన్‌కు నేను ఛాలెంజ్ చేశా



కాకినాడ సిటీ నుంచి పోటీ చేయాలని గతంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు నేను ఒక ఛాలెంజ్ విసిరాను. నాపై చేసిన ఆరోపణలపై ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నా ఇప్పటికీ పవన్ స్పందించలేదు. పవన్ పోటీ చేసి గెలిస్తే ఆయన నాపై చేసిన ఆరోపణలు నిజం అని తేలుతాయి. అందుకే నా ఛాలెంజ్‌ను స్వీకరించి కాకినాడలో పవన్ పోటీ చేస్తారని ఎదురు చూస్తున్నా. తోకముడిచి వెళ్లిపోతే నాపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని ప్రజలకు బహిరంగంగా చెప్పి, క్షమాపణ కోరాలి. సీఎం జగన్ కోసం ఏ త్యాగానికైనా నేను సిద్ధం. సీఎం జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి ఒక చారిత్రక అవసరం. అందుకే సీఎం జగన్ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి అనుగుణంగా నడుస్తాం.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే

టీడీపీ శాశ్వత బాయ్‌కాట్ ఖాయం



టీడీపీ సభ్యులు సభలో ఏదో ఒక గొడవ సృష్టించి సభ నుండి ఏదో ఒకలా బయటకు వచ్చేస్తున్నారు. సభలో చంద్రబాబు లేరు కాబట్టి వారిని తిడతారని ఆ విధంగా ప్రవర్తిస్తున్నారు. వీరు ఇలాగే చేస్తుంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని ప్రజలు శాశ్వతంగా బాయ్‌కాట్ చేస్తారు. ఈ ఐదేళ్ళలో సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి – సంక్షేమం రెండు కళ్ళుగా సుపరిపాలన అందించారు. 99 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలను పొందారు. అన్ని పథకాల లబ్ధిదారుల్లో 75 శాతం మంది మహిళలే ఉన్నారంటే స్త్రీలకు ఈ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యతను ఇస్తోందో అర్థమౌతోంది. చంద్రబాబు హయాంలో ప్రజలకు ఏ మేలూ జరగలేదు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రస్తుతం ఉన్న 23 సీట్లు కూడా రావు.

– వరుదు కళ్యాణి, శాసన మండలి సభ్యురాలు

సీఎం జగన్‌తోనే నా ప్రయాణం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే నా రాజకీయ ప్రయాణం సాగుతుంది. కొన్ని కారణాల వల్ల మడకశిరకు కొత్త ఇన్‌చార్జి నియామకం జరిగింది. బీ ఫారం వచ్చేంత వరకూ నేను ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటానని మాత్రమే అన్నాను. వైఎస్సార్‌సీపీకి, వైఎస్సార్ కుటుంబానికి, సీఎం జగన్‌కి వ్యతిరేకంగా నేనెక్కడా చిన్న మాట కూడా అనలేదు. అనబోను కూడా. నేను వైఎస్సార్ వల్లే రాజకీయాల్లోకి వచ్చాను. ఏ పరిస్థితుల్లోనూ పార్టీ మారను. సీఎం జగన్ ని వదిలిపెట్టి పోను. 45 ఏళ్లుగా వైఎస్సార్ కుటుంబాన్ని అంటి పెట్టుకుని ఉన్నాను కనుక అవసరమైతే వాళ్లతోనే కొట్లాడే హక్కు కూడా నాకుంది. అందుకే టికెట్ కోసం ప్రయత్నిస్తూనే ఉంటాను. నేను అసంతృప్తితో ఉన్నట్టు, పార్టీ మారుతున్నట్టు వస్తున్న వదంతులు పూర్తిగా అవాస్తవం.

– డాక్టర్ ఎం. తిప్పేస్వామి, మడకశిర ఎమ్మెల్యే

సీఎం జగన్ ఏది చెబితే అది చేస్తా



సీఎం జగన్‌లోని హీరోయిజానికి ఆకర్షితుడైన వాడిని. సీఎం జగన్ ఏది చెబితే అది చేస్తా. నేను అసంతృప్తితో ఉన్నానని, పార్టీ మారుతున్నానంటూ వస్తున్న వార్తలు అవాస్తవం. ఈ వార్తలు బాధ కలిగిస్తున్నాయి. జీవితాంతం రుణపడి ఉండేలా సీఎం జగన్ నాకు సహాయం చేశారు. ఈ ఐదేళ్లూ సీఎం జగన్ వెంట సైనికుడిలా నడిచాను. ఇక ముందు కూడా అలాగే ఉంటాను. వ్యవస్థలో మార్పు కోసం సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారు. రాజకీయాల్లో సోషల్ ఇంజనీరింగ్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడూ ఇలా చేయలేదు. దీన్ని చేయాలంటే మానవులకు సాధ్యం కాదు. దైవ దూతలకే సాధ్యం. అందుకే ప్రజల ఆరాధ్య దైవంగా సీఎం జగన్ అందరి గుండెల్లో ఉండి పోతారు.

– సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే

అభివృద్ధిని అంకెలతో సహా చెబుతాం.. కాదనగలరా?

- టీడీపీకి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సవాల్
- విద్య, వైద్యం, సంక్షేమం.. ఏ రంగంలో ఎంత మార్పు వచ్చిందో నిరూపిస్తాం
- ప్రభుత్వాన్ని ప్రజల ముంగిటకు చేర్చిన నాయకుడు సీఎం జగన్
- టీడీపీకి కుర్చీలపైనే వ్యామోహం
- తొడలు కొడితే కుర్చీలు రావడానికి ఇది సినిమా కాదు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2019 నుంచి ఇప్పటి వరకు ఎంత అభివృద్ధి జరిగిందో అంకెలతో సహా చెబుతామని, కాదని టీడీపీ సభ్యులు నిరూపించగలరా అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సవాల్ చేశారు. విద్య, వైద్యం, సంక్షేమం ఏ రంగంలో ఎంత మార్పు వచ్చిందో నిరూపిస్తామన్నారు. టీడీపీకి స్పీకర్‌పైన, అసెంబ్లీపైన గౌరవం లేదని, కుర్చీలపై వ్యామోహం మాత్రమే కనిపిస్తోందని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ కుర్చీ లాక్కున్నాక ప్రతి కుర్చీ లాక్కోవాలని చూస్తున్నారన్నారు. తొడలు కొడితే కుర్చీలు రావడానికి ఇది సినిమా కాదని ఎద్దేవా చేశారు. 'రా కదిలిరా' అంటే జనం రావడంలేదని చెప్పారు. స్పీకర్‌పై పేపర్లు విసిరి దాడి చేయడం బాధాకరమని చెప్పారు. అబ్బయ్య చౌదరి మంగళవారం శాసన సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం తగ్గిందని సాక్షాత్తు నీతి ఆయోగ్, యూఎన్‌డీపీ నివేదికల్లో పేర్కొనడం అభినందనీయమని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ పేదలు – ధనవంతుల మధ్య వ్యత్యాసాన్ని తగ్గిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన విద్య ద్వారానే పేదరికం పోతుందని నమ్మారని, అందుకే విద్యా రంగానికి ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో 45 వేల పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దారన్నారు. అందరికీ ఆరోగ్యం అన్నది అమెరికా వంటి దేశాల్లో కూడా లేదని, కానీ ఇక్కడ ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. సంక్షేమాన్ని పేదల ఇంటికి చేర్చారని అన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాన్నే పేదల వద్దకు తీసుకెళ్లారన్నారు. దాదాపు 550 సేవలు నేరుగా పేదలకు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలల నిర్మాణంతో పాటు 53 వేలకు పైగా వైద్య సిబ్బందిని నియమించారని చెప్పారు. టీడీపీ పాలన ఐదేళ్లలో కేవలం 34,108 ఉద్యోగాలిస్తే, సీఎం జగన్ 4 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ఈ నాలుగున్నరేళ్లలో పేదల పక్షాన నిలబడిన విధానం, ఏ విధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లారో గవర్నర్ ప్రసంగంలో వివరించారని తెలిపారు. 99 శాతం హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌ను అభినందించడం నిజంగా గర్వంగా ఉందన్నారు. నిజమైన నాయకుడు ప్రజల అభివృద్ధిని కోరుకుంటారని అన్నారు. రూ.404 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం, కన్వెన్షన్ సెంటర్, నిర్మించామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సామాజికంగా మన రాష్ట్రం మిగిలిన రాష్ట్రాలకంటే చాలా వెనుకబడి ఉన్నట్టుగా సీఎం జగన్ గుర్తించారని, ఆ పరిస్థితిని మార్చి పేదలకు అండగా నిలవాలని నవరత్నాలను ప్రారంభించారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మన రాష్ట్రంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా లేదని చెప్పారు.

బాబు మోసాల రాజకీయంపై పుస్తకమే రాయొచ్చు: బియ్యపు మధుసూదన్ రెడ్డి



దేవుడి లాంటి అంబేడ్కర్ గురించి మాట్లాడుతుంటే టీడీపీ సభ్యులు తట్టుకోలేక పోతున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పుడు విజయవాడలో పైన అమ్మవారు.. కింద అంబేడ్కర్ కన్పిస్తున్నారని అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో సీఎం జగన్ చేసి చూపించారని, రెండోసారి కూడా ఆయనే సీఎం కావాలని జనం కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల దీవెనలతో మళ్లీ జగన్ సీఎంగా వస్తున్నారని చెప్పారు. మోసాలతో రాజకీయాలు ఎలా చేయొచ్చో చంద్రబాబుపై ఓ పెద్ద పుస్తకమే రాయొచ్చని చెప్పారు. చంద్రబాబులా రాజకీయాలు చేయకూడదని పాఠ్యాంశంలో చేర్చవచ్చన్నారు. కుప్పంలో కూడా చంద్రబాబు గెలవలేరన్నారు. సైకిల్ పోవాలి.. జగన్ మళ్లీ రావాలని అన్నారు.

విశాఖ రైల్వే జోన్ ఆఫీస్ పనులు ప్రారంభించండి

రైల్వే మంత్రి, బోర్డు చైర్‌పర్సన్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ రైల్వే జోన్ కార్యాలయం పనులను వెంటనే ప్రారంభించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సింహాలను వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి కోరారు. మంగళవారం ఢిల్లీలో వారిద్దరిని కలిసి రైల్వే అంశాలపై చర్చించారు. జోన్‌కు సంబంధించి జీవీఎంసీ అధికారులు 52.5 ఎకరాల స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎంకు లేఖ పంపిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. అనకాపల్లి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న పలు రైల్వే పనులకు అనుమతులిచ్చినందుకు రైల్వే బోర్డు చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి త్వరతగతిన పనులు పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలని కోరినట్లు ఎంపీ చెప్పారు.

సభను అడ్డుకునేందుకు వచ్చారా!?

- టీడీపీ సభ్యుల తీరుపై 'మండలి' చైర్మన్ ఆగ్రహం



సాక్షి, అమరావతి : 'సభను అడ్డుకోవాలని వచ్చారా.. మీ వాలకం చూస్తే సభ జరగకూడదని ప్రిపేర్ అయ్యి వచ్చినట్లు ఉంది'.. అని టీడీపీ ఎమ్మెల్సీల తీరుపై శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసన మండలి సమావేశంలో అధిక ధరలపై చర్చించాలని టీడీపీ సభ్యులు, మెగా డీఎస్సీపై చర్చించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మంగళవారం ఇచ్చిన వాయిదా తీర్మానాలను చైర్మన్ మోషేన్‌రాజు తిరస్కరించారు. అనంతరం.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభం కాగానే టీడీపీ సభ్యులు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ సభ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. చైర్మన్ పోడియంపైకి వచ్చి సభలో గందరగోళం సృష్టించారు. దీంతో సభను చైర్మన్ కొద్దిసేపు వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభం కాగానే వెల్‌లోకి వచ్చిన టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో సభా సమయాన్ని వృధా చేయడం సరికాదని, సభ జరగడానికి సహకరించాలని చైర్మన్ టీడీపీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మీ తీరు చూస్తుంటే సభను అడ్డుకునేందుకే వచ్చినట్లుందని.. నిద్రపోయేవాడిని లేపొచ్చుగానీ.. నిద్ర నటిస్తున్న వారిని లేపలేమని మండిపడ్డారు. 'మండలి' చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఏదైనా విషయం సభ దృష్టికి తేవాలంటే సరైన పద్ధతిలో చర్చించవచ్చని, సభా సమయాన్ని వృధా చేయడం సరికాదని తప్పుబట్టారు. వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. ప్రతి విషయాన్ని రాజకీయం చేసి గవర్నర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న టీడీపీ సభ్యులు అదే గౌరవ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చను అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ చర్చను వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించిన పలువురు టీడీపీ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు. మరోవైపు.. అసెంబ్లీలో ఆమోదించిన ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి, ఏపీ న్యాయవాదుల గుమాస్తాల సంక్షేమ నిధి చట్టాలకు సంబంధించిన రెండు సవరణ బిల్లులను మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రవేశపెట్టడంతో శాసన మండలి వాటిని ఆమోదించింది.

దిక్కుతోచని స్థితిలో టీడీపీ ఉంది

- అంబేడ్కర్ విగ్రహం చంద్రబాబు ఎక్కడ పెట్టారో చెప్పాలి
- విద్య, వైద్యంపై చర్చకు సిద్ధమా!: ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి అన్ని రకాలుగా అభివృద్ధి పనులు చేస్తుంటే టీడీపీ సభ్యులకు నచ్చడం లేదని అందుకే శాసనసభలో చర్చను అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజే సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం శాసనసభ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే టీడీపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'టీడీపీ ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియని దౌర్భాగ్యపు పరిస్థితిలో ఉంది. పోడియంను ఆక్రమించి ఆందోళన చేయడం సరికాదు. టీడీపీ వాళ్లకు సిగ్గురాదు, వాళ్లు మారరు. స్పీకర్‌ను అవమానపర్చడం పరిపాటిగా మారింది. వాళ్ల నాయకుడు అసెంబ్లీలోకి రాలేరు. వీళ్ల ఇక్కడ తిన్నగా కూర్చోలేరు. బలహీన వర్గాలవారు సీటులో కూర్చోవడం వాళ్లకు ఇష్టం లేదు. అందుకే గేలి చేస్తున్నారు. గొడవ పెట్టుకోవడమే వారి లక్ష్యం. గవర్నర్ తన ప్రసంగంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అభినందించారు. బాబు అమరావతిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎక్కడ పెట్టారు. ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలి. 206 అడుగుల ఎత్తులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ కాళ్లు పట్టుకొని వేడుకోండి. విద్య, వైద్యంపై చర్చకు రండి. విద్యారంగాన్ని బాబు ఏ విధంగా నాశనం చేశాడో.. ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ విద్యారంగానికి ఎంత ప్రాధాన్యతనిచ్చారో చూశాం. చంద్రబాబు–వైఎస్ జగన్ ప్రభుత్వం హయాంలో విద్యా రంగంలోని సంస్కరణలపై చర్చకు సిద్ధమా? టీడీపీ హయాంలో కుదేలైన వైద్య రంగానికి నూతన జవసత్వాలు కల్పించారు. బాబు హయాంలో రైతు రుణాలు మాఫీ చేస్తామన్నారు, రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామన్నారు చేశారా?' అని నిలదీశారు.

రెచ్చగొట్టే చర్యలు సరికాదు: అంబటి



ఎమ్మెల్యే అంబటి రాంబాబు మాట్లాడుతూ.. శాసనసభలో పేపర్లు చించి స్పీకర్ మీద వేయడం అవమానకరమైన చర్య అని, రెచ్చగొట్టే ఇలాంటి చర్యలు సరికాదన్నారు. టీడీపీ సభ్యులు తమ అసభ్యకరమైన చర్యలతో తమ సభ్యులను, సభను రెచ్చగొడుతున్నారన్నారు. 'సభాసంప్రదాయాలు తప్పుతున్నారు. మేము కూడా తప్పాల్సి వస్తుంది. మీరు సభలో ఉండదల్చుకున్నారా? లేదా? తేల్చుకోండి. సస్పెండ్ చేయించుకోవాలనుకుంటే చేయించుకోండి. మార్షల్స్‌తో నెట్టించుకోవాలని అనుకుంటే దానికి రెడీ' అని టీడీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన చరిత్ర జగన్‌ది

- హామీలిచ్చి అమలు చేయకపోవడం చంద్రబాబు చరిత్ర
- మండలిలో ధన్యవాద తీర్మానంపై మంత్రి ఆదిమూలపు సురేశ్



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దని మంత్రి ఆదిమూలపు సురేశ్ కొనియాడారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయని చరిత్ర చంద్రబాబుదన్నారు. తన పదవీకాలంలో కరోనా కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్ అని ప్రశంసించారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ మంగళవారం శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి బలపరిచారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, పండుల రవీంద్రబాబు ఈ తీర్మానంపై మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం తరఫున మంత్రి సురేశ్ మాట్లాడుతూ టీడీపీ పథకాలు, ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో అంతా కేవలం ఎన్నికల ముందు ఒకటి రెండు నెలలు మాత్రమేనన్నారు. ఈ విషయం బాబు గత ఐదేళ్ల పాలన చూసిన అందరికీ తెలుసన్నారు. అప్పుడు ఎన్నికల ముందు డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఎగనామం పెట్టారన్నారు. అలాగే పసుపు– కుంకుమ కార్యక్రమాన్ని ఎప్పుడు అమలు చేశారో చూశామన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లపాటు మీనమేషాలు లెక్కపెట్టి, మళ్లీ ఎన్నికల ముందు అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. గవర్నర్ చెప్పిన ప్రతి అంకె, ప్రతి మాట అక్షర సత్యాలేనని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను సీఎం జగన్ భగవద్గీతగా, బైబిల్, ఖురాన్‌గా భావిస్తున్నారని చెప్పారు.

పారదర్శకంగా.. అవినీతి లేకుండా..

ఈ నాలుగేళ్ల 9 నెలల కాలంలో జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, పథకాలతో రాష్ట్రంలో పేదల నిష్పత్తి తగ్గింది వాస్తవం కాదా అని మంత్రి సురేశ్ టీడీపీ సభ్యులను ప్రశ్నించారు. అవినీతిలేకుండా, జవాబుదారీతనంతో పారదర్శకంగా అర్హులందరికీ ప్రభుత్వం పథకాలను అందిస్తోందన్నారు. దీనికి సీఎం వైఎస్ జగన్ సమర్థ నాయకత్వమే కారణమని తెలిపారు. అనంతరం మూజువాణి ఓటుతో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నట్లు చైర్మన్ మోషేన్‌రాజ్ ప్రకటించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

వైద్య పరికరాల ఉత్పత్తికి రూ.24 వేల కోట్లతో ప్రోత్సాహం

రాజ్యసభ

రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: అధునాతన వైద్య పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయంగా వాటి ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో రూ.24,300 కోట్లతో అనేక ప్రోత్సాహక పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రసాయన, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2020-21 నుంచి 2022-23 వరకు 22,274 డాలర్ల విలువైన వైద్య పరికరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోగా.. మన దేశం నుంచి కేవలం 8,846 డాలర్ల విలువైన వైద్య పరికరాలను మాత్రమే ఎగుమతి చేసినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా అధునాతన వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక చర్యలకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ జాబితా సవరణ బిల్లులకు ఆమోదం


ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన గిరిజన తెగలైన బోండో పోర్జా, ఖోండ్ పోర్జా, పరంగిపెర్జా తెగల కలలు నెరవేరాయి. వారిని షెడ్యూల్డ్ తెగలుగా గుర్తిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశాలో ఎస్సీ, ఎస్టీల జాబితాను సవరించే రెండు బిల్లుల్ని మంగళవారం రాజ్యసభ ఆమోదించింది. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ.. అండమాన్ నుంచి ప్రధాన భూభాగం వరకూ 75 అత్యంత వెనకబడిన గిరిజన సమూహాలు విస్తరించి ఉన్నాయన్నారు. వీటిలో 10 సమూహాలను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చకపోవడం వల్ల అన్యాయాలను ఎదుర్కొంటూ హక్కుల్ని కోల్పోయాయన్నారు. బలహీన గిరిజన సమూహాల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్ని మార్చడానికి కేంద్రం పలు పథకాలు తీసుకొచ్చిందని, బిల్లులు సమర్థించినందుకు సభకు కేంద్రమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని గిరిజన సంఘాల్ని షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చాలని పలువురు సభ్యులు తీసుకొచ్చిన ప్రతిపాదనలను కేంద్రం పరిశీలిస్తోందని చెప్పారు.

గిరిజన పథకాలకు బడ్జెట్ పెంచాలి



గిరిజన పథకాలకు బడ్జెట్ మరింత పెరిగేలా చూడాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య నిమిత్తం నేషనల్ ఫెలోషిప్, స్కాలర్‌షిప్‌కు బడ్జెట్ తగ్గించిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీలో షెడ్యూల్డు తెగల జాబితా సవరణ, ఒడిశాలోని షెడ్యూల్డు కులాలు, తెగల జాబితా సవరణ బిల్లులకు మద్దతుగా మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన గిరిజనులకు సంబంధించి ఖచ్చితమైన రికార్డు లేకపోవడం శోచనీయమని, ఖచ్చితమైన మూల్యాంకనం అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

పారిశ్రామిక నీటి కాలుష్యాన్ని తగ్గించాలి



దేశవ్యాప్తంగా పారిశ్రామిక నీటి కాలుష్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ కోరారు. రాజ్యసభలో మంగళవారం నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) బిల్లుకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 శాతం కంటే ఎక్కువ పరిశ్రమలు పర్యావరణ ప్రమాణాలు పాటించడం లేదన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రసాయనాలు/ఎరువులు, సిమెంట్ పరిశ్రమలపై రూ.13.40 కోట్లకు పైగా పర్యావరణ పరిహారాన్ని విధించినప్పటికీ నీటి కలుషితం యథేచ్ఛగా కొనసాగుతోందన్నారు. ఈ బిల్లు ద్వారా పర్యావరణ పరిరక్షణ నిధికి జమ చేసిన మొత్తాన్ని నీటి కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులను ఎదుర్కోవడానికి ఉపయోగించాలని సూచించారు.

నెలాఖరు నాటికి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి



నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బరు నెలాఖరు నాటికి పూర్తవుతుందని ఏపీ ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చినట్టు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ప్రాజెక్టు విలువ రూ.288.8 కోట్లు కాగా.. ఇందులో కేంద్ర వాటా రూ.138.29 కోట్లు అని తెలిపారు.

రూ.12,79,331 కోట్ల రుణాలు





ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకుల్లో సెప్టెంబర్ 2023 నాటికి అన్‌సెక్యూర్డ్ రిటైల్ లోన్స్ రూ.12,79,331 కోట్లుగా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాడ్ తెలిపారు.వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, బీద మస్తానరావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆ ప్రతిపాదన ఏదీలేదు

ఆంధ్రప్రదేశ్‌లో మోడరనైజ్డ్, ఇంప్రూవ్ డిసీజ్ సర్వైలెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్ ఏర్పాటు ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ తెలిపారు. దేశవ్యాప్తంగా పది టైర్-1, పది టైర్-2 సిటీల్లో ఈ యూనిట్లు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పబ్లిక్ పరీక్షల బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

లోక్‌సభ



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో అవతకవకలకు పాల్పడే వారిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లు-2024కు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. బిల్లుపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ మాట్లాడుతూ.. పబ్లిక్ పరీక్షలు, ఉద్యోగ నియామకాల పరీక్ష పత్రాల లీక్ కారణంగా నష్టపోయిన కోట్లాది మంది యువత ఈ తరహా బిల్లు కోసమే ఎదురు చూస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష పత్రాలు లీక్‌చేసే వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో ఓబీసీల చేర్పు అభినందనీయమని ఎంపీ చింతా అనూరాధ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ స్థానిక సంస్థల చట్టాల బిల్లుకు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు ప్రకటించారు.

ఏకలవ్య పాఠశాలలు అత్యవసరం



గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు అత్యవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. జమ్మూకశ్మీర్ షెడ్యూల్డ్ కులాల, తెగల ఆర్డర్ సవరణ బిల్లులు-2024కు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు ప్రకటించారు.

వేగివాడలో డీఎస్‌పీ



పశ్చిమ గోదావరి జిల్లా వేగివాడలో 'డిమానిస్ట్రేషన్ కం సీడ్ ప్రొడక్షన్ ఫారం' (డీఎస్‌పీ) ఏర్పాటు చేసినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబిచ్చారు.

విశ్వవిద్యాలయాల్లో ఫ్రీ కోచింగ్




అంబేడ్కర్ ఫౌండేషన్ (డీఏఎఫ్)', అంబేడ్కర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (డీఏసీఈ) ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసం ఉచిత కోచింగ్ స్కీమ్ నిర్వహిస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి ఎ.నారాయణ స్వామి తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ మార్గాని భరత్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 24 కృషి విజ్ఞాన కేంద్రాలు







రైతులు వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలను అవలంభించేందుకు ఏపీలో 24 కృషి విజ్ఞాన కేంద్రాల(కేవీకేల)ను ఏర్పాటు చేసినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, గోరంట్ల మాధవ్, కోటగిరి శ్రీధర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబిస్తూ.. అనంతపురం, చిత్తూరు, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ జిల్లాల్లో రెండేసి చొప్పున, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఒకటి చొప్పున కేవీకేలు ఉన్నట్టు వివరించారు. మిల్లెట్, ఎర్రపప్పు, బెంగాల్ చిత్రా, కదిరి, వేరుశనగ వంటి పంటల ఉత్పత్తి కోసం కరువు ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మొబైల్ సందేశాలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.



'రోహిత్ బ్యాటర్‌గా రాణించాలని కెప్టెన్సీ తప్పించాం'

ఐపీఎల్‌లో రోహిత్ శర్మ యథేచ్ఛగా పరుగులు చేయాలనే ఉద్దేశంతోనే కెప్టెన్సీ నుంచి తప్పించినట్లు ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ మార్క్ బౌచర్ వివరించాడు. ఇది చాలా కఠినమైన నిర్ణయం. కానీ జట్టు కోసం తప్పలేదు. రోహిత్ గత రెండు సీజన్లుగా జట్టును సమర్థంగా నడిపించాడు. ఇందులో సందేహం లేదు. కానీ పరుగులు చేయడంలో వెనుక బడ్డాడు. ఇప్పుడు అతను ఏ ఒత్తిడి లేకుండా తనకిష్టమైన ఓపెనింగ్ పాత్రలో మెరిపించేందుకు మా నిర్ణయం దోహదం చేస్తుంది' అని బౌచర్ అన్నాడు.



గుజరాత్ జెయింట్స్ జట్టు హెడ్ కోచ్‌గా క్లింగర్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో తలపడే గుజరాత్ జెయింట్స్ జట్టుకు కొత్త హెడ్ కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన మైకేల్ క్లింగర్‌ను నియమించారు. తొలి సీజన్‌లో ఆస్ట్రేలియాకే చెందిన రాచెల్ హేన్స్ కోచింగ్‌లో బరిలోకి దిగిన జెయింట్స్ అట్టడుగున నిలిచింది. 2017లో ఆస్ట్రేలియా తరఫున మూడు అంతర్జాతీయ టి20లు ఆడిన క్లింగర్ తదనంతరం మహిళల బిగ్‌బాష్‌లో సిడ్నీ థండర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేశారు. డబ్ల్యూపీఎల్-2 ఈ నెల 25న మొదలవుతుంది.

రష్మిక సంచలనం

ప్రపంచ 93వ ర్యాంకర్‌పై గెలుపు



సాక్షి, హైదరాబాద్: ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. తొలి రౌండ్‌లో ప్రపంచ 520వ ర్యాంకర్ రష్మిక 2-6, 6-1, 7-6 (7/5)తో ప్రపంచ 93వ ర్యాంకర్, రెండో సీడ్ నావో హిబినో (జపాన్)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. 2 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

అనిరుధ్‌కు రజతం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక లాస్ వేగస్ షూట్ అంతర్జాతీయ ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత సంతతి కుర్రాడు పింజల అనిరుధ్ కల్యాణ్ రజత పతకంతో మెరిశాడు. హైదరాబాద్‌లోని లంగర్ హౌస్ ప్రాంతానికి చెందిన అనిరుధ్ కుటుంబం అమెరికాలో నివసిస్తోంది. లాస్ వేగస్‌లో రెండు రోజులపాటు జరిగిన ఈ టోర్నీలో అమెరికాకు ప్రాతినిధ్యం వహించిన అనిరుధ్ రికర్వ్ కబ్ కేటగిరీలో పోటీపడి రెండో స్థానంలో నిలిచాడు. అనిరుధ్ మొత్తం 547 పాయింట్లు స్కోరు చేసి రజతం నెగ్గాడు. ఇదే టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ స్టార్ వెన్నం జ్యోతి సురేఖ 898 పాయింట్లతో పదో ర్యాంక్‌లో నిలిచింది.

జూలైలో జింబాబ్వేకు భారత్

హరారే: భారత క్రికెట్ జట్టు ఈ ఏడాది జూలైలో జింబాబ్వేలో పర్యటించనుంది. వెస్టిండీస్, అమెరికాల్లో నిర్వహించే టి20 ప్రపంచకప్ జూన్ 29న ముగియగానే ఈ టూర్ ఉంటుందని బీసీసీఐ తెలిపింది. రెండు జట్ల మధ్య హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో జూలై 6, 7, 10, 13, 14 తేదీల్లో ఐదు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

శ్రమించి... ఛేదించి...

అండర్-19 ప్రపంచకప్‌లో తొమ్మిదోసారి ఫైనల్ చేరిన యువ భారత్

సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై 2 వికెట్లతో విజయం • సచిన్, ఉదయ్ వీరోచిత పోరాటం

ఈ టోర్నీలో ఆడిన మ్యాచ్‌లన్నీ గెలిచిన యువ భారత జట్టుకు 245 లక్ష్యం సులువైందే! కానీ 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయిన టీమిండియాకు ఆ సులువైన లక్ష్యమే క్లిష్టంగా మారింది. ఈ దశలో కెప్టెన్ ఉదయ్ సహారణ్‌కు జతయిన సచిన్ దాస్ ఐదో వికెట్‌కు 171 పరుగులు జోడించడంతో ఓటమి కోరల్లోంచి బయటపడిన భారత్ ఈ మెగా టోర్నీ చరిత్రలో తొమ్మిదోసారి ఫైనల్ పోరుకు అర్హత పొందింది.

బెనోని (దక్షిణాఫ్రికా): ఆరంభం నుంచి అండర్-19 ప్రపంచకప్‌లో అలవోకగా జైత్రయాత్ర చేస్తున్న డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు సెమీస్‌లో అసాధారణ పోరాటం ఎదురైనా... అద్భుతమైన విజయంతో ఫైనల్ చేరింది. తొలి సెమీఫైనల్లో యువ భారత్ 2 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 7 వికెట్లకు 244 పరుగులు చేసింది. ప్రిటోరియస్ (102 బంతుల్లో 76; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), రిచర్డ్ (100 బంతుల్లో 64; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. రాజ్ లింబాని 3; ముషీర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 48.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఉదయ్ (124 బంతుల్లో 81; 6 ఫోర్లు), సచిన్ దాస్ (95 బంతుల్లో 96; 11 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత పోరాటం చేశారు.

సీన్ మార్చిన సచిన్

జట్టు ఖాతా తెరువక ముందే తొలి బంతికే ఆదర్శ్ సింగ్ (0), కాసేపటికే ముషీర్ ఖాన్ (4), అర్షిన్ (12), ప్రియాన్షు (5) పెవిలియన్ చేరారు. ఈ దశలో క్రీజులో ఉన్న కెప్టెన్ ఉదయ్‌కి సచిన్ దాస్ జతయ్యాడు. కెప్టెన్ నింపాదిగా ఆడుతుంటే అడపాదడపా బౌండరీలతో సచిన్ దాస్ లక్ష్యఛేదనకు అవసరమైన పరుగులు పేర్చాడు. అర్ధసెంచరీలతో ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టారు. ఇద్దరు 30 ఓవర్లపాటు అసాధారణ పోరాటం చేశారు. 4 పరుగుల తేడాతో సచిన్ సెంచరీ అవకాశాన్ని చేజార్చుకోగా... హైదరాబాద్ ఆటగాళ్లు అరవెల్లి అవనీశ్ రావు (10), అభిషేక్ మురుగన్ (0) వికెట్లు పడటంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో రాజ్ లింబాని (4 బంతుల్లో 13 నాటౌట్; 1 సిక్స్, 1 ఫోర్) జట్టును విజయ తీరానికి చేర్చాడు. గురువారం ఆస్ట్రేలియా, పాకిస్తాన్ జట్ల మధ్య రెండో సెమీఫైనల్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో తలపడుతుంది.



ఉదయ్



సచిన్ దాస్

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ప్రిటోరియస్ (సి) అభిషేక్ (బి) ముషీర్ 76; స్టీవ్ స్టోల్క్ (సి) అవనీశ్ (బి) రాజ్ 14; టీగెర్ (బి) రాజ్ 0; రిచర్డ్ (సి) మొయిలా (బి) నమన్ 64; ఒలీవర్ (సి) సచిన్ (బి) ముషీర్ 22; మరయిస్ (సి) అభిషేక్ (బి) సామీ పాండే 3; జేమ్స్ (సి) అవనీశ్ (బి) రాజ్ 24; నార్టన్ నాటౌట్ 7; ట్రిస్టన్ నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 244. వికెట్ల పతనం:** 1-23, 2-46, 3-118, 4-163, 5-174, 6-214, 7-220. **బౌలింగ్:** రాజ్ లింబాని 9-0-60-3, నమన్ తివారి 8-0-52-1, అభిషేక్ మురుగన్ 4-0-14-0, అర్షిన్ 2-0-10-0, సామీ పాండే 10-0-38-1, ముషీర్ 10-1-43-2, ప్రియాన్షు 7-1-25-0.

భారత్ ఇన్నింగ్స్: ఆదర్శ్ (సి) ప్రిటోరియస్ (బి) మఫక 0; అర్షిన్ (సి) జేమ్స్ (బి) ట్రిస్టన్ 12; ముషీర్ (సి) జేమ్స్ (బి) ట్రిస్టన్ 4; ఉదయ్ (రనౌట్) 81; ప్రియాన్షు (సి) ప్రిటోరియస్ (బి) ట్రిస్టన్ 5; సచిన్ (సి) టీగెర్ (బి) మఫక 96; అవనీశ్ (సి) నార్టన్ (బి) మఫక 10; అభిషేక్ (రనౌట్) 0; రాజ్ (నాటౌట్) 13; నమన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 27; **మొత్తం (48.5 ఓవర్లలో 8 వికెట్లకు) 248. వికెట్ల పతనం:** 1-0, 2-8, 3-25, 4-32, 5-203, 6-226, 7-227, 8-244. **బౌలింగ్:** మఫక 10-0-32-3, ట్రిస్టన్ 10-1-37-3, నార్టన్ 9-0-53-0, మొకినా 7.5-0-45-0, స్టోల్క్ 2-0-18-0, జేమ్స్ 8-0-44-0, వైట్‌హెడ్ 2-0-17-0.

ఆసీస్ క్లీన్‌స్వీప్



కాన్‌బెర్రా: వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' జేవియర్ బార్ట్‌లెట్ (4/21) దెబ్బకు తొలుత బ్యాటింగ్ దిగిన వెస్టిండీస్ 24.1 ఓవర్లలో కేవలం 86 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఆస్ట్రేలియా దూకుడుగా ఆడి కేవలం 6.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసి నెగ్గింది. జేక్ ఫ్రేజర్ (18 బంతుల్లో 41; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), జోష్ ఇంగ్లిస్ (16 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్ 31 ఓవర్లలోనే ముగియడం గమనార్హం. ఆస్ట్రేలియాకిది 1000వ వన్డే కావడం విశేషం. భారత్ (1055 వన్డేలు) తర్వాత 1000 వన్డేలు ఆడిన రెండో జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది.

విలియమ్సన్ మరో సెంచరీ

528 పరుగుల ఆధిక్యంలో న్యూజిలాండ్



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టుపై న్యూజిలాండ్ పూర్తిగా పట్టుబిగించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తమ ఆధిక్యాన్ని 528 పరుగులకు పెంచుకుంది. 349 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన న్యూజిలాండ్ ప్రత్యర్థి జట్టుకు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ఆడింది. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ 43 ఓవర్లలో 4 వికెట్లకు 179 పరుగులు చేసింది. కేన్ విలియమ్సన్ (109; 12 ఫోర్లు, 1 సిక్స్) రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించడం విశేషం. తద్వారా ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు చేసిన ఐదో న్యూజిలాండ్ క్రికెటర్‌గా విలియమ్సన్ గుర్తింపు పొందాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 80/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 72.5 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో హెన్రీ (3/31), సాన్‌ట్నర్ (3/34), జేమీసన్ (2/35), రచిన్ రవీంద్ర (2/16) రాణించారు.

రుత్విక శివాని ఖాతాలో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్



సాక్షి, హైదరాబాద్: ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి రుత్విక శివాని మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించింది. బెంగళూరులో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టిన రుత్విక (తెలంగాణ)-రోహన్ కపూర్ (ఢిల్లీ) జోడీ చాంపియన్స్‌గా నిలిచింది. ఫైనల్లో రుత్విక-రోహన్ ద్వయం 21-12, 21-16తో ధ్రువ్ రావత్ (ఉత్తరాఖండ్)-త్రిషా హెగ్డే (కర్ణాటక) జోడీపై నెగ్గింది. టైటిల్ గెలిచే క్రమంలో రుత్విక-రోహన్ తమ ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోలేదు.

భారత హాకీ ప్లేయర్ వరుణ్ కుమార్‌పై రేప్ కేసు



యశవంతపుర: 'అర్జున' అవార్డు గ్రహీత, భారత హాకీ ప్లేయర్ వరుణ్ కుమార్‌పై రేప్ కేసు నమోదైంది. 22 ఏళ్ల మహిళ తను మైనర్‌గా ఉన్నప్పుడు వరుణ్ అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ బెంగళూరు పోలీసులను ఆశ్రయించింది. తనకు 17 ఏళ్ల వయసులో 2018లో ఇన్‌స్టాగామ్ ద్వారా ప్లేయర్ పరిచయమయ్యాడని, బెంగళూరులోని 'సాయ్' కేంద్రంలో హాకీ జట్టుకు శిక్షణ శిబిరం జరుగుతుండగా వరుణ్‌ని కలిసినట్లు ఆమె చెప్పింది. ఆ సమయంలో తనని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అతను పలుమార్లు అత్యాచారం చేశాడని సదరు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వరుణ్ భారత్ తరఫున 141 మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ సాధించాడు.

సినిమా

కేరాఫ్ ముంబై

కొందరు దక్షిణాది హీరోలు చలో ముంబై అన్నారు. ఎందుకంటే ఈ హీరోలు కనిపించే చిత్రాల్లో 'ముంబై' బ్యాక్‌డ్రాప్ ఉంది. కేరాఫ్ ముంబై అంటూ సాగే చిత్రాల్లో కొన్నింటి గురించి తెలుసుకుందాం.



• రజనీకాంత్



• రామ్



• ధనుష్



• దుల్కర్ సల్మాన్

డాన్ మొయిద్దీన్ భాయ్

రజనీకాంత్-ముంబై కాంబినేషన్ అంటే 'బాషా', 'కాలా' వంటి సినిమాలు గుర్తుకు వస్తాయి. ఈ జాబితాలో తాజాగా 'లాల్ సలామ్' సినిమా చేరింది. కానీ ఈ చిత్రంలో రజనీకాంత్ హీరో కాదు. ఓ లీడ్ క్యారెక్టర్. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్ చేయగా, రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో ముంబై డాన్ మొయిద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. రెండు వర్గాలకు చెందిన క్రికెటర్ల మధ్య గొడవలను మొయిద్దీన్ ఎలా తీర్చాడు? అనేది చిత్రం ప్రధానాంశం. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది.

డబుల్ ఇస్మార్ట్

ముంబైకి షిఫ్ట్ అయ్యాడట ఇస్మార్ట్ శంకర్. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన హిట్ ఫిల్మ్ 'ఇస్మార్ట్ శంకర్'. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ప్రస్తుతం 'డబుల్ ఇస్మార్ట్' చేస్తున్నారు రామ్, పూరి జగన్నాథ్. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. కాగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం మేజర్‌గా ముంబై నేపథ్యంలో సాగుతుందని ఫిల్మ్ నగర్ సమాచారం. ఓ కీలక షెడ్యూల్ చిత్రీకరణ కూడా ముంబైలో జరిగింది. పూరి జగన్నాథ్, ఛార్మీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను మార్చి 18న విడుదల చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం విడుదల వాయిదా పడినట్లుగా తెలుస్తోంది.

ధారావి?

'గోదావరి', 'హ్యాపీ డేస్', 'లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్', 'ఫిదా' 'లవ్‌స్టోరీ' వంటి సెన్సిబుల్ సినిమాలు తీసిన దర్శకుడు శేఖర్ కమ్ముల సడన్‌గా ట్రాక్ మార్చారు. ముంబై మాఫియా నేపథ్యంలో 'డీఎన్ఎస్' (వర్కింగ్ టైటిల్) సినిమాను తీస్తున్నారట. ధనుష్, నాగార్జున హీరోలుగా నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ ఇది. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. ఇక 'డీఎన్ఎస్' కథ రీత్యా నాగార్జున ఓ పెద్ద డాన్ పాత్రలో కనిపిస్తారని, ఓ సాధారణ యువకుడి స్థాయి నుంచి మాఫియా గ్రూప్ లీడర్‌గా ఎదిగే పాత్రలో ధనుష్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'ధారావి' అనే టైటిల్ పరిశీలించారనే ప్రచారం కూడా జరిగింది. ముంబైలో మురికివాడ ప్రాంతం అయిన 'ధారావి' నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందట. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ తిరుపతిలో మొదలై, పూర్తయింది. నెక్ట్స్ షెడ్యూల్‌ను గోవాలో ప్లాన్ చేశారని తెలిసింది. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత దర్శకుడు శేఖర్ కమ్ములతో సునీల్ నారంగ్, పుస్కూరు రామ్మోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ముంబైలో క్యాషియర్

బొంబాయిలో 'లక్కీ భాస్కర్'గా మారిపోయారు దుల్కర్ సల్మాన్. వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్. 1980 కాలంనాటి బొంబాయి నేపథ్యంలో ఈ చిత్రం కథాంశం ఉంటుంది. ఇందులో మగధ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేసే భాస్కర్ పాత్రలో కనిపిస్తారు దుల్కర్ సల్మాన్. ఇటీవలే ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే రిలీజయ్యే చాన్స్ ఉంది.

గగనాల తేలాను నీ ప్రేమలోన...



• మానుషీ చిల్లర్, వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన ద్విభాషా (తెలుగు-హిందీ) చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషీ చిల్లర్ హీరోయిన్. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'గగనాల తేలాను నీ ప్రేమలోన...' పాట లిరికల్ వీడియోను యూనిట్ రిలీజ్ చేసింది. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ స్వరకల్పనలో రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను అర్మాన్ మాలిక్ పాడారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ- ''దేశాన్ని కాపాడే సైనికుడు 130 కోట్ల మందిని తన కుటుంబంలా భావించి, తన కర్తవ్యాన్ని నిర్వహిస్తాడు. అలాంటి సైనికుల కోసం, వాళ్లు చేసిన త్యాగాల కోసం, వాళ్ల కథని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాం'' అన్నారు.

బేబీని కల్ట్ బొమ్మగా రీమేక్ చేస్తున్నాం

\- ఎస్‌కేఎన్



''ట్రూ లవర్' చిన్న సినిమా. 'ఈగల్'తో పోటీపడేంత పెద్ద చిత్రం కాదు. అయినా అందరి ఆమోదం ఉండటంతో ఈ నెల 10న మా 'ట్రూ లవర్'ని రిలీజ్ చేస్తున్నాం. చిన్నా.. పెద్దా ఇలా అన్ని సినిమాలు విజయం సాధించాలి. అప్పుడే చిత్ర పరిశ్రమలో ఎక్కువమందికి పని దొరుకుతుంది'' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించి తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. ఈ చిత్రానికి డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ సమర్పకులుగా వ్యవహరిస్తూ ఈ నెల 10న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్ మాట్లాడుతూ- ''ఏ బంధంలో అయినా నమ్మకం పునాదిగా ఉండాలనేది 'ట్రూ లవర్'లో మెయిన్ పాయింట్. ప్రేమికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ చిత్రంలో చక్కగా చూపించాడు దర్శకుడు. 'బన్నీ' వాసు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. 'బేబి' సినిమాను హిందీలో 'కల్ట్ బొమ్మ' టైటిల్‌తో సాయి రాజేశ్ డైరెక్షన్‌లోనే రీమేక్ చేయనున్నాం. ప్రస్తుతం సంతోష్ శోభన్, ఆనంద్ దేవరకొండలతో సినిమాలు చేస్తున్నాను. ప్రొడ్యూసర్‌గా అప్పర్ ప్రైమరీలో ఉన్నాను. కాలేజ్ స్థాయికి వచ్చాక అల్లు అర్జున్‌గారితో సినిమా నిర్మిస్తాను'' అన్నారు.

మా కెమిస్ట్రీ చాలా కొత్తగా ఉంటుంది

\- కావ్యా థాపర్



''ఈగల్' సినిమాలో చాలా అద్భుతమైన ప్రేమకథ ఉంది. ఇందులో రచన అనే పాత్ర చేశాను. రవితేజగారు, నా పాత్ర మధ్య కెమిస్ట్రీ చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను చాలా గొప్పగా అలరిస్తుంది'' అని హీరోయిన్ కావ్యా థాపర్ అన్నారు. రవితేజ హీరోగా అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కావ్యా థాపర్ మాట్లాడుతూ- ''ఓ బాలీవుడ్ సినిమా షూటింగ్ కోసం ముంబైలో ఉన్నప్పుడు కార్తీక్ ఘట్టమనేనిగారు 'ఈగల్' స్టోరీ చెప్పారు. కథ చాలా కొత్తగా, అద్భుతంగా అనిపించింది. ఆ తర్వాత లుక్ టెస్ట్ చేసి, నన్ను ఎంపిక చేశారు. ఈ చిత్రంలో యాక్షన్, రొమాన్స్ చాలా కొత్తగా ఉంటాయి. 'రచన పాత్రలో అద్భుతంగా నటించారు. తెరపై కావ్య కాకుండా రచన కనిపించింది' అంటూ చిత్ర రచయిత మణిగారు ప్రశంసించడం చాలా తృప్తిగా అనిపించింది. నా వరకూ రచన పాత్రకు వంద శాతం న్యాయం చేశానని నమ్ముతున్నాను'' అన్నారు.

యాత్ర 2లో ఆ భావోద్వేగాలే చూపించాను

\- మహి వి. రాఘవ్



• కేతకీ నారాయణ్, మహి వి. రాఘవ్, జీవా

''యాత్ర 2'లోని పాత్రలు ఎవర్నీ కించపరిచేలా ఉండవు. ఏ పార్టీనీ విలన్‌గా చూపించలేదు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారి మరణం తర్వాత ఇచ్చిన మాట కోసం (ఓదార్పు యాత్ర) కొడుకుగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారు చేసిన భావోద్వేగ ప్రయాణాన్ని మాత్రమే చూపించాను'' అన్నారు దర్శకుడు మహి వి. రాఘవ్. వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో మహి వి. రాఘవ్ తెరకెక్కించిన 'యాత్ర' సినిమా మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన చిత్రం 'యాత్ర 2'. వైఎస్ఆర్ పాత్రను మమ్ముట్టి చేయగా, ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో హీరో జీవా, వైఎస్ భారతీ రెడ్డి పాత్రలో కేతకీ నారాయణ్ నటించారు. త్రీ ఆటమ్ లీవ్స్, వి సెల్యూలాయిడ్‌తో కలసి శివ మేక నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మహి వి. రాఘవ్ మాట్లాడుతూ- ''మమ్ముట్టిగారు, జీవా, కేతకి, శివ మేక, నేను, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, కెమెరామేన్ మది.. ఇలా యూనిట్ అందరి వల్లే 'యాత్ర 2' బాగా వచ్చింది. జీవా అద్భుతమైన నటుడు. జగన్ అన్న పాత్రకి న్యాయం చేయగలడనే నమ్మకంతో ఎంచుకున్నాను. తెలుగు రాకపోయినా డైలాగ్స్ నేర్చుకుని అంకితభావంతో చేశాడు. 'యాత్ర 2' కథ, ప్రారంభం, ముగింపు అందరికీ తెలిసి ఉండొచ్చు. కానీ సినిమాను ఎలా తీశాం, ఏ భావోద్వేగాలతో నడిపించామన్నది ఎవరికీ తెలియదు. టీజర్, ట్రైలర్‌లో చూసిన ఇలాంటి ఎన్నో ఎమోషనల్ సీన్స్, ప్రజలకు తెలియని ఎన్నో అంశాలు సినిమాలో ఉంటాయి. ఈ మూవీలో వైఎస్ఆర్‌గారి మరణానికి సంబంధించిన కారణాలు చూపించలేదు. జగన్‌గారు ఢిల్లీ పెద్దలను ఎదిరించడం, సీఎం అయిపోవడం అనేది నా కథ కాదు. ఒక పాత్రని హీరో చేయడం కోసం ఇంకో పాత్రను తక్కువ చేసి చూపించాల్సిన అవసరం లేదు. మనమంటే గిట్టని వారు మనపై రాళ్లు వేస్తుంటారు.. బురద జల్లుతుంటారు.. అలాంటి వారిని పట్టించుకోకపోవడమే మంచిది'' అన్నారు.

జీవా మాట్లాడుతూ- ''మహిగారు నాకు కథ చెప్పి, వైఎస్ జగన్‌గారి పాత్ర అన్నప్పుడు షాక్ అయ్యాను. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి నాకు అవగాహన లేదు. కానీ జగన్‌గారి పాత్ర చేయడం బాధ్యతగా అనిపించింది. జగన్‌గారు ఎలా మాట్లాడతారు? ఎలా నడుస్తారు? అని వీడియోలు చూసి తెలుసుకున్నాను. మహిగారు ఈ పాత్రకు నన్ను ఓకే చేయడానికే చాలా టైమ్ తీసుకున్నారు. తొలి సన్నివేశం ఆయన ఓకే చెప్పడంతో నాకు పెద్ద ఉపశమనం అనిపించింది. నేను ఇప్పటి వరకూ వైఎస్ జగన్‌గారిని కలవలేదు.. కలిసే చాన్స్ వస్తే వదులుకోను. 'యాత్ర 2' విడుదల తర్వాత జగన్‌గారు మమ్మల్ని పిలిచి, అభినందిస్తారనే నమ్మకం ఉంది. 'యాత్ర 2' చేస్తున్నప్పుడు ప్రతిపక్షాల నుంచి నాకెలాంటి బెదిరింపు కాల్స్ రాలేదు. అయితే 'యాత్ర' చేస్తున్నప్పుడు మీకేమైనా అలాంటి కాల్స్ వచ్చాయా? అని మమ్ముట్టిగారిని అడిగాను. 'మనం యాక్టర్స్.. ఇది క్రియేటివ్ స్పేస్.. దీన్ని కేవలం సినిమాలానే చూడు' అని ఆయన చెప్పారు. ఈ మూవీలోని 'చూడు నాన్నా' పాట తీస్తున్నప్పుడు చాలా ఎమోషన్‌కు లోనయ్యాను. పులివెందులలో షూటింగ్ చేస్తున్నప్పుడు అక్కడి ప్రజల ప్రేమ, అభిమానం మరచిపోలేను. నా కెరీర్‌లో 'యాత్ర 2' తప్పకుండా ఓ మైలురాయిగా నిలుస్తుందని కచ్చితంగా చెప్పగలను'' అన్నారు.

కేతకీ నారాయణ్ మాట్లాడుతూ- ''నేను మరాఠీ, హిందీ సినిమాలు చేశాను. తెలుగులో 'యాత్ర 2' నా మొదటి చిత్రం. తొలిసారి ఓ రియల్ పాత్ర చేశాను. పాత్రకు తగ్గ భావోద్వేగాలు పండించాను. పులివెందులలో షూటింగ్ చేసినప్పుడు అక్కడి మహిళలు నన్ను హత్తుకుని ఆప్యాయతతో మాట్లాడారు. అప్పుడు ఆ పాత్రలోని ఇంటెన్సిటీ నాకు అర్థమైంది'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
7-2-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▲	455	72,186
నిఫ్టీ ▲	158	21,929

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్‌	15,548	▽ 49
డోజోన్స్‌	38,480	▲ 100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,680	▲ 68
డాక్స్‌	17,033	▲ 129
షాంఘై	2,789	▲ 87
నికాయ్‌	36,161	▽ 194

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,479	▽ 33
బంగారం (99.5 స్వచ్ఛత)	62,299	▽ 37
వెండి (కేజీ)	69,684	▽ 434

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఒకటి	82.64	83.66
£	బ్రిటన్‌ పౌండ్‌	ఒకటి	103.50	105.60
€	యూరో	ఒకటి	88.19	90.54
¥	జపాన్‌ ఎన్‌(100)	ఒకటి	56.10	57.38
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఒకటి	53.14	55.06
S$	సింగపూర్‌ డాలర్‌		59.41	64.08
SAR	సౌదీ రియాల్‌		21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్‌		21.72	23.51
¥	చైనా యువాన్‌		10.43	12.50

బీఎల్‌ఎస్‌ ఈ-సర్వీసెస్‌ బంపర్‌ లిస్టింగ్‌



ముంబై: గత వారమే ఐపీవోకు వచ్చిన బీఎల్‌ఎస్‌ ఈ-సర్వీసెస్‌ బంపర్‌ లిస్టింగ్‌ను సాధించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.135)తో పోలిస్తే ఏకంగా రూ. 174(129%) పెరిగి రూ.309 వద్ద లిస్టయ్యింది. తదుపరి ఒక దశలో 175% దూసుకెళ్లి రూ.371 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి లిస్టింగ్‌ ధర(రూ.309)తో పోలిస్తే 20% అప్పర్‌ సర్క్యూట్‌ను తాకి రూ.371 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్‌ విలువ రూ.2,919 కోట్లుగా నమోదైంది.

కెన్‌స్టార్‌ ప్రచారకర్తగా నటుడు రాజ్‌కుమార్‌ రావ్‌



న్యూఢిల్లీ: ప్రముఖ ఎయిర్‌కూలర్ల తయారీ సంస్థ కెన్‌స్టార్‌ ప్రచారకర్తగా బాలీవుడ్‌ నటుడు రాజ్‌కుమార్‌ రావు నియమితులయ్యారు. కెన్‌స్టార్‌ కూలర్ల అధునాత స్టైల్, సరికొత్త సామర్థ్యాలను వివరించే ప్రకటనలో రాజ్‌కుమార్‌ రావు, ఆయన భార్య పత్రలేఖ పాల్‌ నటించారు. రాజ్‌కుమార్‌ రావు ప్రచారంతో కంపెనీ మరింత మంది కస్టమర్లకు చేరువ అవుతుందని సంస్థ సీఈవో సునీల్‌ జైన్‌ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే వేసవిలో వినియోగదారుల కోసం పలు కూలర్ల మోడళ్లను కంపెనీ అందుబాటులో ఉంచిదన్నారు.

ఇంధన రంగంలో 67 బిలియన్‌ డాలర్ల పెట్టుబడులు

- రానున్న ఆరేళ్లపై భారత్‌ అంచనాలు
- ఇండియా ఎనర్జీ వీక్‌ ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ

గోవా: భారత్‌ వృద్ధి బాటలో భాగస్వామ్యం కావాలని ప్రపంచ పెట్టుబడిదారులను భారత్‌ ఆహ్వానిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. వచ్చే 5 నుండి 6 సంవత్సరాలలో భారత దేశం ఇంధన రంగంలో 67 బిలియన్‌ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇండియా ఎనర్జీ వీక్‌.. రెండవ ఎడిషన్‌ను ఇక్కడ ప్రారంభించిన ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత్‌ ఎకానమీ 7.5% కన్నా అధిక వృద్ధి రేటుతో పురోగమిస్తోందన్నారు. అమెరికా (25.5 ట్రిలియన్‌ డాలర్లు) చైనా (18 ట్రిలియన్‌ డాలర్లు), జపాన్‌ (4.2 ట్రిలియన్‌ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్‌ డాలర్లు)ల తర్వాత దాదాపు 3.8 ట్రిలియన్‌ డాలర్లతో ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, త్వరలో మూడో స్థానానికి చేరడం ఖాయమని మోదీ ఉద్ఘాటించారు. ఇదే విషయాన్ని పలు సంస్థలూ స్పష్టం చేస్తున్నాయని ప్రధాని అన్నారు. 2030 నాటికి దేశం తన రిఫైనింగ్‌ సామర్థ్యాన్ని 254 ఎంఎంటీపీఏ (సంవత్సరానికి మిలియన్‌ మెట్రిక్‌ టన్నులు) నుండి 450 ఎంఎంటీపీఏకి పెంచుతుందని భావిస్తున్నామని ఆయన పేర్కొంటూ... ఈ నేపథ్యంలో భారతదేశ ఇంధన రంగ వృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రపంచ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. ఇంధన రంగంలో మును



పెన్నడూ జరగని విధంగా భారతదేశం భారీ పెట్టుబడులు పెడుతోందని ప్రధాని అన్నారు. 2045 నాటికి దేశ ప్రాథమిక ఇంధన డిమాండ్‌ రెట్టింపు అవుతుందని కూడా ఆయన చెప్పారు.

ముడిచమురు, ఎల్‌పీజీల్లో మూడో స్థానం...

ముడిచమురు, ఎల్‌పీజీ వినియోగం విషయంలో భారత్‌ మూడవ అతిపెద్ద దేశంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఎల్‌ఎన్‌జీ విషయంలో నాల్గవ అతిపెద్ద దిగుమతిదారుగా భారతదేశం ఉందని మోదీ అన్నారు. గత రెండేళ్లలో భారతదేశంలో పెట్రోల్, డీజిల్‌ ధరలు తగ్గాయని పేర్కొన్న ఆయన, ప్రపంచ సవాళ్ల నేపథ్యంలో దేశం ఇంధన నిర్వహణ వ్యూహాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంస్కరణలు దేశీయ సహజ వాయువు ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతున్నాయని మోదీ తెలిపారు.

చమురు, గ్యాస్‌ రంగంలో ఇన్వెస్ట్‌ చేయండి

గ్లోబల్‌ దిగ్గజ సంస్థల సీఈవోలతో ప్రధాని భేటీ

చమురు, గ్యాస్‌ రంగంలో ప్రత్యేకించి అన్వేషణ, ఉత్పత్తిలో పెట్టుబడులకు వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో అపార అవకాశాలు ఉన్నాయని ప్రధాని మోదీ ఈ రంగంలో ప్రముఖ ఎగ్జిక్యూటివ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇండియా ఎనర్జీ వీక్‌ సందర్భంగా ఎక్సాన్‌మొబిల్, బీపీల నుండి ఖతార్‌ ఎనర్జీ, ఫ్రెంచ్‌ దిగ్గజం టోటల్‌ ఎనర్జీస్‌ వరకు దాదాపు 20 మంది టాప్‌ ఎగ్జిక్యూటివ్‌లతో మోదీ సమావేశమయినట్లు అత్యున్నత స్థాయి వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి హాజరైన భారతీయ సీఈఓలలో వేదాంత చైర్మన్‌ అనిల్‌ అగర్వాల్‌తోపాటు రిలయన్స్‌ అధికారులు ఉన్నారు. దేశంలో చమురు, గ్యాస్‌ వనరులను కనుగొని, ఉత్పత్తి చేయడంలో పెట్టుబడులు పెట్టేందుకుగాను ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానించేందుకు ఇటీవల ప్రారంభించిన 'ఎక్స్‌ప్లోరేషన్‌ లైసెన్సింగ్‌ రౌండ్‌' విధానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాగా, రానున్న మూడేళ్లలో చమురు, గ్యాస్‌ ఉత్పత్తిని రోజుకు 300,000 బ్యారెళ్లకు రెట్టింపు చేయడానికి 4 బిలియన్‌ డాలర్ల భారీ పెట్టుబడికి తమ సంస్థ యోచిస్తున్నట్లు ఈ సందర్భంగా అనిల్‌ అగర్వాల్‌ తెలిపారు.

ఖతార్‌తో ఎల్‌ఎన్‌జీ డీల్‌ పొడిగింపు

- 20 ఏళ్లకు 78 బిలియన్‌ డాలర్ల డీల్‌
- ఏటా 6 బిలియన్‌ డాలర్ల ఆదా

బెతుల్‌ (గోవా): ద్రవీకృత సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) దిగుమతులకు సంబంధించిన డీల్‌ను మరో 20 ఏళ్ల పాటు పొడిగిస్తూ ఖతార్‌ఎనర్జీతో దేశీ దిగ్గజం పెట్రోనెట్‌ ఎల్‌ఎన్‌జీ ఒప్పందం కుదుర్చుకుంది. దీని విలువ 78 బిలియన్‌ డాలర్లుగా ఉంటుంది. ఈ డీల్‌ 2048 వరకు అమల్లో ఉంటుంది. ఏటా 7.5 మిలియన్‌ టన్నుల ఎల్‌ఎన్‌జీ కొనుగోలు కోసం ఖతార్‌ఎనర్జీతో ఒప్పందాన్ని పొడిగించుకున్నట్లు పెట్రోనెట్‌ ఎల్‌ఎన్‌జీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్, ఎరువుల ఉత్పత్తి కోసం ఈ గ్యాస్‌ ఉపయోగపడనున్నట్లు పేర్కొంది. ప్రస్తుత రేట్ల కన్నా తక్కువ ధరకే ఎల్‌ఎన్‌జీని ఖతార్‌ సరఫరా చేయనుండటంతో భారత్‌కు ఏటా 6 బిలియన్‌ డాలర్లు ఆదా కాగలదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పుడున్న ధరలతో పోలిస్తే కొత్త ఒప్పందం ప్రకారం యూనిట్‌కు (ఎంబీటీయూ) భారత్‌కి 0.8 డాలర్ల మేర మిగులుతుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం బ్యారెల్‌ బ్రెంట్‌ క్రూడ్‌ ధర 80 డాలర్లుగా ఉండగా ఏటా 7.5 మిలియన్‌ టన్నుల ఎల్‌ఎన్‌జీ దిగుమతుల బిల్లు 3.9 బిలియన్‌ డాలర్లుగా ఉండనుంది. ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే భారత్‌ లక్ష్యానికి ఈ కాంట్రాక్టు తోడ్పడగలదని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్‌ సింగ్‌ పురి తెలిపారు. భారత ఎకానమీ వృద్ధిలో తాము కూడా భాగంగా ఉండాలని ఆశిస్తున్నట్లు ఖతార్‌ ఇంధన శాఖ మంత్రి, ఖతార్‌ఎనర్జీ సీఈవో సాద్‌ అల్‌-కాబి తెలిపారు. ఎల్‌ఎన్‌జీ సరఫరా కోసం ఆస్ట్రేలియా, అమెరికా, రష్యాతో కూడా భారత్‌ ఒప్పందాలు కుదుర్చుకుంది.



పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌ సింగ్‌ పురి, ఖతార్‌ ఇంధన వ్యవహారాల సహాయ మంత్రి సాద్‌ అల్‌-కాబి సమక్షంలో ఒప్పందంపై సంతకాలు చేస్తున్న ఇరు కంపెనీల ప్రతినిధులు

ప్రస్తుతం ఏటా 8.5 ఎంటీపీఏ దిగుమతి..

ఖతార్‌ఎనర్జీ నుంచి పెట్రోనెట్‌ రెండు కాంట్రాక్టుల కింద ఏటా 8.5 మిలియన్‌ టన్నుల (ఎంటీపీఏ) ఎల్‌ఎన్‌జీ దిగుమతి చేసుకుంటోంది. వాటిలో 25 ఏళ్లకు సంబంధించిన 2024లో కుదుర్చుకున్న ఒక ఒప్పందం 2028తో ముగిసిపోనుంది. దీన్నే పెట్రోనెట్‌ తాజాగా పొడిగించింది. భారత ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్‌ ఎనర్జీతో పెట్రోనెట్‌ ఒప్పందం వాటా దాదాపు 35%గా ఉంటుంది.

ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్‌

- సెన్సెక్స్‌ లాభం 455 పాయింట్లు
- 158 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కలిసొచ్చిన విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు

ముంబై: ఐటీ, ఇంధన కంపెనీల షేర్లు రాణించడంతో స్టాక్‌ సూచీలు మంగళవారం దాదాపు లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. సెన్సెక్స్‌ 455 పాయింట్లు పెరిగి 72,186 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158 పాయింట్లు బలపడి 21,929 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 530 పాయింట్లు పెరిగి 72,261 వద్ద, నిఫ్టీ 179 పాయింట్లు బలపడి 72,261 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ క్యాప్‌ సూచీలు ఒకశాతానికి పైగా రాణించాయి. సెన్సెక్స్‌ 455 పాయింట్లు పెరగడంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ల విలువ రూ.4.27 లక్షల కోట్లు పెరిగి రూ.386.88 లక్షల కోట్లకు చేరింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.93 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1096 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్‌ 4%, చైనా 3%, థాయిలాండ్‌ 1%, ఇండోనేసియా, తైవాన్‌ సూచీలు అరశాతం చొప్పున పెరిగాయి. యూరప్‌ మార్కెట్లు 0.50% – 0.75% చొప్పున లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- వరుస 3 రోజుల్లో 42% పతనాన్ని చవిచూసిన పేటీఎం షేరు కోలుకుంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈలో 3% లాభపడి రూ.452 వద్ద స్థిరపడింది.
- టీసీఎస్‌ కంపెనీ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ.15 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. ఐటీ షేర్లలో ర్యాలీలో భాగంగా టీసీఎస్‌ షేరు ట్రేడింగ్‌లో 4.5% ర్యాలీ చేసి రూ.4,150 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. చివరికి 4% లాభపడి రూ.4,133 వద్ద స్థిరపడింది.



ఎస్‌బీఐ క్యాప్స్‌లో ఎస్‌బీఐకు వాటా

డీల్‌ విలువ రూ. 708 కోట్లు

కోల్‌కతా: ఎస్‌బీఐ క్యాప్‌ వెంచర్స్‌లో 100 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌బీఐ తాజాగా పేర్కొంది. ఎస్‌బీఐ క్యాపిటల్‌ మార్కెట్స్‌ చేతిలో ఉన్న ఈ వాటా కొనుగోలుకి రూ. 708 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఇందుకు బ్యాంకు సెంట్రల్‌ బోర్డ్‌ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ ఆమోదముద్ర వేసినట్లు ఎస్‌బీఐ తెలియజేసింది. ఎస్‌బీఐ క్యాప్‌ వెంచర్స్‌ అసెట్‌ అండ్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ మేనేజ్‌మెంట్‌ బిజినెస్‌ నిర్వహణలో కార్యకలాపాలు కలిగి ఉంది. 2023 డిసెంబర్‌కల్లా రూ. 33,055 కోట్ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) కలిగి ఉంది. ఉత్తమ పాలనకు వీలుగా ఎస్‌బీఐ క్యాపిటల్‌ మార్కెట్స్‌లో వాటా కొనుగోలు చేస్తున్నట్లు ఎస్‌బీఐ ఈ సందర్భంగా పేర్కొంది. నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ సైతం ఇందుకు అనుమతించినట్లు వెల్లడించింది. స్వతంత్ర సంస్థల మధ్య లావాదేవీ పద్ధతిలో వాటాను కొనుగోలు చేస్తున్నట్లు వివరించింది.

వాటా కొనుగోలు నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 1.2 శాతం బలపడి రూ. 651 వద్ద ముగిసింది.



జాబ్‌ పాయింట్‌

పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌లో 1025 స్పెషలిస్ట్‌ ఆఫీసర్‌ పోస్టులు

న్యూఢిల్లీలోని పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌(పీఎన్‌బీ) ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం.. దేశవ్యాప్తంగా వివిధ శాఖల్లో స్పెషలిస్ట్‌ ఆఫీసర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1025
» **పోస్టుల వివరాలు:** ఆఫీసర్‌–క్రెడిట్‌(జేఎంజీ స్కేల్‌1)–1000, మేనేజర్‌–ఫారెక్స్‌(ఎంఎంజీ స్కేల్‌2)–15, మేనేజర్‌–సైబర్‌ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్‌2)–05, సీనియర్‌ మేనేజర్‌ సైబర్‌ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్‌3)–05.
» **అర్హత:** ఖాళీలను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీజీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.01.2024 నాటికి ఆఫీసర్‌ పోస్టులకు 21 నుంచి 28 ఏళ్లు, మేనేజర్‌ పోస్టులకు 25 నుంచి 35ఏళ్లు, సీనియర్‌ మేనేజర్‌ పోస్టులకు 27 నుంచి 38 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఆఫీసర్‌కు రూ.36,000 నుంచి రూ.63,840, మేనేజర్‌కు రూ.48,170 నుంచి రూ.69,810, సీనియర్‌ మేనేజర్‌కు రూ.63,840 నుంచి రూ.78,230.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్‌ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్‌ వెరిఫికేషన్, మెడికల్‌ ఎగ్జామినేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పార్ట్‌–1లో రీజనింగ్‌(25 ప్రశ్నలు–25 మార్కులు), ఇంగ్లిష్‌ లాంగ్వేజ్‌(25 ప్రశ్నలు–25 మార్కులు), క్వాంటిటేటివ్‌ ఆప్టిట్యూడ్‌(50 ప్రశ్నలు–50 మార్కులు), పార్ట్‌–2లో ప్రొఫెషనల్‌ నాలెడ్జ్‌(50 ప్రశ్నలు–100 మార్కులు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌ ప్రారంభతేది:**07.02.2024
» **ఆన్‌లైన్‌ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:**25.02.2024
» **ఆన్‌లైన్‌ పరీక్ష తేది:** మార్చి/ఏప్రిల్‌ 2024.
» **వెబ్‌సైట్‌:** www.pnbindia.in

ఏపీ పశుసంవర్ధక శాఖలో 26 వెటర్నరీ అసిస్టెంట్‌ సర్జన్‌ పోస్టులు

ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ బ్యాక్‌లాగ్‌ ఖాళీల నియామక ప్రక్రియలో భాగంగా వెటర్నరీ అసిస్టెంట్‌ సర్జన్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:** బీవీఎస్సీ అండ్‌ ఏహెచ్‌ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.54,060 నుంచి 1,40,540.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌ కార్యాలయం, లబ్బీపేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.02.2024.
» **వెబ్‌సైట్‌:** https://ahd.aptonline.in

యూపీఎస్సీలో 69 పోస్టులు

యూనియన్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్ర విభాగాలు/శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 69
» **పోస్టుల వివరాలు:** స్పెషలిస్ట్‌ గ్రేడ్‌3–40, సైంటిస్ట్‌ బి–28, అసిస్టెంట్‌ డైరెక్టర్‌–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**15.02.2024
» **వెబ్‌సైట్‌:** www.upsc.gov.in

పార్వతీపురం మన్యం జిల్లాలో 14 డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్‌ సబార్డినేట్‌ పోస్టులు

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌ కార్యాలయం.. అవుట్‌సోర్సింగ్‌ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్‌ సబార్డినేట్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14
» **పోస్టుల వివరాలు:** డేటా ఎంట్రీ ఆపరేటర్‌–07, ఆఫీస్‌ సబార్డినేట్‌–07.
» **అర్హత:** ఆఫీస్‌ సబార్డినేట్‌కు పదో తరగతి, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు డిగ్రీ, కంప్యూటర్‌ పరిజ్ఞానం కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్, కలెక్టర్‌ కార్యాలయం, పార్వతీపురం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.02.2024.
» **వెబ్‌సైట్‌:** www.parvathipurammanyam.ap.gov.in.

ఐఐటీల్లో మందకొడిగా ప్లేస్‌మెంట్స్‌

» ఆచితూచి నియామకాలు చేపడుతున్న కంపెనీలు
» ఈ ఏడాది ఐటీ రంగ రిక్రూట్‌మెంట్స్‌లో తగ్గుదల
» కోర్‌ సెక్టార్‌లో నియామకాలు ఆశాజనకంగానే!

ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్స్‌ ఆఫ్‌ టెక్నాలజీ(ఐఐటీ)లు.. కార్పొరేట్‌ కంపెనీల ఫేవరెట్‌ క్యాంపస్‌లు. ఇక్కడ విద్యార్థులకు టాప్‌ కంపెనీలు రెడ్‌ కార్పెట్‌ స్వాగతం పలుకుతూ.. లక్షల ప్యాకేజీతో ఆఫర్లు ఇస్తుంటాయి. కానీ.. 2024 బ్యాచ్‌కు క్యాంపస్‌ డ్రైవ్స్‌లో కొంత అనిశ్చితి! పలు ఐఐటీ క్యాంపస్‌లకు.. ప్రముఖ కంపెనీలు అడుగు పెట్టని వైనం!! ఈ నేపథ్యంలో.. ఐఐటీల్లో క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌ తాజా ట్రెండ్స్‌పై ప్రత్యేక కథనం..



ఐఐటీల్లో క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌ ప్రక్రియ ప్రతి ఏటా డిసెంబర్‌ నుంచి మార్చి వరకు పలు దశలుగా సాగుతుంది. 2024లో సర్టిఫికెట్లు అందుకునే వారికి 2023 డిసెంబర్‌లో తొలిదశ ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌ జరిగాయి. గతేడాదితో పోల్చితే 15 నుంచి 30 శాతం మేరకు ఆఫర్లలో తగ్గుదల కనిపించింది. తొలిదశలో వాస్తవానికి మొదటి రెండు రోజుల్లోనే పూర్తవ్వాల్సిన రిక్రూట్‌మెంట్‌ ప్రక్రియ.. వారం రోజుల పాటు కొనసాగడం తాజా జాబ్‌ మార్కెట్‌ పరిస్థితులకు అద్దం పడుతోందంటున్నారు.

ఆఫర్ల సంఖ్య తగ్గించిన కంపెనీలు

ఈ ఏడాది క్యాంపస్‌ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీలు.. ఆఫర్ల సంఖ్యను తగ్గించడం గమనార్హం. గతంలో ఒక్కో క్యాంపస్‌లో పది మంది వరకు విద్యార్థులను నియమించుకునేవి. తాజాగా గరిష్టంగా రెండు ఆఫర్లకు పరిమితం చేశాయి. ఐఐటీ–ఢిల్లీలో తొలిదశలో ఏడు రోజులకు మొత్తం 1,181 మందికి ఆఫర్లు ఇచ్చారు. గత ఏడాది అయిదో రోజుకే 1,300మందికి ఆఫర్లు లభించాయి. ఐఐటీ–చెన్నైలో సైతం తొలి దశ రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్‌లో 50 శాతం మందికే ఆఫర్లు లభించాయి. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో కూడా గత ఏడాది తొలి దశలోనే 1,128 ఆఫర్లు లభించగా.. ఈ ఏడాది తొలిదశ డ్రైవ్స్‌ ముగిసే నాటికి 989 మందికి మాత్రమే ఆఫర్లు దక్కాయి. ఐఐటీ కాన్పూర్‌లో సైతం గత ఏడాదితో పోల్చితే 30 శాతం తగ్గుదల కనిపించింది.

టాప్‌ జాబ్‌ ప్రొఫైల్స్‌

ఐఐటీల్లో తొలి దశ ప్లేస్‌మెంట్స్‌ ప్రక్రియలో.. డేటా సైంటిస్ట్స్, అల్గారిథమ్‌ ఇంజనీర్స్, డేటా లాంగ్వేజ్‌ ఎక్స్‌పర్ట్, ప్రొడక్ట్‌ మేనేజర్‌ వంటి జాబ్‌ ప్రొఫైల్స్‌కు డిమాండ్‌ నెలకొంది. ముఖ్యంగా ట్రేడింగ్‌ సంస్థలు, ఈ–కామర్స్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్‌ సంస్థలు, ఐటీ కంపెనీలు, స్టార్టప్‌ సంస్థల నుంచి ఈ ఆఫర్లు లభించాయి.

డిమాండింగ్‌ స్కిల్స్‌

ఈసారి క్యాంపస్‌ డ్రైవ్స్‌లో సంస్థలు.. విద్యార్థుల్లోని కోడింగ్‌ నైపుణ్యాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్‌ టెస్ట్‌లు, టెక్నికల్‌ రౌండ్స్‌లో కోడింగ్‌ సంబంధిత నైపుణ్యాలను కంపెనీలు ఎక్కువగా పరిశీలించాయని ఆయా క్యాంపస్‌ల ప్లేస్‌మెంట్‌ వర్గాలు పేర్కొన్నాయి. కోర్‌ ఇంజనీరింగ్, సర్క్యూట్‌ బ్రాంచ్‌లకు సంబంధించి సదరు విభాగాల్లోని ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్, మెషిన్‌ లెర్నింగ్‌ అంశాలపై విద్యార్థులకున్న అవగాహనను పరిశీలించినట్లు తెలిపారు.

టాప్‌ రిక్రూటర్స్‌ వీరే

అంతర్జాతీయ ఆఫర్స్‌ ఇవ్వడంలో.. క్వాల్‌ కామ్, టెక్సాస్‌ ఇన్‌స్ట్రుమెంట్స్, గూగుల్, బార్‌క్లేస్, ఎస్‌ఏపీ ల్యాబ్స్, సిటీ బ్యాంక్, వెల్‌ ఫార్గో, మైక్రోసాఫ్ట్, బీసీజీ, బెయిన్‌ అండ్‌ కో సంస్థలు టాప్‌ రిక్రూటర్స్‌గా నిలిచాయి. డొమెస్టిక్‌ ఆఫర్స్‌ విషయంలో ఉబెర్, హనీవెల్, మైక్రాన్‌ టెక్నాలజీ, ఓఎన్‌జీసీ, ఫ్లిప్‌కార్ట్, బజాజ్‌ ఆటో, టాటా స్టీల్, ఎస్‌టీఎం మైక్రో ఎలక్ట్రికల్స్‌ వంటి సంస్థలు ముందు వరుసలో ఉన్నాయి. పలు పబ్లిక్‌ సెక్టార్‌ యూనిట్లు కూడా ఈసారి ప్లేస్‌మెంట్స్‌ చేపట్టాయి.

వేతనాలు ఇలా

తొలిదశ క్యాంపస్‌ డ్రైవ్స్‌లో సగటు వేతనం రూ.12 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు నమోదైంది. అత్యధిక వేతనం డొమెస్టిక్‌ ఆఫర్లకు రూ.50 లక్షలు, ఇంటర్నేషనల్‌ ఆఫర్లకు రూ.3.5 కోట్ల వరకు లభించింది. ఈ వేతనాలు కూడా గత ఏడాదితో పోల్చితే 10 నుంచి 20 శాతం మేరకు తక్కువగా ఉండడం గమనార్హం. ఐఐటీ చెన్నైలో అత్యధిక వేతనం రూ.రెండు కోట్లు కాగా, సగటు వేతనం రూ.22 లక్షలుగా నమోదైంది. ఐఐటీ–ముంబైలో 22 మంది విద్యార్థులకు రూ.కోటికి పైగా వేతనంతో ఆఫర్లు వచ్చాయి. మొదట్లో ఈ సంఖ్య 85గా వార్తలు వస్తే.. ఐఐటీ–ముంబై వర్గాలు మాత్రం 22 మందికే రూ.కోటికి పైగా ఆఫర్లు వచ్చినట్లు స్పష్టం చేశాయి.

పెద్ద సంస్థల వెనుకంజ

ఈసారి రిక్రూట్‌మెంట్స్‌ డ్రైవ్స్‌లో పెద్ద సంస్థలు.. ఎక్కువ సంఖ్యలో ఆఫర్లు ఇచ్చేందుకు అంతగా మొగ్గు చూపట్లేదని ఐఐటీల ప్లేస్‌మెంట్‌ వర్గాలు తెలిపాయి. అమెజాన్, ఐబీఎం వంటి సంస్థలు తొలి దశలో పలు క్యాంపస్‌లలో అసలు రిక్రూట్‌మెంట్‌ డ్రైవ్‌నే చేపట్టలేదు. కొన్ని ఐఐటీల్లో చేపట్టినా ఆఫర్ల సంఖ్య తక్కువగా ఉంది. అంతర్జాతీయ ఆఫర్లలోనూ ఈ ఏడాది తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా కన్సల్టింగ్, బ్యాంకింగ్‌ రంగాల్లో ఎక్కువగా లభించే ఇంటర్నేషనల్‌ ఆఫర్స్‌ ఈ ఏడాది తగ్గాయి. అమెరికాలో సంక్షోభ పరిస్థితులనే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. అదే విధంగా అమెరికాకు ఐటీ సేవలు అందించే సంస్థలు ఇచ్చే ఆఫర్లు కూడా తక్కువగా నమోదయ్యాయి.

తగ్గిన ఐటీ జాబ్స్‌

ఈ ఏడాది ఐఐటీల ప్లేస్‌మెంట్‌ డ్రైవ్స్‌లో ఐటీ కంపెనీలు తక్కువ సంఖ్యలో పాల్గొన్నాయి. అంతే కాకుండా.. ఐటీ జాబ్‌ రోల్స్, ఆఫర్స్‌ కూడా తక్కువగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం.. కోవిడ్‌ సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన ఐటీ కంపెనీలు ఆ సిబ్బందితోనే కార్యకలాపాలు కొనసాగించాలని నిర్ణయించడమేనని పేర్కొంటున్నారు.

కోర్‌ సెక్టార్‌లో ఓకే

కోర్‌ సెక్టార్‌లో నియామకాలు ఆశాజనకంగానే ఉండటం కొంత ఊరటనిచ్చే విషయమని చెబుతున్నారు. క్యాంపస్‌ డ్రైవ్స్‌ కోసం ఆటోమొబైల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్‌ విభాగాలకు సంబంధించిన పలు సంస్థలు వచ్చాయి. సర్వీస్‌ సెక్టార్‌ నుంచి కూడా ముఖ్యంగా బీఎఫ్‌ఎస్‌ఐ నుంచి కంపెనీలు క్యాంపస్‌ డ్రైవ్స్‌ చేపట్టాయి. మొత్తంగా చూస్తే.. ఐటీ సెక్టార్‌లో ఆఫర్లు తగ్గినా..కోర్‌ సెక్టార్, సర్వీస్‌ సెక్టార్‌లో క్యాంపస్‌ డ్రైవ్స్‌ ఆశాజనకంగానే ఉన్నట్లు ప్లేస్‌మెంట్స్‌ వర్గాలు పేర్కొంటున్నాయి.

అదే కారణమా!

ఐఐటీల్లో ఈసారి ప్లేస్‌మెంట్స్‌లో తగ్గుదలకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. అవి.. అంతర్జాతీయంగా నెలకొన్న సంక్షోభం మొదటిది.. కాగా, రెండో కారణం.. కోవిడ్‌ సమయంలో ప్లేస్‌మెంట్స్‌ భారీగా చేపట్టడం. ఈ కారణంగా..ఇప్పటికే ఆయా సంస్థల్లో మానవ వనరుల సంఖ్య అవసరానికి మించి ఉందని, అందుకే పలు ఐటీ సంస్థలు ఈ సారి నియామకాల సంఖ్యను తగ్గిస్తున్నాయని అంటున్నారు.

స్టార్టప్స్‌వైపు దృష్టి

క్యాంపస్‌ డ్రైవ్స్‌ విషయంలో దిగ్గజ సంస్థలు ఆచితూచి వ్యవహరిస్తున్న పరిస్థితుల్లో... ఐఐటీ ప్లేస్‌మెంట్‌ సెల్స్‌ వర్గాలు స్టార్టప్‌ సంస్థల వైపు దృష్టి పెట్టాయి. గత ఏడాది ఆఫర్లు ఇచ్చి జాయినింగ్‌ లెటర్లు ఇవ్వని కంపెనీలను పక్కనపెట్టి.. పేరున్న ఇతర స్టార్టప్‌లకు ఐఐటీ వర్గాలు స్వాగతం పలుకుతున్నాయి. ఐటీ కంపెనీల్లో నియామకాలు తగ్గుతూ.. స్టార్టప్‌ సంస్థల్లో పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో స్టార్టప్‌ ఆఫర్స్‌ను అంగీకరించే విషయంలో విద్యార్థులు సందిగ్ధ పరిస్థితికి లోనవుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. స్టార్టప్‌ సంస్థల్లో వేతనాలు తక్కువగా ఉండడం. దీంతోపాటు ఆయా సంస్థల సక్సెస్‌పై సందేహాలు. ఒకవేళ స్టార్టప్‌ సంస్థ విజయం సాధించకపోతే తమ కెరీర్‌ కూడా ప్రతికూలంగా మారుతుందనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

మలిదశపైనే ఆశలన్నీ

తొలిదశలో క్యాంపస్‌ డ్రైవ్స్‌ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో.. విద్యార్థులు మలిదశపైనే తమ ఆశలు పెట్టుకున్నారు. ప్లేస్‌మెంట్‌ వర్గాలు సైతం రెండో దశలో ఐటీ, కోర్‌ ఇంజనీరింగ్‌ సంస్థలు వచ్చేలా కృషి చేస్తున్నాయి. ప్లేస్‌మెంట్‌ శాతం 75 నుంచి 77 శాతం నమోదయ్యేలా కృషి చేస్తున్నాయి. మొత్తం ప్లేస్‌మెంట్‌ ప్రక్రియ పూర్తయ్యే నాటికి 70 శాతం మందికి మాత్రమే ఆఫర్లు లభించే అవకాశం ఉందని, గత ఏడాది ఈ సంఖ్య 77 శాతంగా ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఐస్ స్కేటింగ్‌లో దేవి చందనకు రజతం



రజత పతకం సాధించిన దేవి చందన

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా 4వ వింటర్ గేమ్స్‌లో ఏపీ క్రీడాకారిణి యర్రంశెట్టి దేవి చందన తేజస్విని బాయి వెయ్యి మీటర్ల ఐస్ స్కేటింగ్ లాంగ్ ట్రాక్‌లో రజక పతకం సాధించింది. లద్దాఖ్‌లో జరుగుతున్న పోటీల్లో మంగళవారం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. దేవి చందనను శాప్ ఎండీ ధ్యానచంద్ అభినందించారు.

22, 23వ తేదీల్లో అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

సాక్షి, అమరావతి: ఏలూరులోని శాయ్ సెంటర్‌లో 22, 23వ తేదీల్లో అథ్లెటిక్స్ (బాల బాలికలు), వెయిట్ లిఫ్టింగ్ (బాలికలు) 2024–25కు గాను కొత్తగా ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సెంటర్ ఇన్‌చార్జ్ వినాయక ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు 12 ఏళ్ల నుంచి 18ఏళ్ల మధ్య క్రీడాకారులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 22వ తేదీ ఉదయం ఏడు గంటలకు శాయ్ సెంటర్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

టోఫెల్ శిక్షణకు మెంటార్‌షిప్

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచేందుకు అమలు చేస్తున్న టోఫెల్ నిర్వహణకు మెంటార్‌షిప్‌నకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ప్రస్తుతం 3 నుంచి 5 తరగతులకు టోఫెల్ ప్రైమరీ, 6 నుంచి 9 తరగతులకు టోఫెల్ జూనియర్ శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దేందుకు మెంటార్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. ఈమేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. మెంటార్లుగా ఉండేవారు ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నుంచి, అదే గ్రామం/ పట్టణంలోని వారు లేదా జిల్లా వాసులు కూడా ఉండవచ్చని పేర్కొన్నారు. మెంటార్స్‌గా చేరేవారి కోసం బెంగళూరుకు చెందిన ఎన్జీవో సంస్థ 'శిక్షలోకం'తో మెంటరింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ఏర్పాటు చేస్తున్నన్నట్లు తెలిపారు.

విశాఖ బీచ్ సూపర్

ఆర్‌కే బీచ్ అందానికి ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ ఫిదా ● పరిశుభ్రంగా ఉందని కితాబు



ఆర్‌కే బీచ్ పరిశుభ్రతను ప్రశంసిస్తున్న స్టీవ్ హార్మిసన్

విశాఖ సిటీ: విశాఖ ఆర్‌కే బీచ్ అందానికి ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ స్టీవ్ హార్మిసన్ ఫిదా అయ్యాడు. భారత్‌లో తాను చూసిన బీచ్‌లలో రామకృష్ణ బీచ్ అత్యంత శుభ్రమైనది అని కితాబిచ్చాడు. భారత్–ఇంగ్లాండ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ కోసం హార్మిసన్ విశాఖకు వచ్చాడు. ఆయన మ్యాచ్ చివరి రోజు ఆర్‌కే బీచ్‌ను సందర్శించాడు. హార్మిసన్ యూకేకు చెందిన టాక్‌స్పోర్ట్స్ చానల్‌తో మాట్లాడుతూ భారత్‌లో తాను అనేక బీచ్‌లను సందర్శించానని, విశాఖ ఆర్‌కే బీచ్ ఉన్నంత క్లీన్‌గా మరెక్కడా కనిపించలేదన్నాడు. రోడ్డుకు అతి సమీపంలోనే బీచ్ ఉండడం, యంత్రాల ద్వారా క్లీనింగ్ చేయడం అద్భుతంగా ఉందని చెప్పాడు. విశాఖ ప్రజలు కూడా చాలా స్నేహపూర్వకంగా ఉన్నారని హార్మిసన్ ప్రశంసించాడు.

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో...

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో విశాఖ సముద్ర తీర ప్రాంతాలు సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఆదేశాల మేరకు మునుపెన్నడూ లేని విధంగా తీర ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నారు. సముద్రం కోతకు గురికాకుండా విశాఖ పోర్టు డ్రెడ్జింగ్ చేపడుతోంది. గతంలో లేని విధంగా కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు ప్రత్యేక పర్యాటక బీచ్‌లను అభివృద్ధి చేస్తోంది. రుషికొండ బీచ్‌లో కల్పించిన సదుపాయాల కారణంగా ప్రతిష్టాత్మకమైన బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ లభించింది.

గద్దల్లా విశాఖను దోచిన టీడీపీ పెద్దలు

అప్పటి పాపాలే తహసీల్దార్ రమణయ్య హత్యకు కారణం

- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నగరంలో భారీగా భూకబ్జాలు
- అధికారులను ఏమార్చి, రికార్డులను మార్చి స్వాహాపర్వం

విశాఖ సిటీ: టీడీపీ ప్రభుత్వ హయాంలో విశాఖపట్నంలో గజం స్థలం కనిపించినా ఆ పార్టీ నేతలు గద్దల్లా వాలిపోయేవారు. బంజరు.. జిరాయితీ.. ప్రభుత్వ, ప్రైవేటు భూమి అనే తేడా లేకుండా కబ్జాల పర్వం సాగించారు. టీడీపీ పెద్దలు, నేతలు చేసిన పాపాలే ఇప్పుడు రెవెన్యూ అధికారుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. అప్పట్లో టీడీపీ నేతలు వేలాది ఎకరాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. పట్టాలు విక్రయించి రూ.కోట్లు మింగేశారు. కొన్నాళ్లకు అవే భూములను ప్రభుత్వ భూమిగా గుర్తించి 22ఏలో పెట్టించి కొనుగోలుదారులను నిలువునా ముంచారు. అటువంటి తరహా భూ వివాదమే తాజాగా తహసీల్దార్ రమణయ్య హత్యకు కారణమని తెలుస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో విశాఖ జిల్లా నుంచి మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు భూఆక్రమణలపై అదే జిల్లాకు చెందిన మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన ఆరోపణలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. భూఆక్రమణలపై వేసిన సిట్ ముందు కూడా అయ్యన్నపాత్రుడు.. గంటాపైన ఫిర్యాదు చేశారు. అయితే ప్రస్తుతం అవన్నీ మర్చిపోయిన గంటా శ్రీనివాసరావు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేయడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లు ఉందని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ హయాంలో జరిగిన వేల ఎకరాల భూ కబ్జాలను వెలుగులోకి తీసుకువచ్చింది. గంటా అనుచరుల నుంచి గీతం యూనివర్సిటీ ఆక్రమించిన భూముల వరకు అన్నింటినీ వారి చెర నుంచి రక్షించింది.

వాళ్లే క్రమబద్ధీకరించి.. వాళ్లే 22ఏలో పెట్టి..

కబ్జా చేసిన స్థలాలను తమ అనుచరగణానికి కట్టబెట్టేందుకు టీడీపీ ప్రభుత్వం 388 జీవో తీసుకువచ్చింది. ఈ జీవో ద్వారా అప్పటి మంత్రి, ఒక మహిళా నేత ప్రభుత్వ భూములకు పట్టాలిప్పిస్తామని భారీగా దండుకున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు కావాల్సిన వారికి పట్టాలు ఇప్పించేశారు. ఇదే తరహాలో మధురవాడ రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 380లో సుమారు 2 ఎకరాల స్థలానికి అప్పటి మంత్రే పట్టాలు ఇప్పించారు. వాస్తవానికి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని స్థిర నివాసం ఏర్పర్చుకున్న పేదలకు మాత్రమే పట్టాలు ఇవ్వాల్సి ఉంది. కానీ సర్వే నంబర్ 380లో రెండు ఎకరాల్లో 101 ఫ్లాట్లతో భారీ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరిగింది. ఒక్కో ఫ్లాట్‌కు ఒక్కో క్రమబద్ధీకరణ పట్టా ఇచ్చేశారు. తరువాత ఆ స్థలంలో కొంత భాగాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించి 2018లో టీడీపీ ప్రభుత్వమే 22ఏలో పెట్టింది. అప్పటి నుంచి ఆ వివాదం నలుగుతూ ఉంది.

అప్పటి వివాదాల కారణంగానే..

అప్పటి నుంచి ఆ ఫ్లాట్లను క్రమబద్ధీకరించుకోవడంతో పాటు అమ్ముకోవడానికి వీలు కల్పించాలని కొనుగోలుదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఇంతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. టీడీపీ ప్రభుత్వం 388 జీవో ప్రకారం ఇచ్చిన క్రమబద్ధీకరణ పట్టాలను విక్రయించే హక్కు కల్పించడానికి కన్వేయన్స్ డీడ్ ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. దీని ప్రకారం ఆ అపార్ట్‌మెంట్‌లో 93 మంది వరకు కన్వేయన్స్ డీడ్స్ మంజూరయ్యాయి. మిగిలిన 8 ఫ్లాట్లకు సంబంధించి కన్వేయన్స్ డీడ్ చేయిస్తానని ఎన్నారైలతో మురారి సుబ్రహ్మణ్యం గంగారావు డీల్ కుదుర్చుకున్నాడు. ఇందుకోసం వారి నుంచి రూ.లక్షల్లో అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపైనే అప్పటి విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్యను చాలాసార్లు కలిశాడు. ఈ వ్యవహారంలో కొంత మేర నగదు చేతులు మారినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అయితే తహసీల్దార్ పనిచేయకపోవడం, ఆయన తాజాగా విజయనగరం జిల్లాకు బదిలీ అవడంతో గంగారావు కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ కోపంతోనే తహసీల్దార్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

వేల ఎకరాలు కబ్జా చేశారు..



టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రుల నుంచి వారి అనుచరుల వరకు ప్రతి ఒక్కరూ వేల ఎకరాలను కబ్జా చేసేశారు. ఆ తప్పులు కారణంగానే ఇప్పటికీ రూ.వేల కోట్లు విలువైన ప్రభుత్వ భూముల వివాదాలు కోర్టుల్లో నలుగుతున్నాయి. వాటన్నింటినీ దక్కించుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది



ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. టీడీపీ నేతల కబ్జాల నుంచి వేల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం విడిపించింది.

– కె.కె.రాజు, వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త

భూ తగాదాలకు టీడీపీయే కారణం..



టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూవివాదాలే శాంతిభద్రతలకు విఘాతంగా మారుతున్నాయి. నాడు అధికారులపై ఒత్తిడి తెచ్చి నకిలీ రికార్డులు సృష్టించారు. భూతగాదాలకు టీడీపీ నేతలే కారణం.

– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

ప్రభుత్వ భూములు చెరబట్టారు..



విశాఖ భూకబ్జాలకు కేరాఫ్ టీడీపీ. జిల్లాలో నలువైపులా ప్రభుత్వ భూములను చెరబట్టారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని తప్పులు చేసిన గంటా ఇప్పుడు ఏమీ తెలియనట్లు ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు.

– కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

భోగాపురం విమానాశ్రయంతో ఆర్థికాభివృద్ధి

- జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు



మాట్లాడుతున్న గ్రంథి మల్లికార్జునరావు

విజయనగరం అర్బన్: భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక ప్రాజెక్టు అవుతుందని జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంథి మల్లికార్జునరావు తెలిపారు. 50 ఏళ్ల భవిష్యత్తు తరాల అవసరాలకు తగ్గట్టు ఈ విమానాశ్రయం నిర్మాణం జరుగుతోందన్నారు. విజయనగరంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా నిర్మించిన ఏడు విమానాశ్రయాలకు దీటుగా భోగాపురం ఎయిర్‌పోర్టును నిర్మించి విజయనగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెస్తామన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా గ్రూపులుగా వ్యాపారవేత్తలు వస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని చెప్పారు. భవిష్యత్తులో పెద్ద వాణిజ్య కేంద్రంగా విజయనగరం మారనుందన్నారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు గ్రంథి మల్లికార్జునరావును ఘనంగా సత్కరించారు. ఆయన జీవిత చరిత్రను తెలిపే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.